అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 12-01-2019

సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 15 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు వెల : 6.50


వారిదే పెత్తనం..

గ్రామాభివృద్ధి కమిటీలదే హవా.. ఆర్థిక వనరులపైనా పట్టు

- పంచాయతీ పాలన, విధులకు విఘాతం..
- ప్రజాప్రతినిధులను వెనక్కి నెట్టి అన్నింటా ప్రత్యక్షం


మంగలి గడ్డం తీయాలన్నా, గౌడ కులస్తుడు చెట్టు నుంచి దించిన కల్లు అమ్మాలన్నా ధర నిర్ణయించేది వాళ్లే..! గొల్లకుర్మలు గొర్లు, మేకలు మేపాలన్నా, ఊళ్లో బెల్టుషాపులు ఎన్నుండాలన్నా అనుమతించేదీ.. హుకుం జారీచేసేదీ వారే!! ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలో ఏ పని జరగాలన్నా.. ఏ పని చేసుకోవాలన్నా వారి కనుసన్నల్లోనే జరగాలి. ఒకరకంగా అధికారిక విధులకు పోటీగా మరో పాలనా వ్యవస్థ అమలవుతున్నదంటే అతిశయోక్తి కాదేమో. ఆ పెత్తందారీతనానికే గ్రామాభివృద్ధి కమిటీ (వీడీసీ) అనే పేరు. ఏకపక్ష నిర్ణయాలు, ఉల్లంఘిస్తే సాంఘిక బహిష్కరణలతో పచ్చని పల్లెల్లో సమాంతర పాలన సాగించే వీడీసీ రక్కసిపై పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 'నవతెలంగాణ' ప్రత్యేక కథనం...

వివరాలు 9లో



నిరుద్యోగాన్ని పెంచిన నోట్లరద్దు

2016-17 తర్వాత దెబ్బతిన్న కార్మికరంగం : లేబర్‌బ్యూరో సర్వే



న్యూఢిల్లీ : నోట్లరద్దు పర్యవసానాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మోడీ సర్కార్ నోట్లరద్దు నిర్ణయం కోట్లాది మంది పొట్టకొట్టిందని మరో సర్వే తేల్చింది. ఎన్డీయే మొత్తం నాలుగున్నరేండ్ల పాలనలోనే 2016-17 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగం అత్యధికంగా నమోదైంది. నోట్ల రద్దు అనంతరం నిరుద్యోగ సమస్య తీవ్రస్థాయికి చేరుకున్నట్టు లేబర్‌బ్యూరో సర్వే ద్వారా తాజాగా తేల్చింది. అయితే ఈ నివేదిక ఇంకా అధికారంగా విడుదల కాలేదు.

మోడీ ప్రభుత్వం 2016 నవంబర్ 8న పెద్దనోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే. దాంతో, 2016-17 ఆర్థిక ఏడాదిలో నిరుద్యోగం 3.9 శాతానికి చేరుకున్నట్టు లేబర్ బ్యూరో నివేదిక స్పష్టం చేసింది. ఇది మోడీ ప్రభుత్వ నాలుగేండ్ల కాలంలో అత్యధికం కావడం గమనార్హం. మరోవైపు ఇదేకాలంలో ఉపాధిని ఆశిస్తూ కార్మికరంగంలోకి వచ్చినవారి సంఖ్య అధికంగా ఉండటం గమనార్హం. 2015-16లో ఉపాధిరంగాల్లో పని చేయగల వయసువారు 75.5 శాతం కాగా, 2016-17లో 76.8 శాతం.

2013-14లో నిరుద్యోగిత 3.4 శాతం, 2015-16లో 3.7 శాతం కాగా, 2016-17లో 3.9 శాతం. ఈ సర్వే నివేదికను కేంద్ర కార్మిక, ఉపాధిశాఖమంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ ఆమోదించినప్పటికీ బహిరంగ పరచకపోవడం గమనార్హం. పెద్దనోట్ల రద్దు వల్ల అసంఘటిత రంగంలోని కార్మికులు పెద్దసంఖ్యలో ఉపాధి కోల్పోయినట్టు పలు ఇతర సర్వేల్లోనూ వెల్లడైంది. నోట్లరద్దు వల్ల చిన్న,మధ్య పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. లేబర్‌బ్యూరో చివరి సర్వే ఇదే. దీనిస్థానంలో ఇప్పుడు నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్‌ఎస్‌ఎస్‌వో)ద్వారా దేశంలోని వివిధ రంగాల కార్మికశక్తిపై కేంద్రం సర్వే నిర్వహిస్తోంది. యూపీఏ-2 హయాంలో 2012-13లోనూ నిరుద్యోగిత అధికంగా 4 శాతం నమోదైంది.

పారిశ్రామికోత్పత్తి ఢమాల్

19 నెలల కనిష్టానికి పతనం

- నవంబర్‌లో పడకేసిన తయారీ రంగం : సీఎస్‌ఓ గణంకాల వెల్లడి



వివరాలు 10లో

ఆసరాపై ఆశలు

కొత్తగా 15 లక్షల మంది లబ్ధిదారులు గుర్తింపు ?

- 54 లక్షలు దాటనున్న పింఛన్‌దారులు
- ప్రతియేటా రూ. 16 వేల కోట్లు అవసరం
- సర్కారుకు ప్రతిపాదనలు
- కొత్త ఓటర్ల జాబితా ఆధారంగా కసరత్తు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పింఛన్ల లబ్ధిదారుల ఎంపిక కోసం కొత్త విధానం ప్రవేశపెట్టనుంది. ముందస్తు ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా కసరత్తు ప్రారంభించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నూతన విధానం అమల్లోకి రానుంది. ఈమేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) సన్నాహాలు చేపట్టాయి. ఇప్పటికే దాదాపుగా అది పూర్తయింది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి పింఛన్ల సొమ్ము రెట్టింపు కానుంది. వృద్ధులు, వితంతువులు,ఇతర సాధారణ పింఛన్లు రూ. 1000 నుంచి రూ. 2016, వికలాంగ పింఛన్లు రూ.1500 నుంచి రూ.3016కు పెరగనున్నాయి. కాగా ప్రస్తుతం సాధారణ పింఛన్ దార్లకు రూ. 1000, వికలాంగులకు రూ.1500 చెల్లిస్తున్న 39.36 లక్షల పింఛన్లు ఉనికిలో ఉన్నాయి. వీరి కోసం ప్రతినెలా ప్రభుత్వానికి రూ.448 కోట్లు వ్యయమవుతున్నది. అలాగే ప్రతియేటా రూ.5376 కోట్లు కేటాయిస్తున్నారు. తాజా ఓటర్ల జాబితా ...9లో

బెదిరింపులకు భయపడి

- ఇండ్లకు వెళ్లలేకపోతున్న అయ్యప్పను దర్శించుకున్న ఆ ఇద్దరు మహిళలు
- హిందూత్వశక్తుల హెచ్చరికలతో అజ్ఞాతంలోకి..



వివరాలు 2లో

మళ్లీ పెట్రో మోత

హైదరాబాద్‌లో లీటరు పెట్రోలు రూ.73.31



న్యూఢిల్లీ : దేశంలో పెట్రో ధరలు అలా తగ్గుముఖం పట్టాయో లేదో.. మళ్లీ జోరందుకుంటున్నాయి. రెండు రోజులుగా పెట్రోలు, డీజిల్ ధరలు క్రమంగా పెరుగుతున్నాయి. రేట్ల పెంపునకు అంతర్జాతీయంగా చమురు ధరల పెరుగుదలను సాకుగా చూపెడుతున్నాయి ఆయిల్ కంపెనీలు. ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర 69.07 రూపాయలకు(శుక్రవారం నాడు 19 పైసలు వడ్డింపు) చేరుకున్నది. హైదరాబాద్‌లో లీటరు పెట్రోలు ధర రూ.73.31గా ఉన్నది. అటు డీజిల్ ధర కూడా శుక్రవారం 28 పైసలు పెరిగింది. ఢిల్లీలో లీటరు డీజిల్‌కు రూ.62.81 కాగా.. హైదరాబాద్‌లో ఈ ధర రూ.68.32గా ఉన్నది.

అలోక్‌వర్మ రాజీనామా

మనస్తాపంతో ఉద్యోగాన్ని వదులుకుంటున్నా...

- తప్పుడు ఆరోపణలతో తొలగించారు..
- సీబీఐ సమగ్రతను కాపాడే ప్రయత్నం చేశా..

వివరాలు 9లో



బదిలీ చేయటం దారుణం : సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో 9లో..

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి

- రంగారెడ్డి జిల్లా ఔటర్‌పై అంబులెన్స్‌ను ఢీకొన్న కారు
- నలుగురు మృతి.. ముగ్గురిది ఒకే కుటుంబం
- చనిపోయిన బంధువు ఇంటికెళ్తూ దంపతులు...
- నవాబ్‌పేటలో ఆర్టీసీ బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు 10లో..

గ్రామాభివృద్ధికి ఉద్యమబాట

నూతన సర్పంచులు, ఉప సర్పంచులకు శిక్షణా కార్యక్రమాలు

- ఫిబ్రవరి నుంచి మే వరకు.. : సీఎం కేసీఆర్
- ఈసారి ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్టే..


(ఫైల్)
మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించే సర్పంచులు, ఉప సర్పంచులకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దే విషయంలో వారికి సంపూర్ణ అవగాహన కల్పించాలంటూ...9లో

రాజకీయ దురుద్దేశంతోనే సీబీఐ దాడులు

ఐఏఎస్ అధికారిణి చంద్రకళ



లక్నో : రాజకీయ దురుద్దేశంతోనే తన నివాసంపై సీబీఐ దాడులు జరిగాయని ఐఏఎస్ అధికారిణి చంద్రకళ విమర్శించారు. అవినీతిపరుల భరతం పడుతున్న చంద్రకళను లక్ష్యంగా చేసుకొని జరిగిన ఈ దాడులు దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఉత్తరప్రదేశ్‌లో 2012 నుంచి 2016 వరకు జరిగిన ఇసుక అక్రమ తవ్వకాల కేసులో సీబీఐ గత శనివారం ఢిల్లీ, యూపీలోని 14 ప్రాంతాల్లో ముమ్మరంగా సోదాలు చేసింది. ప్రభుత్వ ఉన్నతాధికారులు, కొందరు రాజకీయ నేతల ఇండ్లల్లో ఈ సోదాలు జరిగాయి. కాగా.. సీబీఐ దాడులపై మౌనంగా ఉంటూ వచ్చిన చంద్రకళ ఎట్టకేలకు గురువారం పెదవి విప్పారు. జరిగిన దాడుల వెనుక రాజకీయ కుట్ర కోణం ఉన్నదని 'లింకుడ్‌ఇన్'లో ఆమె పోస్టు చేశారు. రాజకీయ దాడులు కొనసాగుతాయి.. కానీ, జీవితాన్ని పేలవంగా చేసుకోకూడదని ఆమె అభిప్రాయపడ్డారు. అంతేకాక.. 'మీ సమస్యలు.. మీ జీవితాన్ని అసహ్యంగా చేసుకోనివ్వకూడదని' అందర్నీ కోరుతున్నట్టు చెప్పారు. ఇసుక తవ్వకాల్లో అక్రమాలపై కోర్టులో విచారణ జరుగుతున్నదని తెలిపారు. తన నిర్ణయాన్ని తగిన సమయంలో ప్రజాక్షేత్రం ముందు ఉంచుతానని ఆమె స్పష్టం చేశారు. అవినీతికి పాల్పడుతున్న అధికారులను బహిరంగంగానే నిలదీస్తూ సోషల్‌మీడియా కేంద్రంగా చంద్రకళ మంచి పేరు సంపాదించుకున్నారు.

ట్రిపుల్ తలాక్‌పై మరోసారి ఆర్డినెన్స్

- కేంద్రమంత్రివర్గం ఆమోదం



న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాక్‌పై ఆర్డినెన్స్ జారీకి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందగా, రాజ్యసభలో బీజేపీ దాని మిత్రపక్షాలకు తగినంత బలం లేకపోవడంతో పాస్ చేయలేకపోయారు. గతేడాది సెప్టెంబర్‌లోనూ దీనిపై ఆర్డినెన్స్ తేగా దాని కాలపరిమితి ఈ నెల 22తో తీరిపోనున్నది. ఆర్డినెన్స్ ద్వారా వచ్చిన నిబంధనలు ఆరు నెలలు మాత్రమే అమలులో ఉంటాయి. అయితే, ఈ నిబంధన పార్లమెంట్ సమావేశాలు జరగని పక్షంలోనే వర్తిస్తుంది. ఓవేళ పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైతే 42 రోజులలోగా దానిని మరోసారి బిల్లు రూపంలో తేవాలి. ముస్లింలలోని గత సంప్రదాయాలకనుగుణంగా ట్రిపుల్ తలాక్ ద్వారా తన భార్య నుంచి భర్త విడాకులకు యత్నిస్తే, దానిని నేరంగా పరిగణించేలా మోడీ సర్కార్ బిల్లు రూపొందించింది. ట్రిపుల్ తలాక్ నిందితులకు కఠిన శిక్షలు విధించడాన్ని కాంగ్రెస్, వామపక్షాలుసహా పలు సెక్యులర్ పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. బిల్లులో సవరణలను ఆ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రపతి ఆమోద ముద్రతో ఆర్డినెన్స్ అమలులోకి రానున్నది.

నాలుగో రోజుకు చేరిన 'బెస్ట్' సమ్మె

- విరమించండి : బాంబే హైకోర్టు

ముంబయి: బృహన్‌ముంబయి ఎలక్ట్రిక్ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు(బెస్ట్) కార్మికుల సమ్మె శుక్రవారంనాటికి నాలుగో రోజుకు చేరుకుంది. నగరంలో సుమారు 3,700 బస్సులు రోడ్డెక్కకపోవడంతో జన జీవనం స్తంభించిపోయింది. బెస్ట్ చరిత్రలో ఎక్కువ రోజులు నిరసన చేపట్టిన సమ్మెగా ఇది రికార్డులకెక్కనుంది. 1997లో బెస్ట్ కార్మికులు మూడు రోజులపాటు సమ్మె చేశారు. కాగా, బెస్ట్ ఎలక్ట్రిసిటీ విభాగం కార్మికులూ గురువారం నుంచి ధర్నాకు దిగారు. శుక్రవారంనాడు శివసేనతో బెస్ట్ కార్మికులు ఏడుగంటలపాటు పాల్గొన్న చర్చలూ విఫలమయ్యాయి. కాగా, బెస్ట్ సమ్మెకు వ్యతిరేకంగా దాఖలైన వ్యాజ్యాన్ని విచారిస్తూ.. ధర్నాకు దిగిన కార్మికులు సమావేశమై సమ్మెను విరమించుకోవాల్సిందిగా బాంబే హైకోర్టు శుక్రవారం సూచించింది. కార్మికుల యూనియన్ సహకరిస్తే సమస్యలు పరిష్కరించేందుకు బీఎంసీ, బెస్ట్ సిద్ధంగా ఉన్నాయని ఆ సంస్థల తరఫున వాదిస్తున్న న్యాయవాది తెలపడంతో కార్మికులు ముందడుగేసి ధర్నా విరమించాలని కోర్టు తెలిపింది. 2007 తర్వాత నియామకమైన కార్మికులకు మాస్టర్ గ్రేడ్‌కింద వేతనాలు, బెస్ట్ బడ్జెట్‌ను బృమన్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కి చెందిన ఎ విభాగపు బడ్జెట్‌లో విలీనం, 2016 మేలో అందజేసిన డిమాండ్లపై చర్చించాలని బెస్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

'అయోధ్య' విచారణ లైవ్‌లో ప్రసారం

- కేంద్రానికి ఆరెస్సెస్ మాజీ సిద్ధాంతకర్త గోవిందాచార్య విజ్ఞప్తి

న్యూఢిల్లీ: రామ జన్మభూమి- బాబ్రీ మసీదు భూ వివాదం కేసు విచారణను లైవ్‌లో ప్రసారం చేయాలని ఆరెస్సెస్ మాజీ సిద్ధాంతకర్త కెఎన్ గోవిందాచార్య గురువారం కేంద్రానికి లేఖ రాశారు. ఈ కేసును విచారించే ధర్మాసనం నుంచి జస్టిస్ యూయూ లలిత్ తప్పుకున్న తర్వాత ఈ నెల 29న విచారణ మొదలు పెట్టేందుకు ఐదుగురు న్యాయమూర్తులతో రాజ్యాంగ ధర్మాసనాన్ని సుప్రీంకోర్టు మళ్లీ ఏర్పాటు చేయనున్నది. కాగా, 29లోపు ఈ కేసు విచారణను దేశప్రజలందరూ వీక్షించేందుకు ఏర్పాటు చేయాలని సెంటర్ ఫర్ అకౌంటబిలిటీ అండ్ సిస్టమిక్ చేంజ్ నుంచి గోవిందాచార్య, న్యాయవాది కెజి గుప్తాలు క్యాబినెట్ కార్యదర్శి పికె సిన్హాకు లేఖ రాశారు. కోర్టులో చోటుచేసుకునే పరిణామాలను తెలుసుకునే ప్రాథమిక హక్కు పౌరులకు ఉన్నదని అందులో పేర్కొన్నారు.

అసోంలో 'గిరిజన' బంద్

ఆరు గ్రూపులను ఎస్టీల్లో చేర్చడంపై నిరసన


గువహతి : అసోంలోని ఆరు తెగలను ఎస్టీల్లో చేర్చడాన్ని నిరసిస్తూ గిరిజన సంఘాలు శుక్రవారం రాష్ట్ర బంద్ నిర్వహించాయి. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు రహదారులను దిగ్బంధించి ఆందోళనలు చేపట్టారు. రోడ్లపై టైర్లను కాల్చి తమ నిరసనను తెలియజేశారు. దీంతో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. అసలైన గిరిజనులను పక్కన బెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయని అసోం గిరిజన సంఘాల సమన్వయ సమితి విమర్శించింది. ఆరు తెగల ను ఎస్టీలో చేర్చేందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సవరణ బిల్లును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఈ సందర్భంగా డిమాండ్ చేసింది.

సరిహద్దులో పేలిన మందుపాతర

జమ్మూ : జమ్మూకాశ్మీర్ నియంత్రణ రేఖ వద్ద మందుపాతర పేలిన ఘటనలో ఆర్మీ మేజర్, మరో జవాను ప్రాణాలు కోల్పోయారు. ఈ మందుపాతరను ఉగ్రవాదులే అమర్చి ఉంటారని సైనికాధికారులు అనుమానిస్తున్నారు. రాజౌరీ జిల్లాలోని నౌషెరా సెక్టార్‌లో శుక్రవారం ఆర్మీ పెట్రోలింగ్‌లో ఉండగా.. మందుపాతర పేలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరికి ఆస్పత్రికి తరలించారు. ఘటన నేపథ్యంలో నియంత్రణ రేఖ వెంబడి భద్రతను అధికారులు కట్టుదిట్టం చేశారు.

సంఘాలపై జైట్లీ అక్కసు

కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా దాడినా : సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్



ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ బంద్ నిర్వహించడానికి వామపక్ష అనుబంధ కార్మిక సంఘాల ముందు నిజమైన సమస్యలున్నాయా? లేదా దేశ రాజకీయ మ్యాప్ నుంచి తాము తుడిచిపెట్టుకుపోలేదని నిర్ధారించే ఎత్తుగడల్లో భాగంగా సమ్మె చేశారా?
– కేంద్రఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ

ధరలు మండుతున్నాయి. కార్మికులకు కనీసవేతనాలూ దక్కటంలేదు. కార్పొరేట్లకు అండగా నిలుస్తున్న మోడీ సర్కార్‌కు వ్యతిరేకంగా కార్మికలోకం కన్నెర్ర చేస్తే...ఆర్థికమంత్రి హోదాలో ఉండి నిజమైన సమస్యలున్నాయా..అనటంపై కార్మికసంఘాలు మండిపడుతున్నాయి. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎవరు తుడిచిపెట్టుకుపోతారో..శ్రామిక జనం నిర్ణయిస్తారని సంఘనేతలు జైట్లీకి హితవుపలుకుతున్నారు.

నవతెలంగాణ – న్యూఢిల్లీబ్యూరో

కార్మిక సంఘాలపై కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి అక్కసు వెళ్లగక్కారని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ కుమార్ సేన్ తెలిపారు. కనీస వేతనం రూ. 18 వేలు ఇవ్వాలని జనవరి 8,9వ తేదీల్లో అన్ని కార్మిక సంఘాలతో తాము చేపట్టిన భారత్ బంద్‌పై జైట్లీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం సముచితం కాదని అభిప్రాయపడ్డారు. తాము మాత్రమే బంద్‌కు పిలుపునివ్వలేదన్న విషయం జైట్లీ గుర్తు పెట్టుకోవాలని తపన్ సేన్ హెచ్చరించారు. బీజేపీ అనుబంధ సంఘం మినహా అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు, ఇతర కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు భారత్ బంద్‌లో స్వచ్ఛంధంగా పాల్గొన్నారని చెప్పారు. పది కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా ఇచ్చిన సమ్మె పిలుపులో భాగంగా అన్నివర్గాల ప్రజానీకం పెద్ద ఎత్తున బంద్ పాటించారని వివరించారు. అన్నదాతలు సైతం మోడీ హఠావో... దేశ్ బచావో, కార్మిక విరోధి... నరేంద్ర మోడీ, కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అన్న నినాదాలతో సమ్మెలో పాల్గొన్నారని అన్నారు.



గ్రామీణ ప్రజలు కూడా బంద్‌లో పాలుపంచుకున్నారని వెల్లడించారు. ఈ సమ్మె కార్మిక ఆందోళనగా మాత్రమే కాకుండా... జన ఆందోళన్‌గా సాగిందని అభిప్రాయపడ్డారు. అయితే, పెట్టుబడిదారీ వర్గాల కోసం అనుక్షణం పని చేస్తున్న మోడీ సర్కారు తాము విజయవంతంగా చేపట్టిన బంద్‌ను జీర్ణించుకోలేకపోతుందన్నారు.

అందుకే తమపై ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్నామని, దేశంలో అశాంతి సృష్టించేందుకు కాదని వెల్లడించారు. దేశవ్యాప్తంగా శాంతియుతంగా సమ్మె చేసినట్టు తెలిపారు. అయినా, తాము బంద్‌కు పిలుపునివ్వడం ఇదేం కొత్త కాదని గతంలో కూడా మూడు సార్లు దేశవ్యాప్తంగా బంద్ పాటించినట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించకుండా మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. మోడీ సర్కారు స్పందించేంతవరకు తాము పోరాటం కొనసాగిస్తామన్నారు.

బెదిరింపులకు భయపడి..

తిరువనంతపురం: శతాబ్దాలుగా శబరిమల ఆలయంలోకి మహిళల(10-50ఏండ్ల వయసు) ప్రవేశాన్ని నిషేధించిన సంకెళ్లను తెంచిన ఆ ఇద్దరు మహిళలు.. ప్రస్తుతం కేరళలో అజ్ఞాతంలో ఉన్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనుసరించి శబరిమలలోని అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించిన ఇద్దరు మహిళలు బిందు అమ్మిని(40), కనక దుర్గ(39)లు.. కాషాయ మూకల బెదిరింపుల వల్ల తమ ఇండ్లకు వెళ్లలేకపోతున్నారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం శబరిమలలో మహిళల ప్రవేశాన్ని అడ్డుకునేందుకు కొన్ని మూకలు యత్నించిన ఘటనలు హింసాత్మకంగా మారిన సంగతి తెలిసిందే. అయితే వీరి బెదిరింపులను ఖాతరు చేయకుండా ఈ నెల 2న కేరళలోని కన్నూర్ వర్సిటీ లా లెక్చరర్ బిందు, సివిల్ సర్వెంట్ కనక దుర్గలు ఆలయంలోకి విజయవంతంగా ప్రవేశించారు. దీంతో బీజేపీ కార్యకర్తలు, కాషాయ మూకలు ధర్నాకు దిగిన సంగతి విదితమే. తాజాగా ఆ ఇద్దరు మహిళలు మీడియాతో మాట్లాడారు. 'మేం భయపడలేదు. అప్పుడు ఆలయంలోకి ప్రవేశించాలనే లక్ష్యంతోనే ఉన్నామ'ని బిందు అన్నారు. కొచ్చి శివార్లలోని గుర్తు తెలియని ప్రాంతం నుంచి మాట్లాడిన ఆ ఇద్దరు.. ఆలయ ప్రవేశం చేసినప్పటి నుంచి తీవ్రమైన బెదిరింపులను ఎదుర్కొన్నారని చెప్పారు. అయితే తమను అధికారులు సురక్షితంగా ఇంటికి చేర్చుతారనే నమ్మకం ఉన్నదని అన్నారు. 'నేను ఎప్పుడు చెప్పినట్టే నేను పోలీసులను నమ్ముతాను. కేరళ ప్రభుత్వాన్ని, కేరళలోని ప్రజాస్వామిక సమాజాన్నీ విశ్వసించుతాన'ని బిందు తెలిపారు.

మతవిద్వేషాన్ని రెచ్చగొట్టే కుట్ర: గవర్నర్‌కు సీఎం నివేదిక

శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు అనంతరం కేరళలో చెలరేగిన హింసపై రాష్ట్ర గవర్నర్ పి సతశివంకు సీఎం పినరయి విజయన్ నివేదికను బుధవారం సమర్పించారు. సంఘ్ పరివార్ ప్రణాళికాబద్ధమైన దాడులు, మహిళా భక్తులు, మీడియా, పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులనూ నివేదికలో పొందుపర్చామని సీఎంవో ఓ ప్రకటనలో పేర్కొంది.

హెచ్‌ఏఎల్ మూసివేతకు కుట్ర

- మోడీ 'రాఫెల్ డీల్'లో సాంకేతికత బదిలీ అంశం లేదు : హిందుస్తాన్ ఏరోనాటిక్స్ ఉద్యోగుల సంఘం



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ విమానాల తయారీ సంస్థ హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్‌ఏఎల్) మూసివేతకు ఎన్‌డీఏ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆ సంస్థ ఉద్యోగ సంఘం ఆరోపించింది. 36 రాఫెల్ యుద్ధ విమానాలను నేరుగా ఫ్రాన్స్‌లోని దసో ఏవియేషన్ నుంచి దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోగా, మిగతా 90 యుద్ధ విమానాల తయారీకి సాంకేతికత బదిలీ కింద హెచ్‌ఏఎల్‌కు అనుమతి ఇవ్వాలని ఉద్యోగ సంఘం డిమాండ్ చేసింది. మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్పులు చేసిన ఒప్పందంలో సాంకేతికత బదిలీకి సంబంధించిన క్లాజ్ లేకపోవడాన్ని హాల్ ఉద్యోగ సంఘం గుర్తు చేసింది.

78 ఏండ్ల అనుభవమున్న హాల్‌ను ఇది నిరాశపరిచిందని ఉద్యోగసంఘం ఆవేదన వ్యక్తం చేసింది. యుద్ధ విమానాల తయారీలో దసో ఏవియేషన్‌తో హాల్‌ను భాగస్వామిని చేయాలని వారు కోరారు. హాల్‌కు చెందిన బెంగళూరు ప్లాంట్‌లో 10,000మంది ఉద్యోగులు పని చేస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికీ ఒక్క రాఫెల్ విమానాన్ని కూడా దిగుమతి చేసుకోకపోయినా దసో ఏవియేషన్‌కు కేంద్రం రూ.20 వేలకోట్లు అడ్వాన్స్ కింద ఇచ్చిందని వారు విమర్శించారు. హాల్‌కు విమానాల తయారీ సామర్థ్యం లేదంటూ రక్షణమంత్రి నిర్మలాసీతారామన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారు ఆరోపించారు.

తమతో భేటీ సందర్భంగా ప్రధాని మోడీ హాల్‌కు రూ.5000 కోట్ల పెట్టుబడులు వచ్చేలా చూస్తానన్నారు. కానీ, తమకున్న రిజర్వ్ నిధులను పక్కదారి పట్టించారని ఉద్యోగ సంఘం నేతలు విమర్శించారు. ఉద్యోగుల జీతభత్యాల కోసం బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సి వస్తున్నదని వారు తెలిపారు. తమ సంస్థకు రూ.లక్షా 28 వేల కోట్ల ఆర్డర్లు రాగా, అందులో యూపీఏ హయాంలో వచ్చినవే అధికమని హెచ్‌ఏఎల్ ఉద్యోగ సంఘం స్పష్టం చేసింది. మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ హయాంలో వచ్చింది కేవలం రూ.26,570 కోట్లు మాత్రమేనని వారు తెలిపారు. లోక్‌సభలో నిర్మలాసీతారామన్ చేసిన ప్రకటనలో వాస్తవం లేదని హెచ్‌ఏఎల్ ఉద్యోగ సంఘం తెలిపింది.

'అసోం కమిటీ'లో కొనసాగేందుకు

ఐదుగురు నిరాకరణ



న్యూఢిల్లీ: జాతీయపౌరసత్వ బిల్లుపై అస్సామీయులలో తలెత్తుతున్న సందేహాలను, ఆ రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనలను పరిష్కరించేందుకు కేంద్రం ఏర్పాటు చేసిన ఉన్నతాధికార కమిటీలో సభ్యులుగా నియమించిన తొమ్మిది మందిలో ఐదుగురు కమిటీలో కొనసాగేందుకు నిరాకరించారు. 2016 నాటి వివాదాస్పద పౌరసత్వ చట్ట (సవరణ) బిల్లుపై పార్లమెంట్ ఆమోదముద్ర పొందాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఈశాన్య రాష్ట్రాల్లో మెజార్టీ ప్రజలు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. అసోం ఒప్పందంలోని క్లాజ్ 6 ప్రకారం అసోం ప్రజలకు వారి సంస్కృతి, సామాజిక, భాషాపరమైన గుర్తింపును కాపాడుకునేందుకు రాజ్యాంగపరమైన, శాసనపరమైన, పాలనా పరమైన భద్రత కల్పించాల్సి వుంది. ప్రతిపాదిత పౌరసత్వ చట్ట సవరణ బిల్లు ఈ హక్కులను కాలరాస్తుందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈశాన్య రాష్ట్రాల ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న ఈ భయాందోళనలు తొలగించి, చట్టాన్ని అమలు చేసేందుకు అవసరమైన మార్గాలను సూచించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ ఈ కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ తన అధ్యయన నివేదికను ఆర్నెల్లలోగా కేంద్రానికి సమర్పించాల్సి వుంటుంది. ఈ నెల 7న రిటైర్డ్ ఉన్నతాధికారి ఎంపి బెజ్‌బారువా నేతృత్వంలోని కమిటీని నియమించింది. ఇందులో గౌహతికి చెందిన జర్నలిస్టు ధీరేన్ బెజ్‌బారువా, రచయితలు నాగేన్‌శర్మ, రంగ్‌బాంగ్ తెరాంగ్, విద్యావేత్త ముకుంద రాజవంశి, రిటైర్డ్ అధికారులు సుభాష్ దాస్, అసోం అడ్వకేట్ జనరల్ రమేష్ బోర్‌పాత్రో పాటు అఖిల అసోం విద్యార్థి సంఘం (ఆసు)నుంచి ఒక ప్రతినిధి సభ్యులుగా ఉన్నారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం తరపున హోంశాఖలోని ఈశాన్య రాష్ట్రాల వ్యవహారాల కార్యదర్శి సత్యేంద్రగార్గ్ ప్రాతినిధ్యం వహిస్తారు.

కాగా తాము తొలుత ఈ నియామకాలను అంగీకరించినప్పటికీ, కేంద్రంలో తదుపరి ప్రభుత్వం కమిటీ సిఫార్సులను ఆమోదించే అవకాశం లేదన్న విషయం తమకు తెలిసిందని, అందువల్ల ఈ నియామకాలను తిరస్కరిస్తున్నామని ఇందులో సభ్యులుగా నియమితులైన రచయితలు నాగేన్ సైకియా, రంగ్‌బోంగ్ తెరాంగ్ విద్యావేత్త ముకుంద్ రాజవంశి తదితరులు ప్రకటించారు. ఈ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆసు ప్రతినిధి కూడా ఈ కమిటీని బహిష్కరించారు.

'జర్నలిస్టు హత్య కేసులో డేరాబాబా దోషి'

న్యూఢిల్లీ: 2002లో జరిగిన జర్నలిస్టు రామ్‌చందర్ ఛత్రపతి హత్య కేసులో స్వయం ప్రకటిత మతబోధకుడైన డేరాసచ్ఛా సౌదా అధినేత గుర్మీత్ రామ్‌రహీమ్‌సింగ్ (డేరాబాబా)తో పాటు మరో ముగ్గురిని దోషులుగా నిర్ధారిస్తూ హర్యానాలోని పంచకుల సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వీరికి శిక్షలను ఈ నెల 17న ఖరారు చేయనున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు. రామ్‌రహీమ్‌సింగ్ పై వెల్లువెత్తిన అత్యాచార ఆరోపణల్లోని నిజాలను రామ్‌చందర్ ఛత్రపతి తన కథనాల ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసిన కేసులో డేరాబాబా ఇప్పటికే జైలులో వున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయనకు 20 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. అదే కోర్టు ఇప్పటి కేసులో కూడా తీర్పు వెలువరించటం విశేషం.

జోహ్రికి క్లీన్ చిట్‌పై

జేఎన్‌యూ విద్యార్థుల నిరసన



న్యూఢిల్లీ: లైంగికవేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జోహ్రికి జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ అంతర్గత ఫిర్యాదుల కమిటి(ఐసీసీ) క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని నిరసిస్తూ విద్యార్థి సంఘాలు ఆందోళనలకు దిగాయి. జోహ్రిపై ఆరోపణలు మొదలైన నాటి నుంచి వర్సిటీ పాలక విభాగం ఆయనను కాపాడుతున్నదని విద్యార్థి సంఘాల నాయకులు విమర్శించారు. అతనిపై ఆరోపణల కేసును ముందుకు సాగకుండా వర్సిటీ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. జేఎన్‌యూ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న అతుల్ జోహ్రి పై గతేడాది మార్చిలో ఎనిమిది మంది మహిళలు లైంగికవేధింపుల ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. జోహ్రిని అరెస్టుచేయాలని డిమాండ్ చేస్తూ అప్పట్లో విద్యార్థులు పెద్దఎత్తున ఉద్యమించారు. నిరసనల నేపథ్యంలో కోర్టు జోక్యంతో అతన్ని అరెస్టు చేయగా అదే రోజు బెయిల్‌పై ఆయన బయటకు వచ్చారు.

పంటలపై పశు పడగ

వీధి పశువుల వీరంగంతో సాగు కుదేలు

- ఉత్తరప్రదేశ్‌లో కర్షకుల కన్నీటి వ్యథ
- స్కూళ్లు, ఆస్పత్రుల్లో బంధిస్తున్న వైనం
- ఎవరేమైతేనేం పశువులకేమీ కావొద్దు..
- యోగి సర్కారు తీరుపై సర్వత్రావిమర్శలు

వ్యవసాయ ఆవరణ వ్యవస్థలో పశువుల పాత్ర ఎంతో గొప్పది. పంటల సాగులో ఏదో ఒక చోట పశువుల అవసరం రాకుండా ఉండదు. పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలెన్నో ఉన్నాయి. పశువులను రైతులు అల్లారుముద్దుగా, తమ కుటుంబంలోని సభ్యులుగా చూసుకోవడం పరిపాటి. కానీ ఉత్తరప్రదేశ్‌లోని రైతులకు పశువులంటేనే చిర్రెత్తుకొస్తున్నది. ఈ క్రమంలోనే వాటి పీడ వదిలించుకోవడం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారు. చేతికొచ్చిన పంటలను వీధి పశువులు ధ్వంసం చేస్తూ భారీ నష్టాన్ని మిగుల్చుతుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోతున్నారు. పశువుల సంరక్షణపై ఎనలేని శ్రద్ధ చూపెడుతున్న యోగి ఆదిత్యనాథ్ సర్కారు.. రైతులను మాత్రం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఎవరెక్కడ పోతే మాకేంటి.. పశువులు క్షేమంగా ఉన్నాయా? లేదా? అన్నదే మాకు ముఖ్యం అన్న ధోరణిలో యోగి పాలన కొనసాగుతుండటం గమనార్హం.

నవతెలంగాణ-జనరల్ డెస్క్



ఎముకలు కొరికేంత చలి. ఈ చలిలోనే కొందరు రైతులు వణుకుతూ ఓ స్కూలు గేటు వద్ద కాపలా కాస్తున్నారు. రైతులకు పాఠశాల దగ్గర ఏం పని అని అనుకుంటున్నారా ? చేతికొచ్చిన పంటలను నాశనం చేస్తున్న వీధి పశువులను ఆ స్కూలు ఆవరణలో తోలి వాటికి కాపలాగా ఉన్నారు. ఈ ఘటన అలీగఢ్ జిల్లాలోని సాయ్‌పూర్ గ్రామంలో డిసెంబర్ 26న చోటు చేసుకున్నది. 'దాదాపు 100 పశువులను రైతులు బంధించారు. గ్రామంలో చాలా మంది రైతులు గోధుమ పంట సాగు చేస్తున్నారు. కానీ, సగానికి పైగా పంటను వీధి పశువులు నాశనం చేశాయి. రాత్రుళ్ల సైతం కాపలా కాసినా ఫలితం దక్కడం లేదు' అని చంద్రమోహన్‌సింగ్ అనే రైతు వాపోయాడు. ఈ పరిస్థితి ఒక్క సాయ్‌పూర్‌లోనే కాదు.. ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో వీధి పశువులతో రైతులు అనేక కష్టాలనెదుర్కొంటున్నారు. లఖీంపూర్, ఉరాయ్, జలావున్, మథుర, ఆగ్రా, అలీగఢ్, మీరట్, భగ్‌పట్, తదితర ప్రాంతాల్లో వీధి పశువులను స్కూళ్లు, ఆస్పత్రులు, పంచాయతీ భవనాల్లో బంధిస్తున్నారు.

వ్యవసాయం వర్సెస్ గో రక్షణ

రాష్ట్రంలో బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు కష్టాలు రెట్టింపయ్యాయి. పశువుల వధపై సీఎం యోగి ఆదిత్యనాథ్ అనేక ఆంక్షలు తీసుకొచ్చారు. అనేక పశు వధశాలలను మూసి వేయించారు. ప్రభుత్వం అండతో గోరక్షకులు సైతం రెచ్చిపోయి అమాయకులపై దాడులకు తెగబడుతున్నారు. దీంతో పశువులను కనీసం ఒక చోటు నుంచి మరో చోటుకి తరలించాలన్నా కష్టసాధ్యంగా మారింది. 'ఇంతకుముందు ఎద్దులు, పాలివ్వడం మానేసిన ఆవులను రూ.4 వేల నుంచి రూ.5 వేలకు అమ్ముకునేవాళ్లం. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. పశువులను అమ్మాలంటే వేరే చోటుకి తరలించాలి. అది కష్టసాధ్యం కావడంతో చేసేదేమీ లేక వాటిని వీధుల్లో విడిచిపెడుతున్నాం. మామూలుగా ఒక పశువును పెంచాలంటే నెలకు రూ.6 వేలదాకా ఖర్చవుతుంది. పైగా ముసలితనానికి వచ్చిన పశువులను పెంచడం ఇంకా తలకు మించిన భారం. అందుకే వాటిని వదిలించుకోక తప్పడం లేదు. కొన్ని సందర్భాల్లో అతి తక్కువ ధరకే పశువులను అమ్ముకోవాల్సి వస్తున్నది' అని మీరట్ జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్ అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రోజుకు పది లీటర్ల పాలు ఇచ్చే ఆవుల ధర రూ.40 వేల నుంచి 50 వేల వరకు ఉంటుందని, కానీ, గో రక్షకులను దాటుకొని వాటిని రవాణా చేయడం చాలా కష్టంతో కూడుకున్నదని, ఈ కారణంగా ఒక్కో ఆవుకు రూ.15 వేలకు మించి పలకడం లేదని మరో రైతు వినోద్‌కుమార్ అన్నాడు. బీజేపీ ప్రభుత్వ విధానాలతో కొంతకాలంగా వీధి పశువుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రతి గ్రామంలో దాదాపు ఇవి 50 నుంచి 100 వరకు ఉండి పంటలను నాశనం చేస్తున్నాయని తెలిపాడు.

'నాకున్న వ్యవసాయ భూమిలో రూ.12 వేల ఖర్చుతో ఆలు పంట వేశాను. కానీ, దాదాపు 50 పశువులు పంటపై పడి నాశనం చేశాయి. వీధి పశువుల బారి నుండి కాపాడాలని ప్రభుత్వాధికారులను కోరితే.. రెండు నెలల సమయం కావాలంటున్నారు. కానీ, పంటలు నాశనమయ్యాక వారేం చేస్తారు' అని సుదామా గ్రామ ప్రధాన్(సర్పంచ్) హరిభన్ సింగ్ అన్నాడు.

10.09 లక్షల పశువులు వీధుల్లోనే..

యూపీలో 2012లో చేసిన 19వ పశుగణన ప్రకారం.. 10,09,436 వీధి పశువులున్నాయి. ఈ ఎనిమిదేండ్లలో ఈ సంఖ్య మరింత పెరిగి ఉండవచ్చని ప్రభుత్వాధికారులు భావిస్తున్నారు. పశువధపై ఆంక్షలు విధించడంతోనే వీధి పశువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని బుందేల్‌ఖండ్‌లో గోశాల నిర్వహిస్తున్న గోదాస్ వెల్లడించారు.

కిక్కిరిసిపోతున్న గోశాలలు

యూపీ 'గో సేవ ఆయోగ్' ప్రకారం.. రాష్ట్రంలో అనుమతి పొందిన గోశాలలు 495 ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం గోశాలల్లో పరిమితికి మించి పశువులున్నాయి. టప్పాల్‌లోని గోశాలలో 2018 మార్చిలో 400 పశువులుంటే డిసెంబర్ నాటికి ఆ సంఖ్య 2 వేలకు చేరుకున్నది. అలీగఢ్‌లోని జిట్టారా గోశాలలో 2018 ప్రారంభంలో 200 పశువులుండగా.. ఆ సంఖ్య ఇప్పుడు 500కు చేరుకోవడం గమనార్హం.

మాటలు ఘనం.. చేతలు శూన్యం..

'గోశాలల్లోని 70 శాతం వీధి ఆవులకు రోజుకు 30 రూపాయల చొప్పున ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. కానీ, ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ ఆ డబ్బు చేతికందలేదని మీరట్‌లోని గోపాల్ గోశాల మేనేజర్ చంద్రపాండే తెలిపారు. 'గోశాలలకు సాయం చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మాటలకే పరిమితమైంది తప్ప అమల్లో మాత్రం ముందడుగు పడలేదని' టప్పా గోశాల నిర్వాహకుడు గోపాల్ సింగ్ అన్నారు. టప్పా గోశాలలో ఉన్న 2 వేల పశువులకు రోజుకు రూ.40 వేల వరకు ఖర్చు వస్తున్నదని, ప్రభుత్వం ఆదుకోకపోతే షెల్టర్‌ను ఎక్కువ కాలం నడిపే పరిస్థితి లేదని ఆయన తెలిపారు.

మనుషుల్లేని 'గో సేవ ఆయోగ్'

గోరక్షణకు సంబంధించి ప్రభుత్వ నిధుల పర్యవేక్షణ కోసం యోగి ఆదిత్యనాథ్ సర్కారు.. గోసేవ ఆయోగ్‌ను ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గోశాల ఏర్పాటు కోసం రూ.1.2 కోట్లను కూడా మంజూరు చేసింది. కానీ, ఆయోగ్ చైర్మెన్ రాజీవ్ గుప్తా పదవీకాలం గతేడాది జులై 21న ముగిసింది. ఆయోగ్‌లోని మిగిలిన ముగ్గురు సభ్యుల పదవీకాలం సెప్టెంబర్‌లో ముగిసింది. ఇప్పుడు గోసేవ ఆయోగ్‌లో ఒక్క సభ్యుడూ లేకపోవడం గమనార్హం. మూడు నెలలు దాటినా ఆయోగ్‌లో సభ్యులను నియమించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గో సంరక్షణ కోసం విడుదలైన నిధుల నిర్వహణ సంగతి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

రైతుల నుంచి రోజూ ఫిర్యాదులే : అలీగఢ్ జిల్లా మేజిస్ట్రేట్

వీధి పశువుల సంరక్షణ కోసం అలీగఢ్‌లోని గభానాలో 175 స్థలాన్ని గుర్తించామని, అక్కడ గో సాంక్చువరీని ఏర్పాటు చేస్తామని జిల్లా మేజిస్ట్రేట్ చంద్రభూషణ్ సింగ్ వెల్లడించారు. ఇలాంటివే మరికొన్ని ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని, కానీ ఇందుకు కొంత సమయం పడుతుందని తెలిపారు. వీధి పశువులు పంటచేలను నాశనం చేస్తున్నాయని రైతుల నుంచి ప్రతిరోజు ఫిర్యాదులు అందుతున్నాయతాయని తెలిపారు. కొన్ని గ్రామాల్లో వీధి పశువులను స్కూళ్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్బంధిస్తున్న ఘటనలు కొత్త సమస్యలను తెచ్చి పెడుతున్నాయని చెప్పారు. పశువులను స్కూళ్లలో బంధించడంతో విద్యార్థులు ఇంటికి తిరిగి వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పోలీసుల సాయంతో స్కూళ్లలో బంధించిన పశువులను విడిపించాలని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌లను ఆయన ఆదేశించారు. అంతేకాక.. విడిపించిన పశువులను నేరుగా గోశాలలకు తరలించాలని ఆదేశాలిచ్చారు. కానీ, పశువుల రవాణా తలకు మించిన భారంగా మారిందని, గోశాలలు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని ఇగ్లాస్ సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ ఎకె శర్మ తెలిపారు. పైగా చాలావరకు గోశాలల్లో పరిమితికి మించి పశువులున్నాయని ఆయన చెప్పారు.

బుజ్జగింపులు.. బెదిరింపులు

నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిడి

- పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ మద్దతుదార్ల మధ్యనే పోటీ
- లక్షల్లో డిమాండ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో బుజ్జగింపులు, బెదిరింపుల పర్వం మొదలైంది. ఎన్నికల్లో టీఆర్ఎస్ సొంత పార్టీ అభ్యర్థుల మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. దీంతో నామినేషన్ల ఉపసంహరణ కోసం డబ్బు, పలుకుబడి ఉన్న నాయకుల నుంచి ఒత్తిడి పెరుగుతున్నది. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు చెందిన వారే పెద్ద సంఖ్యలో సర్పంచ్ పదవికి నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో నియోజకవర్గానికి చెందిన ఎమ్మెల్యే బలపర్చిన అభ్యర్థికి రెబెల్స్‌గా నామినేషన్లు వేసిన వారిని బరిలో నుంచి తప్పుకోవాలని బుజ్జగిస్తున్నారు. బుజ్జగింపులకు తలొగ్గని వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యేల ప్రోద్భలంతోనే బెదిరింపులకు పాల్పడుతున్నారని బరిలో నిలిచిన అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ధనబలం, కండబలం కలవారినే సర్పంచ్ పదవికి ఎంపిక చేస్తున్నారని, పేద వర్గాలకు చెందిన వారిని బరిలో నుంచి తప్పుకునేలా జిల్లా నేతల నుంచి ఒత్తిడి తెస్తున్నారని అభ్యర్థులు తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు మరో రెండు రోజుల గడువు ఉంది. ఈ లోపు రెబెల్స్‌ను పోటీ నుంచి తప్పించడానికి అధికార టీఆర్ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీల ముఖ్య నేతలు పావులు కదుపుతున్నారు.



ఏకగ్రీవం కోసమే

వీలైనన్నీ పంచాయతీలను ఏకగ్రీవం చేయడానికి అధికార పార్టీ పావులు కదుపుతున్నట్టు సమాచారం. దీని కోసమే రెబెల్స్‌గా నామినేషన్లు వేసిన వారిని ఉపసంహరింప చేసేలా టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అగ్రనేతలు గ్రామాల్లో తిష్టవేశారు. పంచాయతీల్లో ఒక్కో ఓటు కూడా అత్యంత విలువైనదిగా నేతలు భావిస్తున్నారు. తొలి విడతలో 4,479 సర్పంచ్ పదవులకు గాను 27, 790 మంది నామినేషన్లు దాఖలు వేశారు. ఇందులో కనీసం 1860 పంచాయతీలను ఏకగ్రీవం చేయాలన్న ఆలోచనలో టీఆర్ఎస్ ఉన్నట్టు సమాచారం. మిగతా పంచాయతీల్లో తమ పార్టీ కార్యకర్తలకు మద్దతు తెలిపి గెలిపించుకోవాలని ఆ పార్టీ భావిస్తున్నది. టీఆర్ఎస్ మద్దతుంటే సులువుగా గెలవచ్చున్న ఆలోచనతో టీఆర్ఎస్‌కు చెందిన వారే పెద్ద సంఖ్యలో నామినేషన్లు



దాఖలు చేశారు. టీఆర్ఎస్ సహకారంతో గెలిస్తే

పార్టీ రహితమైనప్పటికీ..

గ్రామ పంచాయతీ ఎన్నికలు పార్టీ రహితమైనప్పటికీ ఈ ఎన్నికల్లో మాత్రం అధికార పార్టీతో పాటు కాంగ్రెస్ నేతలు తల దూరుస్తున్నారు. గెలిచే సత్తా ఉన్న వారినే రంగంలోకి దించి మద్దతు ప్రకటించారు. వారికి వ్యతిరేకంగా నామినేషన్లు దాఖలు చేసిన వారిపై పార్టీ అగ్రనేతలు వీరంగం చేస్తూ అభ్యర్థులను తీవ్ర భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ముందుగా నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. వినకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నట్టు తెలిసింది. దాంతో పేద, మధ్య తరగతికి చెందిన వారు పోటీ చేసే అవకాశం లేకుండా పోతున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అగ్రవర్ణాల్లోని ఒక కులానికే చెందిన వారికి సర్పంచ్ పదవికి అర్హుడుగా పరిగణిస్తున్నారు. వారికి వ్యతిరేకంగా నామినేషన్లు దాఖలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు.

పంచాయతీలకు నిధుల కొరత ఉండకపోవడంతో పాటు, పలు అభివృద్ధి పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తే లక్షల్లో ఆదాయం వస్తుందని సర్పంచ్ అభ్యర్థులు భావిస్తున్నారు. ప్రధానంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా పుంజుకోవడం, గ్రామాల్లోని పచ్చని పంట పొలాల్లో "రియల్ ఎస్టేట్" వెంచర్లు వెలుస్తుండటంతో వాటి అనుమతుల కోసం వచ్చే వారి నుంచి కోట్లాది రూపాయలు దండు కోవచ్చన్న ఆలోచనతో మరికొందరు సర్పంచ్ పదవుల కోసం నామినేషన్లు వేసినట్టు సమాచారం. మరికొందరు నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిడి తెస్తే వారి నుంచి లక్షల్లో డబ్బులు డిమాండ్ చేయవచ్చున్న ఆశతో నామినేషన్లు వేసినట్టు తెలిసింది. మొత్తానికి అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థి తప్ప రెబెల్స్ బరిలో ఉండకుండా ఆయా పార్టీల అగ్రనేతలు మంతనాలు జరుపుతున్నారు.

ఎంసెట్ కన్వీనర్‌గా యాదయ్య

ఐసెట్‌కు రాజేశం, పీఈసెట్‌కు సత్యనారాయణ

- నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లు : నియమించిన ఉన్నత విద్యామండలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎంసెట్ కన్వీనర్‌గా ఎన్ యాదయ్య తిరిగి ఎంపికయ్యారు. ఐసెట్ కన్వీనర్‌గా కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో పనిచేస్తున్న ప్రొఫెసర్ సిహెచ్ రాజేశంను ఉన్నత విద్యామండలి ఎంపిక చేసింది. పీఈసెట్ కన్వీనర్‌గా వి సత్యనారాయణను తిరిగి నియమించింది. ఈసెట్ కన్వీనర్‌గా ఎ గోవర్ధన్, లాసెట్ కన్వీనర్‌గా జిబి రెడ్డి, పీజీఈసెట్ కన్వీనర్‌గా ఎం కుమార్, ఎడ్‌సెట్ కన్వీనర్‌గా టి మృణాళినిని ఎంపిక చేసింది. రాష్ట్రంలో వచ్చే విద్యాసంవత్సరం (2019-20)లో వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలు (సెట్స్)కు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) శుక్రవారం కన్వీనర్లను నియమించింది. ఈ ఏడాది నాలుగు ప్రవేశ పరీక్షలకు కొత్త కన్వీనర్లను ఎంపిక చేసింది. ఐసెట్, లాసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్‌కు కొత్త కన్వీనర్లను ఎంపిక చేసింది. ఈ మేరకు టీఎస్‌సీహెచ్ఈ చైర్మెన్ తుమ్మల పాపిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే ప్రవేశ పరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి ప్రకటించిన విషయం తెలిసిందే. పీఈసెట్ మినహా మిగతా ప్రవేశపరీక్షలన్నీ ఆన్‌లైన్‌లోనే జరుగుతాయి. ఎంసెట్, ఈసెట్, ఐసెట్, లాసెట్, పీజీఈసెట్, ఎడ్‌సెట్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. 2019, మే 3 నుంచి 9వ తేదీ వరకు ఎంసెట్ రాతపరీక్షలు జరుగుతాయి. మే 3,4,6 తేదీల్లో ఇంజినీరింగ్ విభాగం అభ్యర్థులకు, మే 8,9 తేదీల్లో అగ్రికల్చర్ విభాగం అభ్యర్థులకు రాతపరీక్షలుంటాయి. మే 5న నీట్ రాతపరీక్ష ఉన్నందున,


యాదయ్య


గోవర్ధన్


సత్యనారాయణ

అగ్రికల్చర్ విభాగం అభ్యర్థులకు మే 6. 7 తేదీల్లో చదువుకునేందుకు ఉన్నత విద్యామండలి వెసులుబాటు కల్పించింది. ఇక సెట్ కమిటీల ఏర్పాటు కావాల్సి ఉంది. సెట్ కమిటీల సమావేశంలో ఆయా ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్ విడుదలతోపాటు షెడ్యూల్ ఎప్పుడనేది ఖరారు కానుంది.

ప్రవేశ పరీక్షల తేదీలు, కన్వీనర్ల వివరాలు

ప్రవేశ పరీక్ష	కన్వీనర్	విశ్వవిద్యాలయం	పరీక్ష తేదీ
టీఎస్‌ఎంసెట్	ఎన్ యాదయ్య	జేఎన్టీయూహెచ్	మే 3,4,6 (ఇంజినీరింగ్) మే 8,9 (అగ్రికల్చర్)
టీఎస్‌ఈసెట్	ఎ గోవర్ధన్	జేఎన్టీయూహెచ్	మే 11
టీఎస్‌పీఈసెట్	వి.సత్యనారాయణ	ఎంజీయూ	మే 20
టీఎస్‌ఐసెట్	సిహెచ్ రాజేశం	కేయూ	మే 23,24
టీఎస్‌లాసెట్	జిబి రెడ్డి	ఓయూ	మే 26
టీఎస్‌పీజీలాసెట్	"	ఓయూ	మే 26
టీఎస్‌పీజీఈసెట్	ఎం కుమార్	ఓయూ	మే 27,28,29
టీఎస్‌ఎడ్‌సెట్	టి.మృణాళిని	ఓయూ	మే 30,31

ఓటర్ జాబితా అక్రమాలకు బాధ్యులెవరో చెప్పాలి : మర్రి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఓటర్ జాబితా అక్రమాలకు బాధ్యులెవరో ఎన్నికల కమిషన్ చెప్పాలని మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఓటర్ జాబితాలో పొరపాట్లు జరిగాయని, అందుకు ఎన్నికల సంఘమే బాధ్యత వహించాలని కోరారు. ఓటర్ల తప్పులకు ఏ అధికారిపై చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. శుక్రవారం గాంధీభవన్ లో పార్టీ నేతలు నిరంజన్, వినోద్‌రెడ్డి తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఓటర్ జాబితా తయారు చేయ డానికి చిత్తశుద్ధి లేదని చెప్పారు. అధికార పార్టీకి తొత్తుగా ఎన్నికల సంఘం మారిందన్నారు.సీబీఐ మాజీ డైరెక్టర్ నుంచి వివరణ ఎందుకు తీసుకోలేదని మల్లు రవి ప్రశ్నించారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-భువనగిరి రూరల్

అప్పుల బాధ భరించలేక చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి జిల్లా భువనగిరి మండలం అనాజీపురంలో శుక్రవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరపల్లి వెంకటేశం(45) గురువారం రాత్రి గదిలోకి వెళ్లి ఉరేసుకున్నాడు. గదిలో నుంచి ఎంతసేపైనా బయటకు రాక పోవడంతో అతని భార్య అనుమానం వచ్చిడోర్‌కొట్టింది. తియ్యకపోవడంతో కిటికీలోంచి చూడగా వెంకటేశం మగ్గానికి వేలాడుతూ కనిపించాడు.

పంటల రక్షణకు సాగునీరందించాలి

- నష్టపోయిన పంటకు పరిహారమివ్వాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పంటల రక్షణకు అవసరమైన సాగునీటిని ప్రణాళికా బద్ధంగా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వర్షాభావంతో ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. రబీపై ఆశలు పెట్టుకున్న రైతాంగానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చినా (త్రైబందీ చేసినా) నీరివ్వడం లేదని పేర్కొన్నారు. దీంతో పెట్టిన పెట్టుబడి కూడా రాకా రైతులు నష్టపోతున్నారని తెలిపారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, శ్రీరాంసాగర్, జూరాల ప్రాజెక్టుల కింద రైతులకు రబీ పంటకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు. ప్రభుత్వం నాగార్జునసాగర్‌లో 510 అడుగుల దిగువకు, శ్రీశైలంలో 834 అడుగుల దిగువకు నీటిని వినియోగించకూడదని ప్రకటించిందని తెలిపారు. కానీ గతంలో అవసరాన్ని బట్టి అంతకన్నా దిగువ నీటిని వినియోగించారని పేర్కొన్నారు. యాసంగిలో 17 లక్షల ఎకరాలు వరి సాగు కావాల్సి ఉండగా నేటికి 4 లక్షల ఎకరాలలో మాత్రమే వరి నాట్లు వేశారని తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారం వరకు వరి నాట్లు వేస్తారని పేర్కొన్నారు. మిగతా పంటలతో కలిపి మొత్తం రబీలో 35 లక్షల ఎకరాలు సాగు కావాల్సి ఉండగా, 14 లక్షల ఎకరాల్లోనే పంటలు వేశారని తెలిపారు.

మిషన్ భగీరథకు తరలిస్తున్న నీరు

నాగార్జునసాగర్ కింద నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో వేసిన పంటలకు ఇవ్వాల్సిన నీటిని మిషన్ భగీరథకు తరలించడానికి ప్రాధాన్యత యివ్వడంతో వేసిన పంటలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందని తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. కొన్నిచోట్ల ఆలస్యంగా వేసిన ఖరీఫ్ పంటలు చివరిదశలో ఉన్నాయని తెలిపారు. వాటికి నీరు కావాలని పేర్కొన్నారు. ప్రస్తుతం సాగర్‌లో డెడ్‌స్టోరేజి పోగా 60 టీఎంసీల నీరుందని తెలిపారు. నాగార్జునసాగర్ బోర్డుతో సంప్రదించి రాష్ట్రంలోని మొదటి, రెండో జోన్లకు కావాల్సిన నీటిని సాధించాలని పేర్కొన్నారు. అలాగే శ్రీశైలంలో డెడ్‌స్టోరేజీ పోగా 30 టీఎంసిల నీరు లభ్యత ఉందని తెలిపారు. ఈ నీటి నుండి రాష్ట్రానికి రావాల్సిన కోటాను రాబట్టాలని సూచించారు. కల్వకుర్తి ఎత్తిపోతలతోపాటు నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టుకు నీటిని బోర్డు నుండి సాధించాలని కోరారు. ప్రణాళికా బద్దంగా ఉన్న నీటిని వినియోగించడానికి నివేదికలు రూపొందించాలని తెలిపారు. ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు అత్యంత నిర్లక్ష్యంగా సాగునీటిని ప్రాప్తకాలజ్ఞతకు వదిలేసి, మొదట నీరిస్తామని ప్రకటించి తర్వాత నీటిని తగ్గించడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని పేర్కొన్నారు. పంటలు వేశాకా నీరివ్వలేమని ప్రకటించడం అత్యంతదుర్మార్గమని విమర్శించారు. జూరాలలో ప్రస్తుతం నాలుగు టీఎంసీల నీరుందని, నిలువ పంటలకు నీరివ్వకుండా మిషన్ భగీరథకు కొరకు నీటి విడుదలను ఆపేశారని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో నీటి విడుదల కోసం పెద్దఎత్తున ఆందోళనలు సాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే శ్రీరాంసాగర్‌లో డెడ్‌స్టోరేజి పోగా 20 టీఎంసీల నీటి లభ్యత ఉంటుందనీ, త్రైబందీ కమిటీలో నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు మొదట నీటిని కేటాయించి పంటలు వేసిన తర్వాత నీటిని నిలుపుదల చేస్తున్నారని తెలిపారు. నీటి లభ్యతను బట్టి చివరిన ఉండే భూములకూ నీరిచ్చే విధంగా మాగాణి పంటలకు బదులు మెట్ట పంటలను ప్రోత్సహిం చాలని పేర్కొన్నారు. ఇంతకాలం అలాంటి ప్రతిపాదనలు వ్యవసాయ అధికారులు రూపొందించలేదని విమర్శించారు. రైతులు నీటి కోసం ఆందోళనలు నిర్వహిస్తుంటే, వారి సమస్యలు పరిష్కరించడానికి బదులు అక్రమ కేసులు బనాయించడంతోపాటు జైళ్లలో పెడుతున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వానికి కొత్తేమీకాదని పేర్కొన్నారు. అలాగే మధ్యతరహా ప్రాజెక్టుల కింద నీటి లభ్యతను బట్టి నెల రోజుల ముందే ఆయకట్టును, పంటలను నిర్దేశిస్తూ త్రైబందీ చేయాలని సూచించారు. ప్రభుత్వం అలక్ష్యం చేస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు నీటి లభ్యతను బట్టి ఆయకట్టు ప్రాంతాన్ని నిర్ధారించి, కచ్చితంగా అమలు చేయాలని పేర్కొన్నారు. మెట్ట పంటలను ప్రోత్సహించాలని కోరారు. ప్రతి ఆయకట్టు ప్రాంతంలో రైతులను తగు పంటలు వేసేందుకు ప్రోత్సహించి, అందుకు తగిన సిబ్బందిని నియమించాలని సూచించారు. నీరు లేక ఏ రైతు పంట నష్టపోయినా ప్రభుత్వం పరిహారం చెల్లించాలని కోరారు.

సంపాదకీయం

కపట బుద్ధి

పార్లమెంటు ఉభయ సభల్లో 'ఈబీసీ బిల్లు' ఆమోదం పొందింది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన ఈ బిల్లు ఆమోదంలో... ఎన్ని అనుమానాలు, అభ్యంతరాలున్నా అంగీకరించక తప్పని స్థితికి విపక్షాలను నెట్టిన మోడీ వ్యూహ చతురత, రాజకీయ చాణక్యమే తప్ప అగ్రకుల పేదల పట్ల అణువంతయినా చిత్తశుద్ధి కనిపించకపోవడం విషాదకరం!

"సబ్‌కా సాత్- సబ్‌కా వికాస్" నినాదం ఈ బిల్లుతో సాకారమయిందన్న ఆత్మస్తుతులు, అహంకృతాలను మోడీ పరివారం అప్పుడే ప్రారంభించింది. ప్రజలు ఈ వంచనకు బలికాకుండా చూసే బాధ్యత మాత్రం ప్రజాస్వామ్య, లౌకిక శక్తులదే...

ఆనాడు మండల్ కమిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన వారు ఈనాడు రిజర్వేషన్ల గురించి ఇంతగా తపించడంలో చాలా పెద్ద రాజకీయమే కనపడుతోంది. "కులం, మతం, జాతి, ప్రాంతంతో సంబంధం లేకుండా ప్రతి పేదవాడికీ గౌరవప్రదమైన జీవితం, విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో విస్తృత అవకాశాలు కల్పించడానికే ఈ బిల్లు" అన్న లక్ష్యం ప్రధాని పలుకుల్లో వినిపిస్తుందిగానీ... ఆయన తలపుల్లో మాత్రం నానాటికీ తమ పట్ల పెరుగుతున్న అసంతృప్తికి అడ్డుకట్ట వేసి, రాబోయే ఎన్నికలను తిరిగి గెలుచుకోవాలన్న అధికార కాంక్షే కనిపిస్తోంది.

ఇటీవలి వరుస ఓటములతో మోడీ జోరుకు కళ్లెం పడిన మాట వాస్తవం. చావు తప్పి కన్ను లొట్టబోయిన తీరున లభించిన గుజరాత్ ఎన్నికల ఫలితం తరువాత బీజేపీవి అన్నీ అపజయాలే. ప్రత్యేకించి నిన్నటి ఐదు రాష్ట్రాల ఫలితాలు, అందులోనూ మూడు ప్రధాన హిందీ బెల్టు రాష్ట్రాలు, బీజేపీకి అత్యంత ప్రాధాన్యతా రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో ఎదురైన ఓటమి కమలనాథులకు గుబులు పుట్టించినట్టుంది. 2014లో అత్యధిక స్థానాలు కట్టబెట్టిన రాష్ట్రాలు, రేపు 2019లోనూ కట్టబెడతాయని ఆశించిన రాష్ట్రాలు తమ చేజారి 'చేతి'కి చిక్కడం వీరిని ఆందోళనకు గురిచేస్తున్నట్టుంది.



మొత్తానికి ప్రజలిస్తున్న ప్రతికూల తీర్పులతో మోడీ పరివారం ఆత్మావలోకనంలో పడగా.... రాబోయే ఎన్నికల్లో తమ పాలనా ప్రాతిపదికన ప్రజా తీర్పును కోరితే ఫలితం ప్రతికూలంగానే ఉంటుందని అవగతమయి ఉంటుంది. అందుకే మరో వంచనకు తెర తీసారు. అందులో భాగమే "పదిశాతం కోటా" పేరుతో ఈ సరికొత్త రాజకీయ విన్యాసం.

సాధారణ ప్రజల్లో అంతకంతకూ పేరుకుపోతున్న అసంతృప్తికి తోడు మొదటి నుంచీ తమకు మద్దతుగా నిలుస్తున్న అగ్రవర్ణాలు కూడా తమకు దూరమవుతున్నాయని కమలనాథులు భావిస్తున్నారు. అందుకు ఇటీవలి ఓటములు, ప్రత్యేకించి మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఫలితాలే తార్కాణమని గుర్తెరిగారు. ఈ మూడు రాష్ట్రాల్లో వ్యతిరేక ఓటుకు తోడు ఫలితాలను ప్రభావితం చేసే స్థాయిలో, గణనీయంగా నోటాకూ ఓటు నమోదవడం గమనార్హం. ఈ నోటా ఓటు అగ్రవర్ణాలదేనన్నది వీరి అంతరంగం. కనుక వారి అనుగ్రహం పొందడం తక్షణ కర్తవ్యంగా మారింది. అది కూడా ఈ 'పదిశాతం' ప్రహసనానికి ఓ ప్రధాన కారణం. అంతేకాదు, ఒకవైపు పెద్దమొత్తాల్లో బ్యాంకులను లూటీ చేసి దేశం దాటుతున్న ఆర్థిక నేరస్తుల ఉదంతాలు, మరో వైపు రాజ్యాంగ వ్యవస్థల సంక్షోభం, ఆర్థిక పతనాలకు తోడు ఇంకోవైపు రాఫెల్ కుంభకోణం...ఈ ముప్పేట దాడి ప్రభుత్వాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తున్న తరుణంలో వీటన్నిటి నుంచి బయటపడటానికీ, వీటి నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికీ ఇదో ఉపాయం కూడా...! అంతే తప్ప ఇది పేదల పాలిటి ప్రేమా కాదు, అగ్రకుల పేదల అభ్యున్నతి అంతకంటే కాదని కాస్త లోతుగా ఆలోచిస్తే ఎవరికైనా అర్థమవుతుంది.

నిజానికి ఈ బిల్లు స్వాగతించదగినదే. కానీ బిల్లు తెస్తున్న సందర్భమూ, ఆమోదానికి బీజేపీ పడుతున్న ఆత్రమూ వీటి వెనకున్న రాజకీయ కుయుక్తులే అభ్యంతరకరం! నిజంగానే ఈ బిల్లు పట్ల మోడీకి నిజాయితీ ఉంటే దాని ఆమోదానికి ముందే అమలుకు అవసరమైన రక్షణ చర్యలన్నీ తీసుకునేవారు. మొత్తం రిజర్వేషన్ల పరిమితి 50శాతానికి మించకూడదనీ, రిజర్వేషన్లు కల్పించడానికి ఆర్థిక వెనుకబాటుతనమొక్కటే ఆధారంగా భావించలేమన్న సుప్రీంకోర్టు తీర్పు ఉండగా ఈ పదిశాతం కోటాను ఎలా అమలు చేస్తారు? ప్రపంచీకరణ, ప్రయివేటీకరణలతో మొత్తం ప్రభుత్వరంగాన్నే నిర్వీర్యం చేస్తూ, ఉన్న ఉపాధీ, ఉద్యోగావకాశాలనూ తుడిచిపెట్టేస్తూ ఇప్పుడీ 'ఈబీసీ' బిల్లుకు కొత్త ఉద్యోగాలను ఎక్కడ సృష్టిస్తారు? కొలువుల్లేని ఈ కోటాల వల్ల ఉపయోగమేమిటి? ఈ బిల్లుకు సంబంధించిన క్రిమిలేయర్ నామ్స్ ఎక్కడ చర్చించారు, ఏ ప్రాతిపదికన రూపొందించారు? ఇన్ని అపసవ్యతలూ, అనుమానాల మధ్య బిల్లుపై సభ్యుల కనీస అధ్యయనానికీ అవకాశం ఇవ్వకుండా ఈ హడావుడి ఆమోదం ఎందుకు? గడిచిన ఐదేండ్లుగా ఈ ఊసే మరిచి తీరా పార్లమెంటు ముగియడానికి ఒక్కరోజు ముందు అకస్మాత్తుగా ప్రవేశపెట్టడంలోని ఆంతర్యమేమిటి? ఈ సందేహాలు వేటినీ పరిష్కరించకుండా ఆదరాబాదరా బిల్లును ఆమోదింపజేయడంలో అడుగడుగునా సార్వత్రిక ఎన్నికల్లో లబ్ది పొందాలన్న కపటబుద్ధి తప్ప బీజేపీ చిత్తశుద్ధి కనిపించడం లేదు. అయినా సరే తమ "సబ్‌కా సాత్- సబ్‌కా వికాస్" నినాదం ఈ బిల్లుతో సాకారమయిందన్న ఆత్మస్తుతులు, అహంకృతాలను మోడీ పరివారం అప్పుడే ప్రారంభించింది. ప్రజలు ఈ వంచనకు బలికాకుండా చూసే బాధ్యత మాత్రం ప్రజాస్వామ్య, లౌకిక శక్తులదే...

పరిహాసంపాలైన జలంధర్ సైన్స్ కాంగ్రెస్ !

సత్య

పరస్పర విరుద్ధశక్తులు నిరంతరం పని చేస్తూనే ఉంటాయి. ఒకటి వెనక్కు లాగుతుంటే మరొకటి ముందుకు తీసుకుపోయేందుకు ప్రయత్నిస్తుంది. ఈ పోరులో ఇప్పటి వరకు జరిగిన చరిత్ర అంతా మొత్తం మీద పురోగామి శక్తుల విజయమే. అయినా సరే ఎప్పటికప్పుడు తిరోగామి శక్తులు తమ పని తాము చేస్తూనే వుంటాయి. జనవరి మూడు నుంచి ఏడవ తేదీ వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన భారత సైన్స్ కాంగ్రెస్ 106వ సమావేశాలలో కూడా జరిగింది అదే. అక్కడ చేసిన కొన్ని వుపన్యాసాలు, సమర్పించిన పత్రాలు ప్రపంచంలో మనల్ని నగుబాట్లపాలు చేశాయి. ప్రపంచ మీడియా వీటి గురించి బహుళ ప్రచారమిచ్చింది. రెండేండ్ల క్రితం కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన బయాలజిస్ట్, నోబెల్ బహుమతి గ్రహీత అయిన వి రామకృష్ణన్ తాను హాజరైన సైన్స్ కాంగ్రెస్ సమావేశంలో సైన్సు గురించి చర్చించింది తక్కువని తానింకోసారి ఇలాంటి సమావేశాలకు హాజరు కానని చెప్పిన మాటలు ఇంకా మన చెవుల్లో గింగురుమంటున్నా ఒక్కరంటే ఒక్కరు కూడా సదరు వుపన్యాసాలను అడ్డుకొనేందుకు ప్రయత్నించలేదు. గత మూడు సమావేశాలలోనూ జరిగింది అదే. తాజా సమావేశాలు భవిష్యత్ భారత్ : శాస్త్రము, సాంకేతికము అనే ఇతివృత్తంగా జరిగాయి. ఆందోళనకరమైన అంశం ఏమంటే గత సమావేశాల అనుభవాలను చూసి అలాంటి శక్తులు ఆ వేదికను వుపయోగించుకోవటాన్ని అడ్డుకొనేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేయలేదు. అశాస్త్రీయ విషయాలను నిరూపిత అంశాలుగా చిత్రిస్తున్న వారిని ఒక్కరంటే ఒక్కరు కూడా


> **సమాజాన్ని తిరోగమనంలో నడపాలని చూసేవారికి శాస్త్రీయ, ప్రత్యామ్నాయ విధానాల అవగాహన పెరగటం ఏమాత్రం ఇష్టం వుండదు. పరిశోధన, అభివృద్ధికి తగినన్ని నిధులు కేటాయించని దేశమూ, సమాజమూ ముందుకు పోయిన దాఖలా మనకు కనపడదు. యధారాజా తథా ప్రజ అన్నట్టు ఆ పని చేయని పాలకులు ఉన్నపుడు వారికి వంతపాడే మేథావులు కూడా ఇష్టగానాలు, నృత్యాలే చేస్తారు. జలంధర్ సైన్స్ కాంగ్రెస్‌లో జరిగింది అదే. ఇలాంటి ధోరణులను ప్రతిఘటించకపోతే రాబోయే సమావేశాల్లోనూ అదే పునరావృతమవుతుంది.**

ఈ సమావేశాలలో నిలదీసి ప్రశ్నించకపోవటం మన శాస్త్రవేత్తల భావదారిద్ర్యానికి నిదర్శనమా ! లేక తాము నమ్మిన, పరిశోధించిన అంశాలమీదే అపనమ్మకమా ? రెండూ ప్రమాదకరమే !

న్యూటన్ పుట్టక ముందే గురుత్వాకర్షణ శక్తి వుంది, డార్విన్ తాను చెప్పిన పరిణామ క్రమంలో భాగంగానే ఒక మానవుడిగా పుట్టాడు. వాటిని ఒక శాస్త్రీయ పద్ధతిలో వివరించటమే వారు చేసింది. అవి ప్రపంచం ముందుకు వచ్చినపుడు ఏ వేద లేదా సంస్కృత పండితుడు అవన్నీ తమకు ఎప్పుడో తెలుసని సవాలు చేసిన వారుగానీ, వివరించిన వారు గానీ లేరు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సభలు జరుగుతున్నాయంటే ఆ రంగంలో మన పురోగతి, సాధించిన విజయాలను సమాజం ముందుంచి శాస్త్రవిషయాల పట్ల భారత పౌరుల్లో ఆసక్తి కలిగించాలని ఎవరైనా ఆశిస్తారు. కానీ గత నాలుగేండ్లుగా జరుగుతున్నదేమిటి? దానికంటే అశాస్త్రీయ విషయాలను ముందుకు తెచ్చి వేదాల్లో అన్నీ వున్నాయష అనే రోజుల్లోకి తీసుకుపోతున్నారు.

జలంధర్ సైన్స్ సభల్లో కొందరు చేసిన ప్రవచన అంశాలు దేశాన్ని వెనక్కు తీసుకుపోయేవిగా వున్నాయి. అవేమిటో సంక్షిప్తంగా చూద్దాం. మహాభారత కాలం నాటికే మన దేశంలో బొడ్డు తాడు కణాల పరిశోధన వుంది, వంద కుండల్లో వంద అండాలను పెట్టి కౌరవులను పుట్టించారు, ఇది టెస్ట్ ట్యూబ్ పిల్లల పరిజ్ఞానం కాదా అంటూ ఆంధ్రావిశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జి నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఈ పేరుమోసిన విద్యావేత్త మేధస్సు అంతవరకే పరిమితం కాలేదు, రావణుడికి ఎందరు ఎక్కినా ఒకరికి ఖాళీ వుండే పుష్పక విమానం వుండటమే కాదు, లంకలో 24 చిన్నా పెద్ద విమానాలు, ఎన్నో విమానాశ్రయాలు వుండేవని, సైనిక అవసరాలకు విమానాలను వాడారని కూడా రామాయణం చదివితే మనకు తెలుస్తుందనీ సెలవిచ్చారు. అంతేనా చార్లెస్ డార్విన్ పరిణామ సిద్ధాంతం కంటే ముందే దాని గురించి మనకు తెలుసని డార్విన్ చెప్పినదాని ప్రకారం తొలిజీవి నీటి నుంచి ప్రారంభమైందని దశావతారాల్లో మత్స్యావతారం మొదటిదని అంటే దశావతారాలు పరిణామ సిద్ధాంతమనీ చెప్పారు. విష్ణువు దగ్గర లక్ష్యాన్ని ఛేదించి తిరిగి వచ్చే నియంత్రిత క్షిపణుల మాదిరి శంఖుచక్రం వుందని కూడా చెప్పారు.

రావణుడి గురించి చెప్పిన రావుగారు రాముడి విమానాల గురించి చెప్పలేదు. పురాణాల ప్రకారం సత్య, త్రేతా, ద్వాపర, కలియుగాల్లో రకరకాల విమానాలున్నాయి. వాటిలో ఎక్కువ భాగం మానసిక శక్తితోనే నడిచాయి. అలాంటపుడు రాముడికి విమానాలెందుకు లేవు, అడవులకు రధాల మీద, నదులు దాటేందుకు పడవలు ఎందుకు ఎక్కారు. విమానాల మీద పోవచ్చు కదా ! రావణుడు అడవిలోని సీతను అపహరించేందుకు రథంలో వచ్చాడు, సీతను రథంలో ఎక్కించుకొని పోయి సముద్రాన్ని ఎలా దాటాడు, రథాన్ని ఎక్కడ వుంచాడు, సముద్ర ప్రయాణానికి ఓడను వుపయోగించాడా ? విష్ణుమూర్తి అవతారంగా చెబుతున్న రాముడి దగ్గర నియంత్రిత క్షిపణి శంఖుచక్రం బదులు విల్లు, బాణాలు ఎందుకున్నాయి, విమానాలు ఎందుకు లేవు? లంకను చేరుకొనేందుకు రాముడి దగ్గర ఓడలు కూడా లేవా, వుంటే వానర సైన్య సాయంతో వారధిని ఎందుకు కట్టించినట్టు ? రావణుడిని సంహరించేందుకు క్షిపణి ప్రయోగం ఎందుకు చేయలేదు. హనుమంతుడు లంకా దహనం చేశాడని రాశారు తప్ప రావణుడి దగ్గర వున్న పుష్పక విమానాన్ని, ఇతర విమానాలను, లంకలోని విమానాశ్రయాలను దహనం చేయలేదా, వానర లేదా రాముడి సేనలపై రావణుడు వైమానిక దాడులు ఎందుకు చేయలేదు, రావణుడిని వధించిన తరువాత రాముడు ఆ విమానాలను స్వాధీనం చేసుకోలేదా ? ఆ తరువాత ఆ విమానాలు, క్షిపణులు ఏమయ్యాయి అనే ప్రశ్నలకు కూడా వైస్ ఛాన్సలర్‌గారు సమాధానాలు చెప్పాల్సి వుంది.



సమస్య ఏమంటే మన శాస్త్రవేత్తలు ఇలాంటి ప్రచారాన్ని ఖండిస్తూ ఎందుకు ముందుకు రావటం లేదు. వేదికలపై ఎందుకు అనుమతిస్తున్నారు. దీనికి ప్రధానంగా ఒకటి కనిపిస్తోంది. ప్రభుత్వం సైన్స్ కాంగ్రెస్ వంటి వాటికి ధన, ఇతర రూపాలలో కొంత సాయం చేస్తున్నది. వాటిని ప్రారంభిస్తున్న ప్రధాని, కేంద్ర మంత్రులు స్వయంగా ఇలాంటి అశాస్త్రీయ విషయాలను తమ సందేశాలలో వెల్లడిస్తున్నారు. అందువలన వారికి లేదా వారి దివాలాకోరు భావజాలానికి వ్యతిరేకత వ్యక్తం చేస్తే సాయం ఆగిపోవచ్చు, నిర్వాహకుల వుద్యోగాలకు ముప్పు రావచ్చు, ప్రమోషన్లు ఆగిపోవచ్చు, అలాంటపుడు ఎవరేమి చెబితే మనకెందుకు అనే దిగజారుడుతనం తప్ప మరొకటి కనిపించటం లేదు. వినాయకుడికి ఏనుగు తల అతికించటాన్ని బట్టి మనకు గతంలోనే ప్లాస్టిక్ సర్జరీ తెలుసుని సాక్షాత్తూ ప్రధాని మోడీయే చెప్పిన తరువాత గతంలో ఒక సైన్స్ కాంగ్రెస్‌లో కేంద్ర మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఆల్జీబ్రా, పైథాగరస్ సిద్ధాంతాలను ప్రపంచానికి భారత్ ఇచ్చిందని చెప్పటంలో ఆశ్చర్యం ఏముంది. ముంబై విశ్వవిద్యాలయ సంస్కృత విభాగ అధిపతి గౌరీ మహులీకర్ ఒక పత్రికలో రాసిన వ్యాసంలో జామెట్రిక్ ఫార్ములా గురించి క్రీస్తుకు పూర్వం 800 ఏండ్ల క్రితమే సులభ సూత్ర అనే గ్రంధంలో బౌధాయన రాశాడని వాటినే పైథాగరస్ సిద్ధాంతం అంటున్నామని ఆ పెద్దమనిషి పేర్కొన్నాడు. ఏడు వేల సంవత్సరాల క్రితమే భరద్వాజ మహర్షి విమానాల గురించి రాశాడని యుద్ధాలకు వుపయోగించే వాటిలో ఒక్కోదానికి 30 ఇంజన్లు వుండేవని, అవి ఎటు కావాలంటే అటు తిరిగి, ఎగిరేవని కెప్టెన్ ఆనంద్ జె బోడాస్ చెప్పాడు. కిరణ్ నాయక్ అనే మరో పెద్దమనిషి అయితే మహాభారత యుద్ధకాలంలో విమానాలతో యుద్ధం చేసిన వారు తలకు హెల్మెట్లు వాడారని నేను చెప్పేది నమ్మకపోయినా అలాంటి ఒక హెల్మెట్‌ను నాసా కనుగొన్నదని కావాలంటే గూగుల్‌లో తెలుసుకోవచ్చని పేర్కొన్నాడు. తాజా సమావేశాలలో శాస్త్రవేత్తను అని చెప్పుకొన్న కెజె కృష్ణన్ అనే వ్యక్తి న్యూటన్, ఐనిస్టీన్‌లకు పెద్దగా భౌతిక శాస్త్రం గురించి తెలియదని, ప్రపంచాన్ని మోసం చేశారంటూ తాను చెప్పేదాన్ని అంగీకరిస్తే భవిష్యత్‌కు మరింత వుపయోగమన్నాడు. ఇప్పుడు ప్రపంచానికంతకూ తెలిసిన గురుత్వాకర్షణ తరంగాలకు నరేంద్రమోడీ తరంగాలని పేరు పెట్టాలని, గురుత్వాకర్షక కాంతికి హర్షవర్ధన్(కేంద్రమంత్రి) పేరు పెట్టాలని బయట పెట్టాడు. ఏ శాస్త్రవేత్తయినా కొత్త సిద్ధాంతం లేదా పద్ధతిని కనిపెడితే అనేక సందర్భాలలో అతను లేదా ఆమె పేరు పెడతారు. ఈ పెద్దమనిషి ఎలాగూ తనను శాస్త్రలోకం ఆమోదించదు కనుక మోడీ, హర్షవర్ధన్ పేర్లు పెట్టాలని కోరాడు. అబ్దుల్ కలాం కంటే భవిష్యత్‌లో మంత్రి హర్షవర్ధన్ పెద్ద శాస్త్రవేత్త అవుతారని కృష్ణన్ సెలవిచ్చాడు.

సైన్స్ కాంగ్రెస్‌లో అశాస్త్రీయ ప్రకటనలు చేయటాన్ని సభకు హాజరైన వారు ఖండించకపోయినా బెంగళూరులో కొందరు శాస్త్రవేత్తలైనా నిరసించారు. ఇదేమాత్రం చాలదు. వివిధ సంస్థలకు చెందిన వున్నతాధికారులేమి చేస్తున్నారు. సైన్స్ కాంగ్రెస్ అజెండా నిర్ణయంలో ప్రభుత్వానికేమీ పాత్ర వుండదని ప్రభుత్వ ప్రధాన శాస్త్ర సలహాదారు కె విజయ రాఘవన్ చెప్పారు. ఆంధ్రాయూనివర్సిటీ వీసీ నాగేశ్వరరావు చెప్పిన అంశాలను విమర్శిస్తూ అతని మీద ఒక ఫిర్యాదు దాఖలు చేయాలన్నారు. బయాలజిస్ట్ నాగేశ్వరరావు చెత్త మాట్లాడుతున్నపుడు శాస్త్రవేత్తల్లో వేడి పుట్టాలని అన్నారు. నాగేశ్వరరావు, కృష్ణన్ మాట్లాడిన అంశాలు అపహాస్యం పాలుగావటంతో వాటితో తమకేమీ సంబంధం లేదని సైన్స్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రేమేందు పి మాథుర్ ప్రకటించారు. తదుపరి తమ సమావేశాల్లో ప్రసంగించే వారికి సంబంధించి నిబంధనలు సవరించనున్నామని, వారేమి మాట్లాడేది తెలుసుకొని, ఇతర విషయాలు మాట్లాడబోమనే హామీలు తీసుకొని సరైన వారిని ఎంపిక చేస్తామని చెప్పారు. తానే గనుక ప్రసంగ సమయంలో అక్కడ వుండి వుంటే ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించేవాడినని, ఆధారం చూపాలని కోరి వుండే వాడినని అన్నారు. సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు మనోజ్ చక్రవర్తి విలేకర్లతో మాట్లాడుతూ నాగేశ్వరరావు మాటలతో తాను దిగ్భ్రాంతి చెందానని, అతనికి ఈ విషయాలు ఎలా తెలుసు, ఏదైనా ఆధారం వున్నదా, శాస్త్ర సమాజం దిగ్భ్రాంతి చెందింది అని వ్యాఖ్యానించారు. తాము కొల్‌కతా వెళ్లిన తరువాత అతని ప్రసంగాన్ని ఖండిస్తూ లాంఛనంగా ఒక ప్రకటన చేస్తామని వెల్లడించారు.

ఇలాంటి చెత్త మాట్లాడేవారి గురించి సైన్స్ కాంగ్రెస్ పెద్దలకు గతంలో ఫిర్యాదులు అందలేదా అంటే మూడేండ్ల క్రితమే ముంబై సమావేశం తరువాత తాము ఆందోళన చెందుతున్న అంశాల గురించి సైన్స్ కాంగ్రెస్ అధ్యక్షుడికి ఫిర్యాదు చేశామని బెంగళూరుకు చెందిన బ్రేక్ త్రూ సైన్స్ సొసైటీ కార్యదర్శి కెఎస్ రజని చెప్పారు. తరువాత మైసూరు, తిరుపతి, ఇపుడు జలంధర్‌లో అదే పునశ్చరణ అయిందని, ఇలాంటి వాటిని ఎలా అనుమతిస్తున్నారని జనం నిర్వాహకులను నిలదీయాలని అన్నారు. ప్రముఖ రసాయన శాస్త్ర ప్రొఫెసర్ సిఎన్ఆర్ రావు మాట్లాడుతూ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు తాను రావటం లేదని, వస్తే ఇలాంటి ప్రకటనలను ఆమోదించినట్టవుతుందని అన్నారు.

డైనోసార్లపై 25ఏండ్లుగా పరిశోధనలు జరుపుతున్నట్టు చెప్పుకుంటున్న పంజాబ్ విశ్వవిద్యాలయ జియాలజిస్టు అషు ఖోస్లా ఈ సమావేశాలకు సమర్పించిన ఒక పత్రంలో బ్రహ్మ ఒక పెద్ద శాస్త్రవేత్త అని, డైనోసార్ల గురించి వేదాల్లో ప్రస్తావన వుందని, అసలు వాటికా పేరు మన సంస్కృతం నుంచే వచ్చిందన్నారు. భారతీయ డైనోసార్ అస్తికలను తమ బృందం గుజరాత్‌లోని ఖేదా జిల్లాలో కనుగొన్నదని చెప్పారు. నిజంగానే కనుగొని వుండవచ్చు, కానీ బ్రహ్మ పెద్ద శాస్త్రవేత్త, ఈలోక సృష్టికర్త, ఆయనకు డైనోసార్ల గురించి తెలుసు అని చెప్పిన మాటలతో అతని పరిశోధనను అనుమానించాల్సి వస్తోంది.

ప్రతి సమాజం అనేక ఊహలకు నిలయమైంది. వాస్తవంతో పని లేకుండా ఊహలతో నిండిన సాహిత్యాన్ని సృష్టించారు. అందుకు మన దేశం మినహాయింపు కాదు. వాటినే ఇప్పుడు ప్రధాని మోడీ నుంచి వీసీ నాగేశ్వరరావు వంటి వారి వరకు అనేక మంది పురాతన శాస్త్రంగా చెప్పటమే కాదు, ఆధునిక ఆవిష్కరణలకు జోడించి చెబుతున్నారుఏ కాలంలో అయినా మానవుడికి ఏనుగుకు పరిమాణంలో ఎంతో తేడా వుంటుంది. వినాయకుడికి అంత పెద్ద ఏనుగు తలను అతికిస్తే ఆ భారాన్ని ఎలా భరించేవాడు, దాన్ని వేసుకొని అతి చిన్న ఎలుక వాహనం మీద ఎలా ఎక్కేవాడు, అన్నింటికీ మించి ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు వుంటే తెగిన వినాయకుడి తలనే అతికించ కుండా, ఏనుగు తలను ఎందుకు తెచ్చారు, అంతకంటే చిన్న జంతువులు దొరకలేదా అనే సందేహాలు రానవసరం లేదా ?

సెల్: 8331013288

మెయిల్ @ నవతెలంగాణ

'స్ప్రు' నిర్మూలించిన ఎల్లాప్రగడ సుబ్బారావు



జి. శ్రీలతరమేశ్


వైద్యులు జబ్బులు వస్తే రాసే ఔషధాలనే ఎంతో శ్రమకోర్చి పరిశోధించి మన వాళికి అందించిన" ఔషధ బ్రహ్మ" ఎల్లా ప్రగడ. సుబ్బారావు బీదరికంలో పుట్టి అకుంఠిత దీక్షతో భీమవరం నుండి బోస్టన్ చేరి జీవితాన్ని వైద్య పరిశోధనలకు అంకితం చేసిన తెలుగు బిడ్డ ఎల్లాప్రగడ సుబ్బారావు. ఎన్నో వ్యాధులకు దివ్యమైన ఔషధాలను కనిపెట్టిన అపర ధన్వంతరి.1895 జనవరి12న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జన్మించాడు. ఏడుగురు సంతానంలో ఇతడు నాలుగవ వాడు. తండ్రి జగన్నాథం రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా పనిచేశారు. 1911లో మెట్రిక్యులేషన్ పరీక్షలో సుబ్బారావు రెండు సార్లు ఫెయిల్ అయ్యారు. కాని తల్లి పట్టు విడవకుండా ఎంతో కష్టపడి మద్రాసులోని స్కూలుకు పంపినది. కానీ 1913లో తండ్రి చనిపోవడంతో ఆర్థిక ఇబ్బందులున్నా అర్ధాంతరంగా చదువు ఆగిపోకూడదని భావించిన తల్లి తన పుస్తెలతాడును అమ్మి చదువుకు డబ్బులను సమకూర్చింది. ఈ సంఘటనతో చలించిపోయిన సుబ్బారావు తన జీవితంలో ఎన్నడూ పరీక్ష తప్పలేదు. గణితంలో డిస్టింక్షన్లో రావడంతో గణితం ఆనర్స్ చేయాలని అందరూ ప్రోత్సహించిన తాను మాత్రం కాలేజీలో చేరాడు.

విదేశీ దుస్తులను బహిష్కరించి ఖద్దరు తో కాలేజీకి వెళితే శ్వేత జాతీయుడైన సర్జరీ ప్రొఫెసర్ సుబ్బారావుపై మండిపడే వాడు. అన్నిట్లో మంచి మార్కులతో పాసైన సర్జరీలో మాత్రం బొటాబొటీ మార్కులు వేశారు. దీనితో ఎంబీబీఎస్ డిగ్రీ కాకుండా అంతకన్న తక్కువైన ఎల్ఎంఎస్ సర్టిఫికెట్‌ను ప్రదానం చేశారు. ఆ కాలంలో పై చదువులకి బ్రిటన్ వెళ్లి చదివేవారు భారతీయులు. కానీ బ్రిటన్ వాళ్లంటే నచ్చని సుబ్బారావు అమెరికాకు వెళ్లాలని నిర్ణయించు కున్నారు.అందు కొరకు హార్వర్డ్ మెడికల్ కాలేజీకి లేఖ రాశారు. సానుకూల స్పందన రావడంతో చాలా సంబరపడ్డాడు. కానీ చేతిలో డబ్బులు లేవు. వారం రోజుల తేడాతో తన ఇద్దరు సోద రులు "స్ప్రు" వ్యాధితో మరణించడంతో సుబ్బా రావు మనసును తీవ్రంగా కలచివేశాయి. ఎలా అయినా ఈ వ్యాధికి మందు కనుగొనాలనే పట్టు దల పెరిగింది. మామగారి సహాయంతో, కాకినాడలోని ఓ ఛారిటీ సంస్థ ఆదుకోవడంతో 1923 సెప్టెంబర్ లో అమెరికాకి ప్రయాణ మయ్యారు. భీమవరం నుంచి బోస్టన్ వెళ్లిన సుబ్బారావు మళ్లీ భారతావనిపై అడుగు పెట్టలేదు. నిరంతరం వైద్య పరిశోధన లోనే ఉండిమర్చిపోయారు. తర్వాత కాలంలో సుబ్బారావే 'స్ప్రు' వ్యాధికి వ్యాక్సిన్ కనుగొన్నారు.

అమెరికాలో అడుగుపెట్టే వరకే తన దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. దీంతో సుబ్బారావు బోస్టన్లోని ఒక ఆస్పత్రిలో మూత్ర శాలలను, పేషంట్‌ల బెడ్ పాన్లను శుభ్రం చేయడం లాంటి పని లో చేరారు. రాత్రంతా ఆస్పత్రిలో పనిచేయడం పగలంతా కాలేజీలో చదువుతూ పైకి ఎదిగిన వ్యక్తి సుబ్బారావు తన ప్రతిభతో ప్రొఫెసర్ల మెప్పు పొందుతూ స్కాలర్‌షిప్ సాధిస్తూ పరిశోధనలను సాగిం చారు. డాక్టర్ "ఫిస్కే" సహాయంతో శరీర కణాలలోని భాస్వరాన్ని సరిగ్గా, తేలిగ్గా నిర్ధారణ చేసే "రేపిడ్ కెలరోమెట్రిక్ "మెథడ్ ను ఆవిష్కరించి 1924లో తొలిసారిగా ప్రపంచానికి తెలిశారు సుబ్బారావుఇదే "ఫిస్కే సుబ్బారావు" పద్ధతిగా పేరొందింది. ఆ తరువాత శరీరంలోని కండరాల శక్తికి మూలపదార్థం "అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్" అని నిర్ధారించి జీవరాశి భౌతిక ప్రక్రియలను నిర్ణయించేది ఇదేనని వెల్లడించారు. దీని వలన 1922లోనే నోబుల్ బహుమతి పొందిన శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితాలు సైతం తప్పని రుజువైంది. అయినా కూడా సుబ్బారావుకు నోబెల్ బహుమతి రాలేదు.తన పరిశోధనలో అతి ముఖ్యమైనది "స్ప్రు" వ్యాధిని అరికట్టే ఫోలిక్ యాసిడ్ విటమిన్ కనుగొనడం తన జీవితంలోనే ఆనంద ఘటన. ప్రాణాంతకంగా నిలిచిన వ్యాధిని సమూలంగా అణిచివేసిన మూలకారకుడు సుబ్బారావే. అంతే కాక "బోదకాలు", "ఇసినోఫి లియా"ల వంటి వ్యాధులకు ఉపయోగపడే "హైట్రాజెన్": క్షయ వ్యాధి నివారణగా పేర్కొనే "ఇనోనెక్", "కలరా", "టైఫాయిడ్", "ప్లేగు", "అతిసారం".... వ్యాధులకు దివ్య ఔషధంగా ఉపయోగపడే "టెట్రాసైక్లిన్" ఆంటీబయాటిక్‌లతో పాటు పిల్లల్లో "బ్లడ్ క్యాన్సర్ "ను అరికట్టే "మెథాట్రెక్సేట్", "అరియోమైసిన్" లు సుబ్బారావు పరిశోధనల ఫలితాలే. ఎన్నో పరిశోధనలు చేసినా రావాలని ఏనాడు ప్రాకులాడలేదు. "లేడర్లే" సంస్థ సుబ్బారావును తమ డైరెక్టర్‌గా నియమించింది. ఆయన జీవితం చివరి వరకు ఆ సంస్థలోనే ఉండి ఎన్నో పరిశోధనలు చేశారు. కొన్ని ఆంటీబయాటిక్ లకు "సుబ్బామైసిన్" "సుబ్బరోమైసిన్" అనే లేడర్లే సంస్థ పేరు పెట్టుకుంది.1948 ఆగస్టు 9న నిద్ర లోనే గుండెపోటుతో సుబ్బారావు కన్ను మూశారు.

సెల్: 7013943368

వికాసం లేదు... ఉన్నది పేదరికమే



జి. తిరుపతయ్య

2014కు ముందు ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ "కాంగ్రెసుకు 60 ఏండ్లు అవకాశం ఇచ్చారు. నాకు 60 నెలలు అవకాశం ఇవ్వండి. దేశ రూపురేఖలు మారుస్తాను" అని అడిగారు. అధికారం చేపట్టిన ఈ 60 నెలల అనంతరం వారు తేల్చింది ఏమంటే "భారతదేశంలో వికాసం లేదు పేదరికమే ఉన్నది" అని. దాన్ని నిర్మూలించేందుకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించారు. జనరల్ కేటగిరీలోని ఈ పేదల గురించి ఇప్పటికైనా గుర్తు రావడం సంతోషం.. ఈ నిర్ణయం తమ ప్రణాళిక రహిత పాలనను ఎత్తిచూపుతోంది. పార్టీ కార్యక్రమం అనే సైద్ధాంతిక డాక్యుమెంటును నిర్ధారించుకోకపోవడం వల్లనే ఆ పార్టీలు ఇలాంటి తాత్కాలిక ఎత్తుగడలతో పరిపాలన సాగిస్తూ ఎప్పుడు సమాజంలో సంక్షోభ పూరిత వాతావరణానికి అవకాశమిస్తుంటాయి. అలాంటి సుడిగుండంలో చిక్కుకుని కొట్టుమిట్టాడుతూ ప్రజల్ని కూడా ఇబ్బందులు పెడుతూ ఉంటాయి. ఇప్పటి మోడీ పాలన అందుకు ప్రత్యేక నిదర్శనం.

కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం గత నాలుగున్నరేండ్లుగా సాధ్యాసాధ్యాలు ఆలోచించకుండా భావోద్వేగాలతో తప్పు మీద తప్పు, తప్పు మీద తప్పు చేస్తూ నిర్ణయాలు తీసుకుంటోంది. అధికారం చేపట్టగానే నల్లధనాన్ని వెనక్కి తీసుకొచ్చేందుకు "స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం" ఏర్పాటు చేసింది. ఇంతవరకు అది ఏ ఫలితం సాధించిందో తెలియదు! జాతీయ గీతాన్ని సినిమాహాళ్లలో ప్రదర్శించాలని నిబంధన పెట్టింది. ఈ నాలుగేండ్ల తర్వాత ఇప్పుడు సినిమా హాళ్ళల్లో జాతీయ గీతం వినిపించడం లేదు. ప్రభుత్వ ఆఫీసుల్లో ప్రతిరోజు ఉదయం 10 గంటలకు వందేమాతరం ఆలపించాలని ప్రతిపాదన పెట్టింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కొన్నిచోట్ల తప్ప ఎక్కడా ఇదీ అమలు జరగడం లేదు. రాత్రికి రాత్రే నోట్ల రద్దు ప్రకటించింది. అది ఎన్నో దుష్ఫలితాలను ఇచ్చింది. నిశితంగా అధ్యయనం చేయకుండా అమల్లో పెట్టిన జీఎస్టీ అనే తప్పుల తడక అల్లడానికి నానా తంటాలు పడుతూ ప్రభుత్వ ఖజానాకు గండి పడే విధంగా సవరణలు చేస్తూ ఉన్నది. నిర్ణయాలన్నీ ప్రకటించినప్పుడు ప్రజల్లో ఆహా ఓహో అంటూ పెద్ద ఎత్తున బలపరిచిన సంకేతాలు వినబడ్డాయి. అదే రీతిలో అతి తక్కువ కాలంలో విమర్శలు కూడా విరుచుకుపడ్డాయి. ఇప్పుడు ప్రకటించిన అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్ కూడా ఆ కోవలోకే వస్తుంది. అగ్రవర్ణాల్లో పేదలు ఎందరు? అది ఏ ఏ రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నది? అగ్రవర్ణాలలో ధనికులెవరు దాని సంగతేంటి, ఇన్నాళ్ళూ ఏ రకమైన వివక్షకు గురయ్యారు? ఈ నిర్ణయం ద్వారా ఎంతమందికి లబ్ది చేకూరనున్నది? ఇటువంటి విషయాలను అధ్యయనం చేయకుండా ఒక భావోద్వేగాన్ని సంతృప్తిపరచడం కోసం పది శాతం రిజర్వేషన్లను ప్రకటించడం అపరిపక్వ సామాజిక అవగాహనను ఓట్లకోసం వారి వెంపర్లాటను తెలియజేస్తున్నది.

రిజర్వేషన్ల విధానాన్ని ప్రతిపాదించింది డా. బి.ఆర్.అంబేద్కరే, కానీ ఆనాటి డ్రాఫ్టింగ్ కమిటీలో 300 మంది కాకలుతీరిన పండితులు ఉన్నారు, అందరూ మెజారిటీగా అంగీకరించిన అంశం ఏమంటే భారతదేశ ప్రజానీకాన్ని ఒక సమూహాలుగా చూసినప్పుడు ఆర్థికంగా ఒకేవిధమైన స్థాయిలో ఉన్న సమూహం కులాల ఆధారంగా మాత్రమే అని కనబడింది. కనుకే పేదరిక నిర్మూలనకు కులాల ఆధారంగా మాత్రమే రిజర్వేషన్లు కల్పించడానికి ఒప్పుకున్నారు. అయితే ఇన్నాళ్లు రిజర్వేషన్లకు దూరంగా ఉన్న అగ్రవర్ణాలలోని కొందరు రిజర్వేషన్లు పొందుతున్న



కులాల్లోని వారి కన్నా తక్కువ ఆదాయాలు ఉన్న వారు కూడా ఉన్నారు. అందుచేత ఇలాంటి వారికి ఉద్యోగాల్లో విద్యలో రిజర్వేషన్లు కల్పించడం సబబే. కానీ ఇప్పుడు ప్రకటించిన ఈ పేదరిక నిర్వచనం వల్ల అట్లాంటి వెనకబడిన లేదా పేదరికంలో మగ్గుతున్న అగ్రవర్ణాల పేదలకు ఏమాత్రం ఉపయోగం లేదు. ఎందుకంటే 8 లక్షల వార్షిక ఆదాయం, ఐదెకరాల భూమి ఉన్న వాళ్ళు ఎవరు పేదలు కాలేరు. నిటి అయోగ్ ప్రకారం 2016 - 17 సంవత్సరానికి భారతదేశ తలసరి ఆదాయం లక్షా 13 వేల రూపాయలు. ఇందులో మాధ్యమిక(మీడియన్) ఆదాయం 40,000. అనగా భారతదేశ జనాభాలో సగానికి పైగా మంది 40 వేల కన్నా తక్కువ ఆదాయం పొందుతున్నారు. 10 వేల కన్నా తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలు 90 శాతం పైనే ఉన్నాయని ఎన్నో స్వచ్ఛంద సంస్థలు నిర్ధారించాయి. మరి అట్లాంటి గణాంకాలు ఉన్నప్పుడు ఎనిమిది లక్షలు ఆదాయాన్ని గరిష్టంగా పెట్టి అగ్రవర్ణ పేదలను నిర్ధారించడం వల్ల అగ్ర వర్ణ పేదల్లోని అధికాదాయం గల వారే లబ్ది పొందుతారు తప్ప ఏ ఫలితాలనూ ఇవ్వదు. వ్యక్తిగత ఆదాయాన్ని రెండున్నర లక్షల పైన చూపిస్తూ ఆదాయపన్ను చెల్లిస్తున్న వారి సంఖ్య కేవలం మూడు శాతం మాత్రమే, అనగా తప్పుడు ధ వీకరణల తీరు చాలా ఎక్కువ. ఈ ఆదాయ ధ్రువపత్రాల నిర్ధారణ క్రమంలో ఎన్ని తికమకలు ఏర్పడతాయో రెవెన్యూ సిబ్బంది ఎన్ని ఇబ్బందులు పడతారో ముందుముందు సినిమా చూడాల్సిందే. ఇక అగ్రవర్ణాల సంఖ్యను తీసుకుంటే తెలంగాణ రాష్ట్రంలో కేవలం 7.5 శాతం మాత్రమే ఉన్నది. ఇందులో ఎంత మంది పేదలు ఉన్నారో గుర్తించాల్సిన అవసరం ఉన్నది. శాతం ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉండవచ్చు. హర్యాన, ఛత్తీస్‌ఘడ్, జార్కండ్, త్రిపుర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్, బీహార్, ఉత్తరాంధ్ర, మట్వాడా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అగ్రవర్ణాల సంఖ్య తక్కువగా ఉన్నది. ఇతర రాష్ట్రాల్లో ఎక్కువగా ఉండవచ్చు అలాంటప్పుడు సమగ్ర సర్వే చేసి నిర్ధారణ చేయవలసి ఉండే. ఒకవేళ సగటున దేశం మొత్తం మీద 15 శాతం అగ్రవర్ణాల వారు ఉన్నట్లైతే, అందులో సగం మంది పేదలు అనుకుంటే, అలాంటప్పుడు జనాభా ప్రాతిపదికన ఎక్కువ శాతం రిజర్వేషన్ కల్పించినట్టు అవుతుంది. దేశంలో ఈ రోజు ఎస్సీలు 18 శాతం ఎస్టీలు 10శాతం కానీ అమలవుతున్న రిజర్వేషన్లు వరుసగా 15 శాతం, ఏడున్నర శాతం. బీసీలు సగటున 50 శాతం పైనే. అవకాశమిచ్చింది 29 శాతం మాత్రమే, అమలు జరుపుతున్నది పదకొండు రాష్ట్రాలే. అంటే జనాభా ప్రాతిపదికన కూడా రిజర్వేషన్లు లేవు. రిజర్వేషన్ల ద్వారా జనరల్ కేటగిరీలో అన్ని కులాల వారికి అవకాశాలున్నాయి. అన్నప్పుడు రిజర్వు చేయబడిన ఈ పది శాతానికి కూడా అన్ని వైపులా ఎసరు పెట్టే అవకాశాలున్నవి. దీనిని నిశితంగా అధ్యయనం చేయాల్సి ఉంది.

భారతదేశంలో డిగ్నిటీ ఆఫ్ లేబర్ అనే కాన్సెప్ట్ లేదు. ఆదాయ స్థాయినిబట్టే వ త్తి ఉంటుంది. పాచి పనులు, పారిశుధ్య పనులు, ఇండ్లల్లో పనిచేసే మహిళలు, సహాయక సిబ్బంది లేదా అటెండర్లు.. ఇట్లాంట వృత్తులు చేసే వాళ్ళు అంతా దళితులు లేదా వెనుకబడిన వర్గాలకు చెందిన వారే 90 శాతానికి పైగా ఉంటారు. పనికి దగ్గ ప్రతిఫలం ఇచ్చే సంస్కృతి ఉండి ఉంటే అన్ని పనులు అందరూ చేసే వారు. వృత్తుల్లో, వాటికి చెల్లిస్తున్న వేతనాల్లో వివక్షను తక్షణమే అరికట్టాలి. ఇక ఉద్యోగాల పరంగా చూసినప్పుడు ప్రభుత్వ ఉద్యోగాలు దేశం మొత్తం తిప్పి రెండు కోట్లకు మించి లేవు. ప్రతి రాష్ట్రానికి సగటున మూడు లక్షల చొప్పున 75 లక్షల మంది టీచర్లు, లక్ష చొప్పున 25 లక్షల మంది పోలీసులు, మరో లక్ష చొప్పున 25 లక్షల మంది రెవెన్యూ సిబ్బంది, బ్యాంకులు, రైల్వే, మైనింగ్, పోస్టులు, ఇన్సూరెన్స్ రంగం చూస్తే మరో పాతిక లక్షలు మాత్రమే సంఘటిత రంగం కనిపిస్తున్నది. వీటన్నింటిలో ఎంగిలి చేయి విదిలించినట్టు తప్ప నియామకాలు దాదాపు నిలిచిపోయాయి. వీటన్నిటి దృష్ట్యా నిర్దిష్టమైన లక్ష్యాలు లేకుండా ప్రకటించిన రిజర్వేషన్లు బోడి గుండుకు దువ్వెన ఇచ్చినట్టే.

సెల్: 9951300016

చేసే పని చిన్నదైనా.. పెద్దదైనా... అంకితభావంతో పనిచేస్తే చాలు. ఆనందం, అవార్డులు వాటంతట అవే వస్తాయి. అందుకు ఉదాహరణ ఈ ఇద్దరు మహిళలు. సాధారణ అంగన్‌వాడీ టీచర్లే అయినా అసాధారణంగా పనిచేశారు. అందుకే జాతీయ అవార్డులు అందుకున్నారు. ఆ ఇద్దరి గురించి...





అంకిత భావంతో...

ఆశయం మంచిదైనప్పుడు చేసే పని ఏదైనేం పట్టుదలతో పనిచేస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని నిరూపించింది ఖమ్మం జిల్లా ఏన్కూరు మండలంలోని అంగన్‌వాడీ టీచర్ బండ్ల సుశీల. తాను ఉన్నత చదువులు చదవకపోయినా, ఆమె చేసేది చిరుద్యోగమైనా, ఆమె ఆశయం మాత్రం గొప్పది. తాను ఉద్యోగంలో చేరిననాటినుండి గిరిజనతండాల్లో ఆమెచేసిన సేవలకుగాను ఏకంగా జాతీయ అవార్డు వరించింది.

ఇద్దరు కూతుర్లు ఇంజనీర్లు....

సుశీల తల్లిదండ్రులది ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామం. ఎన్కూరుకు చెందిన అమరనేని కృష్ణయ్యతో పెండ్లయ్యింది. వాళ్లకు ఇద్దరు కూతుళ్లు. పెద్ద బిడ్డ జ్యోతి, చిన్న బిడ్డ మమత. ఇద్దరూ పదోతరగతి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నారు. ప్రస్తుతం ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగాలు చేస్తున్నారు. 1992లో తిమ్మారావుపేట గ్రామంలో ఇల్లందు ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీలో టీచర్‌గా చేరింది సుశీల. అప్పటినుండి ఆమెకు అదే లోకమయ్యింది. సుశీలకు అంగన్‌వాడీలోని, గర్భిణులు, బాలింతలు, అభంశుభం తెలియని చిన్నారులే ఆమె లోకం. అందుకే వారిగురించే ఎక్కువగా ఆలోచిస్తూ ఎక్కువ సమయం వారికే కేటాయించేది.

విశ్వాసం పెంచి...

ఎన్కూరు ఏజెన్సీ ప్రాంతం. ఆ ప్రాంతంలో ఉన్నది గిరిజనులు. వారి దగ్గరకెళ్లి వారికి నచ్చే విధంగా వివరించి వారిలో చైతన్యాన్ని నింపాల్సి ఉంటుంది. తొలినాళ్లలో చాలా కష్టపడింది సుశీల. ముఖ్యంగా గొత్తికోయలకు చెందిన తెగల దగ్గరకెళ్లి పనిచేయడం అంతసులువుకాదు. వారి జీవితాల్లో మార్పులు రాబట్టాలంటే ఎంతో కష్టపడాల్సి వచ్చేది. వాళ్లకు చేరువ కావడం కోసం.. తన పిల్లలు అమెరికానుంచి పంపించిన అనేక వస్తువులను వారి పిల్లలకు కానుకలుగా అందించేది. నెమ్మదిగా వారిలో ఆమె పట్ల విశ్వాసం పెరిగేలా చేసుకున్నది. తరువాత... అంగన్‌వాడీకి పిల్లలు పెరిగారు.

జీవితంలో మరిచిపోలేను...



"నాకు అవార్డు వచ్చినట్టు కామేపల్లి ప్రాజెక్టు అధికారులకు న్యూఢిల్లీనుండి సమాచారం అందింది. అనుకోని విధంగా ఏకంగా జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో నా సంతోషానికి అవధులు లేవు. గత సోమవారం న్యూఢిల్లీలోని ప్రవాస భారతీయ కేంద్రంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర మహిళా శిశ సంక్షేమశాఖ మంత్రి మేనకాగాంధీ అందజేశారు. నేను ఎలాంటి సేవలు అందించానో వాటి గురించి స్టేజీ పై వివరించాల్సిందిగా కోరారు. అంగన్‌వాడీల్లో అందుతున్న పథకాల గురించి వివరించాను. ముఖ్యంగా నాకు అవార్డు రావడానికి కారణమైన పోషణ్ అభియాన్ కార్యక్రమ నిర్వహణ, ఆన్‌లైన్ రికార్డుల నిర్వహణ చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అందించిన సేవల గురించి వివరించాను. అలాంటి వేదికపై ప్రసంగించడం నా జీవితంలో ఎన్నటికీ మర్చిపోలేను"

– బండ్ల సుశీల

అవగాహన, శిక్షణ...

అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ప్రధాన లక్ష్యం. ప్రోటీన్లు ఉండే ఆహారాన్ని అందించాలంటే ఏమి తినాలో వివరిస్తూ వారికి అందిస్తుంటారు. కానీ ఇవి మాత్రమే చేస్తే ఆమె గొప్పతనమేముంది? వీధిబాలలను, బడిబయట ఉన్న యుక్తవయసు ఉన్న బాలికలను గుర్తించి మహిళా ప్రాంగణానికి ఉపాధి శిక్షణకు పంపించేది. వారి పర్యవేక్షణకూడా ఆమే తీసుకునేది. అంతేకాదు... ఏన్కూరులో నాలుగు బాల్యవివాహాలను అడ్డుకుని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించింది. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. సుదీర్ఘకాలంగా ఆమె చేసిన సేవలెన్నో. ప్రస్తుతం ఆమె పనిచేస్తున్న అంగన్‌వాడీలో 12మంది గర్భిణులు, 16మంది బాలింతలు, 6నెలల వయసునుండి 3సంవత్సరాల వయసు లోపు ఉన్న చిన్నారులు40మంది ఉన్నారు. గ్రామస్తుల సహకారంతో అంగన్‌వాడీ నానాటికీ బలోపేతం చేస్తున్నది సుశీల. 26 ఏండ్ల సర్వీసులో ఆమె అందిస్తున్న సేవలకు గాను.. కేంద్ర ప్రభుత్వం ఉత్తమ అంగన్‌వాడీ టీచర్‌గా జాతీయ అవార్డుఅంద జేసింది.

– వనం నాగయ్య, ఖమ్మం ప్రతినిధి

దురాచారాలపై పోరాటం

వెనుకబడిన కుగ్రామంలో పేద కుటుంబంలో పుట్టింది. బాల్యంలోనే వివాహం అయినా... పట్టుబట్టి చదువుకుంది. చిన్నతనంలోనే అంగన్‌వాడీ టీచర్‌గా ఉద్యోగం పొంది... 22 ఏండ్లుగా అసామాన్య రీతిలో సేవలందిస్తున్నది. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా జాతీయ, రాష్ట్రస్థాయిలో 10 అవార్డులు దక్కాయి. వాటితో సంతృప్తి చెందకుండా, ఏదో సాధించాలనే తపనతో నిరంతరం సమాజంలోని కుళ్లును కడిగేందుకు పోరాటం చేస్తున్న విజయలక్ష్మి గురించి...

విజయలక్ష్మిది.. వికారాబాద్ జిల్లా సిద్దులూర్. పేద కుటుంబం. దాంతో ఏడో తరగతిలోనే పెండ్లి చేశాడు తండ్రి. పెండ్లి అంటే కొత్తబట్టలొస్తాయనే అనుకుంది కానీ... బంధాలు, బాధ్యతలు తెస్తుందని ఊహించలేదు. అయినా అత్తామామలు మంచివాళ్లు కావడంతో... పెండ్లి తరువాత చదువు కొనసాగించింది. పదో తరగతి పూర్తి చేసిన తరువాత స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్‌గా పనిచేస్తున్నది. 1997లో అంగన్‌వాడీ టీచర్‌గా ఆమె రిక్రూట్ అయ్యింది. చిన్నతనంలోనే ఇద్దరు బాబులు, ఒక పాప. వాళ్లను అత్తకు అప్ప జెప్పి, ఉద్యోగం చేస్తూనే చదువుకున్నది. ఆమె ఇంటర్ చదువుతున్నప్పుడు ఊహించని పరిణామం. భర్త చనిపోయాడు. పిల్లలు ముగ్గురు పసివాళ్లు. అత్తింటి సహకారంతో.. పిల్లలను చదివిస్తూ, ఆమె చదువుకుంటూ, ఉద్యోగం చేసింది.

ఉద్యోగంతోపాటు...

ఉద్యోగాన్ని ఉద్యోగంగా మాత్రమే చేయలేదు. సమాజంలో నెలకొన్న అనేక అసమానతలపై నిరంతరం పోరాటం చేస్తున్నది. సామాజిక సేవల్లోనూ నిమగ్నం అయి ఉన్నది. నలుగురు అనాథ పిల్లలకు 'అమ్మ'గా మారింది. చిన్నతనంలోనే సంసార కలహాల కారణంగా పిల్లల తల్లిదండ్రులు ఆత్మహత్య చేసు కోవడంతో వారిని చేరదీసి సొంత ఖర్చులతో చదివిస్తున్నది. అలాగే 2005 సంవత్సరం నుంచి సిద్దులూర్ గ్రామంలో తీవ్ర త్రాగునీటి ఎద్దటి ఏర్పడింది. తనకు వారసత్వంగా వచ్చిన భూమిలో వేసిన బోరుతో దాదాపు 15 వేల రూపాయలు ఖర్చు చేసి పైపులైన్ వేసి గ్రామంలోని అన్ని వాడలకు నీరు అందించే కార్యక్రమం చేపట్టి గ్రామస్థుల మన్ననలను పొందింది. ఆమె సేవకు గుర్తింపుగా... అప్పటి తహశీల్దార్ సూరజ్‌కుమార్ జిల్లాస్థాయిలో అవార్డు ప్రదానం చేశారు. ఆరోగ్య శాఖల్లో ఈమె సేవ అపారం. చిన్నగ్రామం నుంచి 102 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించింది. వైద్య ఆరోగ్యశాఖ నుంచి రాష్ట్రస్థాయి అవార్డు దక్కించుకుంది. మహిళలకు ఉన్న సమస్యలపై రోజు వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్లతో సంప్రదింపులు జరిపి వారు అనారోగ్యానికి గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యం పొందే విధంగా చర్యలు చేపట్టింది. తల్లి పాల వారోత్సవాల్లో గర్భిణీ స్త్రీలు, బాలింతలకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించి వారి గ్రోత్ పెంచిన కారణంగా వైద్యశాఖ మరో అవార్డును ప్రదానం చేసింది.

బాల్యవివాహాలు ఆపి, కులాంతర వివాహాలు చేసి...

సిద్దులూర్ గ్రామంలో బాల్య వివాహాలు ఆపిన ఘనత ఆమెదే. దాదాపు 10 బాల్య వివాహాలను నిలుపుదల చేసి వారి మేజర్ అయిన తరువాత అధికారుల సహకారంతో వారికి పెండ్లి నిర్వహించి అందరికి ఆదర్శంగా నిలిచింది. సిద్దులూర్ గ్రామంలో గతంలో వీధి భాగవతం జరుగుతుండగా ఆరుగురు మైనర్ బాలురు ఒక మైనర్ బాలికను ఇంట్లోకి ఎత్తుకెళ్లి సామూహిక అత్యాచారం చేశారు. ఊర్లో పంచాయితీ పెట్టి జరిమానాతో సరిపెట్టాలని చూశారు గ్రామ పెద్దలు. కానీ రచ్చబండ తీర్పును ఎదిరించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి... కారణమైనవారిని జైలుకు పంపింది. అంతేకాదు గ్రామంలో కులాంతర వివాహాలను ప్రోత్సహించింది. ఇది తెలిసి విజయలక్ష్మిపై కక్ష కట్టారు ఆయా కులాల పెద్దలు. కులాంతర వివాహం చేసుకున్న ఒక జంటను గ్రామ బహిష్కరణ చేశారు. గ్రామం బహిష్కరించిన ఆ జంటకు అన్నీ ఆమై నిలిచింది. గ్రామంలో నోరుతెరచి చిన్న పిల్లలను మింగేస్తున్న బోర్లపై ఉద్యమం లేవదీసింది. రాష్ట్రవ్యాప్తంగా నోరుతెరిచిన బోరుబావిల్లో పడి ప్రాణాలు వదిలిన పిల్లల విషాదాలను చూసి తమ గ్రామంలో ఉన్న బోర్లను మూయించ డానికి పూనుకుంది. ప్రస్తుత చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సహకారంతో 42 బోరుబావులను మూయించిన కారణంగా ప్రభుత్వం ఆమెకు జిల్లాస్థాయిలో అవార్డు ప్రకటించింది. శీతాకాలంలో చలి నుంచి రక్షించడానికి వృద్ధులకు, వితంతు మహిళలకు దుపట్లు, బట్టలు ఇచ్చే కార్యక్రమం చేపట్టింది.

నిరంతర సేవ..

గ్రామంలో ప్రతి ఏడాది గ్రామదేవతల జాతర జరుగుతుంది. అందుల్లో జోగిని మహిళదే ప్రధాన భూమిక ..... చిన్న వయసు లోనే బాలికను జోగినిగా మార్చాలని గ్రామ పెత్తందారులు ప్రయత్నించడంతో వారిని ఎదిరించింది. జోగినిగా మార్చే తంతును నిలుపుదల చేసింది. అధికారులకు సమాచారం అందించి ఒక బాలికను జోగినిగా మార్చి గ్రామంలోని ఒక పెత్తం దారుకు పెండ్లి చేయాలని ప్రయత్నిస్తే దానిని ఎదురొడ్డి నిల బడింది. నాడు జోగినిగా మారవలసిన యువతి... నేడు బీ.ఈ.డి వరకు చదువుకొని టీచర్‌గా పనిచేస్తున్నది. ఇన్ని పనులు చేస్తున్నా... ఆదివారం కూడా సెలవు తీసుకోకుండా పనిచేసే అంకితభావం ఉన్న అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి. ఇన్ని సేవలకు గుర్తింపుగా కేంద్ర, రాష్ట్రస్థాయిలో 10 అవార్డులు దక్కాయామెకు.

– కోటపల్లి నర్సిములు,
వికారాబాద్‌రూరల్ రిపోర్టర్

పదోన్నతి కల్పిస్తే...



"అంగన్‌వాడీ టీచర్‌గా పిల్లలకు చదువు చెప్పడం, గర్భిణిలు, బాలింతల ఆరోగ్యం మా బాధ్యత. కానీ.. సామాజిక సేవ నా ఆసక్తి. చిన్నతనంలో మా నాన్న అందరికీ సహాయం చేస్తుండే. నాన్న నుంచే సేవ అబ్బింది. 22 ఏండ్ల నుంచి ఉద్యోగం చేస్తూనే... సామాజిక సేవలో నిమగ్నమై ఉన్నా. చాలా ఎదురుదెబ్బలు తిన్న. ఇబ్బందులు వస్తుంటయి. అలాగని ఆగిపోలేం కదా! ఇటీవల టీఎస్‌పీఎస్సీ నియామ కాల్లో సూపర్‌వైజర్ జాబ్ వస్తదేమోనని బాగా కష్టపడి చదివిన. కానీ రాలేదు. పనిచేస్తూ పోతే అవార్డులు వాటంతట అవే వస్తాయని ఇన్నేండ్ల నా జీవితం నేర్పింది. అవార్డులు ఇవ్వడం ప్రోత్సాహమే.. కానీ అవి మాత్రమే కడుపు నింపవు. డిగ్రీ చదివిన కాబట్టి... పదోన్నతి కల్పిస్తే సమాజానికి మరింత సేవ చేస్తా. టాలెంట్ ఉంది, చేయగలిగే ధైర్యం ఉంది. అవకాశం కోసం ఎదురుచూస్తున్నా"

– జానమ్మోళ్ల విజయలక్ష్మి

అవమానంగా భావించొద్దు..!



భారత దేశంలోనే దాదాపుగా గృహ హింస బాధితుల సంఖ్య 75 శాతంగా ఉన్నట్టు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే (ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్) ద్వారా వెల్లడైంది. గృహ హింసకు మూల కారాణాలు అనేకం ఉన్నాయి. వాటిలో ఆర్థికపరమైనవి, ఆరోగ్యపరమైనవి, పిల్లల పెంపకం, కుటుంబ పోషణ. ముఖ్యంగా 30 శాతం భారత దేశ మహిళలు శారీరకంగా, మానసికంగా మగవారి చేతుల్లో నలిగిపోతు న్నారు. అది ఇంట్లో కావొచ్చు, ఆఫీసు పనుల్లో కావొచ్చు. చాలామంది మహిళలు ఏదో ఒక సందర్భంలో లైగింక వేధింపులకు, లైగింక హింసకు గురైనట్టు మీటూ ఉద్యమం ద్వారా స్పష్టమైంది. అయితే ఈ సమస్య ఇప్పుడిది కాదు. కొన్ని ఏండ్ల నుండి ఉద్యోగం చేసే ప్రతి మహిళ మౌనంగా లైగింగ హింసను ఎదుర్కోంటున్నారని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. గృహ హింస, లైగింక హింసకు గురైన బాధితులు ఎక్కువగా భర్తల చేతుల్లో మోసపోయిన వారు, ఇంకా కుటుంబంలో ఇబ్బందులు ఎదుర్కోంటున్నావారు. నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ప్రకారం ముంబయి మురికివాడల్లో ఉండే మహిళలు ఎక్కువగా గృహ హింసను ఎదుర్కోంటున్నరని తెలిసింది. ఇది ఆడవారి మానసిక, శారీరక సమస్యలపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఇది కేవలం ప్రాథమిక నివేదిక ద్వారా మాత్రమే తెలిసిన విషయం. అంటే స్నేహితులు, బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు బాధితులను అంచన వేయడం జరిగింది. ఇదీలా ఉండగా... పోలీసు స్టేషన్లల్లో ఇప్పటీ వరకు నమోదైన కేసులు చాలా తక్కువ. కాస్త చదువుకున్న అమ్మాయిలూ, ఉద్యోగం చేసే మహిళలూ, కుటుంబ ప్రోత్సాహం ఉన్నవారు మాత్రమే ధైర్యంగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా ఫిర్యాదు చేసిన వారికి ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదు. అయితే న్యాయ వ్యవస్థ ఇంకా తీసుకురావాల్సిన మార్పులు, చట్టం పట్ల బాధితులకు అవగాహన కల్పించడం మహిళ సంఘాల బాధ్యత. కుటుంబ సభ్యులు, చుట్టూ పక్కలవాళ్లు అవమానంగా భావించకుండా గృహ హింస బాధితులకు అండగా ఉండాలి. అంటే ఆర్థికంగా, రాజకీయంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా చేదోడు వాదోడుగా ఉండాలి. ❄

వామ్మో.. క్యాన్సర్...!



క్యాన్సర్... పేరు వింటేనే బెదిరిపోతారు చాలామంది. ఆ భయంతోనే అది మరింతగా దాడి చేస్తుంది. అయితే శరీరంలోని ఏ భాగానికి అయినా క్యాన్సర్ రావొచ్చు. ఆయా భాగాన్ని బట్టి కూడా క్యాన్సర్ రోగుల ఆయుష్షు ఆధారపడి ఉంటుంది అంటున్నారు నేషనల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కి చెందిన నిపుణులు. ఉదాహరణకు రొమ్ము, ప్రొస్టేట్, టెస్టిక్యులర్, థైరాయిడ్, మెలనోమా, సెర్వైకల్... వంటి క్యాన్సర్లలో మొదటి రెండో దశల్లోనే ఆ వ్యాధిని గుర్తించి, చికిత్స అందిస్తే రోగి కనీసం ఐదేళ్లపాటు జీవిస్తారని వారు చెబుతున్నారు. ఆయా కంతుల సైజుని బట్టీ రోగి స్థితిని బట్టీ కొందరిలో అవి పూర్తిగా తగ్గిపోయే అవకాశం కూడా ఉంది. కాబట్టి క్యాన్సర్ అనగానే ముందే భయపడకుండా అది మిగిలిన భాగాలకు వ్యాపించకుండా వెంటనే సరైన చికిత్సను తీసుకోవాలి అంటున్నారు వైద్య నిపుణులు. ❄

కడుపు మాడ్చుకోనక్కర్లేదు...


సన్నగా కనిపించాలన్న తాపత్రయంతో కొన్ని పొరపాట్లు చేస్తుంటారు చాలా మంది అమ్మాయిలు. దీనికి కారణం డైటింగ్ పట్ల సరైన అవగాహన లేకపోవడమే అంటున్నారు నిపుణులు.

- డైటింగ్ చేయాలనుకుంటే ముందుగా ఓ సారి డాక్టర్‌ని తప్పని సంప్రదించాలి. ఎంత బరువు ఉన్నారు, ఎంత తగ్గాలి, ఏయే వ్యాయామాలు చేయాలి, ఏమేం తినాలి... ఇలా ప్రతి ఒక్కటీ డాక్టర్‌ను అడిగి తెలుసుకుంటే మంచిది. ఎందుకంటే కొందరి శరీరం కొన్ని రకాల వ్యాయామలకు తట్టుకోలేకపోవచ్చు. కొన్ని రకాల ఆహారం కొందరికి పడకపోవచ్చు. అందుకే మీ శరీర తత్వాన్ని బట్టి మీరేం చేయాలనేది డాక్టర్ సలహా మేరకు డైటింగ్ మొదలు పెడితే సరిపోతుంది.
- కొంతమందికి త్వరగా తగ్గిపోవాలన్న ఆతృత ఉంటుంది. దాంతో ఒకేసారి ఎక్కువ డైటింగ్ చేసేస్తుంటారు. అలా చేస్తే మొదటికే మోసం వస్తుంది. ఏదైనా మెల్లగా మొదలుపెట్టి పెంచుకుంటూ పోవాలి. ఒక్కసారిగా ఆహారపు అలవాట్లు మార్చేస్తే నీరసం వచ్చేస్తుంది.



- డైటింగ్ అంటే మరీ కడుపు మాడ్చేసుకోనక్కర్లేదు. పోషకాలు అధికం గా ఉన్న ఆహారాన్ని కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు తీసుకోవడమే డైటింగ్. అలాగే డైటింగ్ చేసేటప్పుడు ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకుంటే మంచిది.
- కొన్నిసార్లు డైటింగ్ చేసినా బరువు తగ్గరు. అలాంటప్పుడు డైట్ ప్లాన్ చేంజ్ చేసుకోవాలి. ఎప్పటికప్పుడు బరువు చెక్ చేసుకుంటూ ఉంటే ప్లాన్ చేంజ్ చేయాలా లేదా అన్నది తెలుస్తుంది.
- కొందరైతే ఆహారం తగ్గించి ప్రోటీన్లు, మిల్క్ షేక్స్, విటమిన్లు, ట్యాబ్‌లెట్స్ వేసుకుంటూ ఉంటారు. అలాంటి పొరపాట్లు చేయకూడదు. ఆహారాన్ని ఏ పదార్థం రీప్లేస్ చేయలేదన్న విషయాన్ని గుర్తించుకోవాలి. ❄

రంగ వల్లులు



19 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



19 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు



ఎం.హైమావతి
నాచారం
హైదరాబాద్



15 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకు

చండూరు తన్మయి
ఎ.ఎస్‌రావు నగర్




15 చుక్కల నుండి 7
వరకు వచ్చేవరకు
మధ్యచుక్క వచ్చేవరకు

సి.రాజ్యలక్ష్మి
ఎ.ఎస్ రావు నగర్
ఇ.సి.ఐ.ఎల్

18-20 మధ్య జనసేనతో లెఫ్ట్ చర్చలు

విశాఖ : రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయానికి జనసేన, సీపీఐ(ఎం), సీపీఐ పార్టీలు కలిసి కృషి చేస్తున్నాయని, ఈ నెల 18, 19, 20 తేదీల్లో మూడు పార్టీలు కలిసి చర్చించి రానున్న ఎన్నికల్లో ఎవరు ఎక్కడ పోటీచేయాలన్న విషయాన్ని నిర్ణయిస్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి పి.మధు అన్నారు. శుక్రవారం విశాఖలో సీపీఐ(ఎం) కార్యాలయం(ఎన్‌పీఆర్ భవన్)లో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను చూస్తే పలు తరగతుల ప్రజలు బీజేపీకి ఓట్లేయలేదని స్పష్టమైందన్నారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ బిల్లును హడావుడిగా తీసుకొచ్చిందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఇప్పుడు కూటములవల్ల ఉపయోగం వుండదన్నారు. దేశంలో వ్యవసాయ సంక్షోభం నెలకొందని, తక్షణం పార్లమెంట్‌లో చట్టం చేసి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర భూసేకరణ చట్టం 2013కు సవరణలు తెస్తే టీడీపీ, వైసీపీ మద్దతు పలికాయని, పవన్‌కల్యాణ్ వామపక్షాలతో కలిసి వ్యతిరేకించారని గుర్తు చేశారు. విశాఖలో ఈ నాలుగేండ్లలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని రూ.20 వేల కోట్ల భూ కుంభకోణం జరగ్గా అధికార పార్టీ దాన్ని రూ.2 వేల కోట్లకు కుదించే యత్నాలకు దిగిందని ఆరోపించారు.

ఐసీఎఫ్ఎఐలో బీఆర్క్ కోర్సు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ఉన్నత విద్యలో భాగంగా ఐదేండ్ల బీఆర్క్ కోర్సును ఐసీఎఫ్ఎఐ స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్(ఐఎస్ఆర్క్) ప్రారంభించింది. హైదరాబాద్‌లోని లక్డీకాపూల్‌లోని హోటల్ అబోడ్‌లో తెలంగాణ ఇంధన వనరుల అభివృద్ధి శాఖ స్పెషల్ సెక్రటరీ అజయ్ మిశ్రా ఈ కోర్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌సీహెచ్ఈ వైస్ ఛైర్మెన్ డాక్టర్ వి.వెంకటరమణ, ప్రొఫెసర్ డాక్టర్ డి. కవితారావు, సిహెచ్. విఠల్, ఆర్కిటెక్చర్లు యశ్వంత్ రామ్మూర్తి, కె.అశోక్, వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్క్‌షాప్, సెమినార్ నిర్వహించారు. వర్క్‌షాప్‌కు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో సీనియర్ ఇంజినీర్లు, ఆర్కిటెక్‌లు, గృహోకరణాల ఉత్పత్తి సంస్థల అధినేతలు పాల్గొన్నారు. బీఆర్క్ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు ఇంటర్ ఎంపీసీలో 50 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలని, నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఆఫ్ ఆర్కిటెక్చర్(నాటా) టెస్టులో పాసై ఉండాలని నిర్వాహకులు తెలిపారు. ఐదేండ్ల బీఆర్క్ ప్రోగ్రాం పూర్తి అయిన తర్వాత సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఈ కోర్సుకు ఎడ్యుకేషన్ లోను సదుపాయం కూడా ఉందన్నారు. పూర్తి వివరాల కోసం www.ifheindia.org/isa లో చూడాలని సూచించారు.

21 నుంచి 25 వరకు కేసీఆర్ సహస్ర చండీయాగం..

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ముఖ్యమంత్రి కేసీఆర్ మరో యాగం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఈనెల 21 నుంచి 25 వరకు ఆయన చతుర్వేద పురస్సర మహారుద్ర సహస్ర చండీయాగాన్ని నిర్వహించనున్నారు. 200 మంది రుత్వికులు ఈ యాగాన్ని నిర్వహిస్తారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడి, రైతులు సుభిక్షంగా ఉండాలని.. ఇతర అభివద్ధి, సంక్షేమ పథకాలు నిరాఘాటంగా కొనసాగాలని కాంక్షిస్తూ సీఎం ఈ యాగం నిర్వహిస్తున్నట్టు టీఆర్ఎస్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

ఉస్మానియాలో మెడికల్ ఎడ్యుకేషన్ -2019



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో ఉస్మానియా మెడికల్ ఎడ్యుకేషన్–2019 కార్యక్రమాన్ని తెలంగాణ డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఉస్మానియా ఆర్థోపెడిక్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ వై.తిమ్మారెడ్డి మాట్లాడుతూ.. ఉస్మానియా ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో 16 ఏండ్ల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశ నలుమూలల నుంచి ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు, డాక్టర్లు, పీజీ విద్యార్థులు హాజరవుతున్నారని, ఆర్థోపెడిక్ విభాగంపై అవగాహన, మెళుకులపై శిక్షణ ఇస్తారని అన్నారు. ఈ కార్యక్రమం శని, ఆదివారాల్లో కూడా సాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, వి.శేఖర్, జి.వీరారెడ్డి, రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


14న విజయవాడకు తలసాని..

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్. .ఈనెల 14న విజయవాడకు బయలుదేరి వెళ్లనున్నారు. ఆయన హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా విజయవాడకు చేరుకుంటారు. సమీపంలోని ఇబ్రహీంపట్నం నుంచి స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా ఇంద్రకీలాద్రి వరకు వెళతారు. కనక దుర్గను దర్శించుకుంటారు. అనంతరం విజయవాడ నుండి భీమవరం చేరుకుని అక్కడి ప్రసిద్ధ మావురాలమ్మ దేవాలయాన్ని సందర్శిస్తారు. రాత్రికి అక్కడే బస చేస్తారు. ఈనెల 15న తిరిగి ఆయన హైదరాబాద్‌కు బయలుదేరతారని టీఆర్ఎస్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

శివరామిరెడ్డి మృతి తీరని లోటు : సురవరం

మహాప్రస్థానంలో శివరామిరెడ్డి అంత్యక్రియలు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

శివరామిరెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని, కడప జిల్లా కమ్యూనిస్టు చరిత్రలో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. శివరామిరెడ్డి అంత్యక్రియలు హైదరాబాద్‌లోని ఫిలింనగర్‌లో గల మహాప్రస్థానంలో శుక్రవారం జరిగాయి. శివరామిరెడ్డి అంతిమయాత్ర ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి మహాప్రస్థానం వరకు ర్యాలీగా సాగింది. సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఐప్సో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.సుధాకర్, ఎఐటీయూసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, కడప జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య, వైసీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్, ప్రజాపక్షం సంపాదకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, హైదరాబాద్ నగర సమితి కార్యదర్శి ఇటి.నరసింహ, సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, అప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, డాక్టర్ రజని తదితరులు శివరామిరెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి అంజలి ఘటించారు.


యాజమాన్యాల ఆగడాలకు చెక్!

డిగ్రీ ప్రవేశాలు ఇక సులభతరం

- ఇంజినీరింగ్ తరహాలో ఫీజు చెల్లింపు
- ఆన్‌లైన్ ద్వారా కన్వీనర్ ఖాతాలో జమ చేసే అవకాశం
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమల్లోకి: దోస్త్ అధికారుల సమాలోచన

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల ఆగడాలకు వచ్చే విద్యాసంవత్సరం నుంచి చెక్ పడనుంది. రాష్ట్రంలో డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో డిగ్రీ ప్రవేశాలు కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఆన్‌లైన్‌లో ఓ విద్యార్థికి సీటు కేటాయించగానే ట్యూషన్ ఫీజు చెల్లిస్తేనే చేర్చుకుంటామని కొన్ని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు చెప్తున్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తుందని చెప్పినా విద్యార్థులను చేర్చుకోవడం లేదు. ముందు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, ఒకవేళ ఫీజు రీయింబర్స్‌మెంట్ వస్తే అప్పుడు తీసుకోవాలని విద్యార్థులకు సూచిస్తున్నాయి. ఫీజు కడితేనే సీటు లేదంటే ఉండదు అన్న ధోరణిని కొన్ని ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు అవలంబిస్తున్నాయి. ఈ ధోరణికి స్వస్తి పలకాలని దోస్త్ అధికారులు భావిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం (2019–20) నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫీజు తీసుకోవాలని అధికారులు సమాలోచన చేస్తున్నారు. ఇంకోవైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం వర్తించే విద్యార్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించని విద్యార్థులు మాత్రమే ట్యూషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇదే విధానం ప్రస్తుతం ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు వర్తిస్తున్నది. ఆ విధానాన్ని డిగ్రీ ప్రవేశాలకూ వర్తింపచేయాలని అధికారులు సమాలోచన చేస్తున్నారు. డిగ్రీ విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో అనుసరించే విధానాలపై ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలో 2016–17 విద్యాసంవత్సరం నుంచి దోస్త్ అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నారు. ఇక నుంచి డిగ్రీ ప్రవేశాలు సులభతరం చేయాలని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగానే ప్రయివేటు కాలేజీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న



ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని సమాలోచన చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ట్యూషన్ ఫీజు అడిగే పద్ధతిని మార్చాలని భావిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. విద్యార్థులు కాలేజీలకు ట్యూషన్ ఫీజు రూపంలో ఒక్క రూపాయి చెల్లించే అవకాశం ఉండదు. కేవలం విద్యార్హత ధ్రువపత్రాలను జిరాక్స్ ప్రతులను మాత్రమే కేటాయించిన కాలేజీల్లో ఇవ్వాల్సి ఉంటుంది. అవసరమైతే ఆ కాలేజీ అడ్మిషన్ ఫీజు చెల్లించి సీటును రిజర్వు చేసుకోవచ్చు. ఇదే విధానం ఇంజినీరింగ్ ప్రవేశాల్లో అమలవుతున్నది. ఫీజురీయింబర్స్‌మెంట్ సౌకర్యం ఉన్న విద్యార్థులు ప్రయివేటు కాలేజీల్లో సీటు వచ్చినా ట్యూషన్ ఫీజు చెల్లించే స్థోమత లేక కాలేజీ మార్చుకున్న ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ఇక నుంచి ఆ అవసరం ఉండబోదని అధికారులు భరోసా ఇస్తున్నారు. ఇంకోవైపు దోస్త్ తొలివిడతలో మొదటి ప్రాధాన్యత ఇచ్చిన కాలేజీల్లోనే విద్యార్థులు తప్పనిసరిగా చేరాలన్న నిబంధన ఉంది. కాలేజీ, కోర్సు నచ్చకపోయినా మరో విడతల్లో మార్చుకునేందుకు అవకాశం లేదు. ఈ నిబంధనపైనా విద్యార్థుల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత వచ్చింది. అందుకే ఈ నిబంధనను సవరించాలని దోస్త్ అధికారులు భావిస్తున్నారు. తొలివిడతలో మొదటి ప్రాధాన్యతలో సీటు వచ్చినా తర్వాతి విడతల్లో మార్చుకునేందుకు అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేస్తున్నారు.

ఫిబ్రవరి తొలివారంలో దోస్త్ సమావేశం : లింబాద్రి

ఫిబ్రవరి తొలివారంలో దోస్త్ సమావేశం నిర్వహిస్తామని దోస్త్ కన్వీనర్ ఆర్ లింబాద్రి తనను కలిసిన విలేకరులతో చెప్పారు. గతంలో విద్యార్థులు ఎదుర్కొన్న సమస్యలు మళ్లీ పునరావృతం కాకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. డిగ్రీ ప్రవేశాలు సజావుగా జరిగేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను దోస్త్ సమావేశంలో చర్చించి పరిష్కరించే దిశగా నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

11 పంచాయతీలు, 206 వార్డులు ఏకగ్రీవం

అధికారికంగా వెల్లడి

- సర్పంచ్‌కి 23,229 మంది... వార్డులకు 93,501 మంది పోటీ
- నేడు ఎస్ఈసీ జిల్లాల పర్యటన

నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

తొలి విడత ఎన్నికలు జరుగనున్న 4479 పంచాయతీల్లో 11 స్థానాల్లో సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. ఈ నెల 21న 4468 పంచాయతీలకే ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 39,822 వార్డుల్లో 206 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 39,616 వార్డులకు 93,501 మంది పోటీలో ఉన్నారు. మొదటి దశ నామినేషన్ల పరిశీలన ముగిసింది. రాష్ట్ర ఎన్నికల సంఘం శుక్రవారం అధికారిక వివరాలను వెల్లడించింది. నాగర్ కర్నూల్ జిల్లాలో 5 పంచాయతీలు, మంచిర్యాలలో 2, కరీంనగర్‌లో 2, భద్రాద్రి కొత్తగూడెంలో2 పంచాయతీలకు పోటీ లేకుండాపోయింది. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 1735 మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 1321, సంగారెడ్డిలో 1270, సూర్యాపేట జిల్లాలో 1130, ఖమ్మం జిల్లాలో 1003 మంది సర్పంచ్ పదవికి పోటీలో ఉన్నారు. కాగా, ఈ నెల 21న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. భోజన విరామం తర్వాత కౌంటింగ్ ప్రారంభమై సాయంత్రం ఫలితాలు వెల్లడించనున్నారు. ఫలితాల అనంతరం వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నుకునే అవకాశం ఉంది. వార్డు మెంబర్ల కోరం లేని చోట మరుసటి రోజు ఉపసర్పంచ్ ఎన్నిక చేపడతారు.

రెండోదశ పంచాయతీలకు తొలి రోజు 14,048 నామినేషన్లు

రెండోదశ ఎన్నికలు జరిగే 4135 పంచాయతీలకు తొలిరోజు శుక్రవారం 14,048 నామినేషన్లు వచ్చాయి. 4850 మంది సర్పంచ్‌కి, 9198 మంది వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణకు ఈ నెల 13 చివరితేదీ. అభ్యర్థులను 14న ప్రకటిస్తారు. రెండోదశ పోలింగ్ 25న జరగనుంది.

నేడు మూడు జిల్లాల్లో ఎస్ఈసీ పర్యటన

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ వి. నాగిరెడ్డి శనివారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. సిద్దిపేట, సిరిసిల్ల, జగిత్యాలలో ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తారు. తొలిదశ ఎన్నికలు జరిగే పంచాయతీలను జిల్లా అధికారులతో కలిసి ఆయన సందర్శిస్తారు.

రాం మందిర నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

- బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో అమిత్ షా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: అయోధ్యలో రాం మందిర నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉన్నదని బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. రామ జన్మభూమిలోనే రామాలయాన్ని నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీలోని రాంలీలా మైదానంలో జరుగుతున్న బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామ మందిర నిర్మాణానికి బీజేపీ ప్రయత్నిస్తుంటే కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. ఈ అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నందువల్ల విచారణను వేగవంతం చేసే విధంగా ప్రయత్నిస్తామని చెప్పారు. జాతీయ పౌరసత్వ బిల్లుపై కాంగ్రెస్ అనవరసర రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని ఎదుర్కొవడానికి సిద్ధమవుతున్న కూటములపై అమిత్ షా విమర్శలు చేశారు. బిన్న సిద్ధాంతాలు కలిగిన పార్టీలు ఏకమవుతున్నాయని అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో విజయం సాధించేలా కృషి చేయాలని బీజేపీ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. సమావేశానికి ప్రధాని మోడీతో పాటు కేంద్రమంత్రులు అరుణ్ జైట్లీ, సుష్మా స్వరాజ్, నితిన్ గడ్కరీ, సీనియర్ నేత ఎల్ కె అద్వానీ, బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు హాజరయ్యారు.

353 మంది పిల్లల్ని కాపాడారు

వారం రోజుల ఆపరేషన్ ముస్కాన్

- దర్పణ్ ద్వారా తల్లి ఒడికి చేరిన వారణాసి బాలుడు

నవతెలంగాణ– ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సాగుతున్న ఆపరేషన్ ముస్కాన్ ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని రాష్ట్ర శాంతి భద్రతల విభాగం ఐజీ, ముస్కాన్, స్మైల్ ఆపరేషన్‌ల ఇన్‌చార్జి స్వాతి లక్రా శుక్రవారం తెలిపారు. ఈ ఆపరేషన్ ద్వారా ఇప్పటి వరకు 353 మంది బాలలను రక్షించామని ఆమె తెలిపారు. ఇందులో వీధి బాలలతో పాటు ఇంటి నుంచి తప్పిపోయిన పిల్లలు కూడా ఉన్నారని వివరించారు. ముఖ్యంగా మంచిర్యాల్ రైల్వే స్టేషన్‌లో సదానంద్ అనే బాలుడిని తమ కస్టడీలోకి తీసుకున్న ఆపరేషన్ ముస్కాన్ టీమ్ విచారించగా సరైన వివరాలు ఇవ్వలేక పోయాడని దాంతో బాలుడి ఫోటో ఇతర వివరాలను దర్పణ్‌యాప్‌లో పొందుపరచగా ఆ బాలుడు వారణాసి వాసిగా తేలిందన్నారు. 2016 తప్పిపోయిన ఈ బాలుడి గురించి వారణాసి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఉందన్నారు. దర్పణ్ యాప్‌కారణంగా దాదాపు మూడేండ్లుగా తల్లి దండ్రులకు దూరమైన ఈ బాలుడు ఆపరేషన్ ముస్కాన్ ద్వారా వారి ఒడికి చేరగలిగాడని స్వాతి లక్రా తెలిపారు. కాగా సాగుతున్న ముస్కాన్ ఆపరేషన్‌లో 8 మంది అదనపు ఎస్పీలు, 8 మంది డీఎస్పీలు, 18 మంది ఇన్‌స్పెక్టర్‌లు, 90 మంది సబ్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొంటున్నారని ఆమె వివరించారు. తప్పిపోయిన పిల్లలు మొదలుకుని అత్యంత ప్రమాదకర పరిశ్రమలు, కార్ఖానాలలో ఎవరైనా పిల్లలు పని చేస్తున్నట్టు తెలిస్తే ఆ సమాచారాన్ని తమకు అందచేయాని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాజ్యాంగ రక్షణ..
సామాజిక క్షేమాన్ని కాపాడండి

- దేశ వ్యాప్తంగా సభలు.. సమావేశాలు: జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

రాజ్యాంగాన్ని రక్షించండి.. సామాజిక న్యాయాన్ని కాపాడండీ అనే నినాదంతో దేశ వాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అగ్రవర్ణాలకు రిజర్వేషన్లను కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని దుర్వినియోగ నిర్వీర్యం చేయడమే కాకుండా రాజకీయ అధికారాన్ని దుర్వినియోగ పర్చిందని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల విషయంలో బీసీ బిల్లును పరిగణనలోకి తీసుకోకుండా ప్రధాని నరేంద్రమోడీ 60 కోట్ల మంది బీసీలను అవమానపర్చారని మండి పడ్డారు. దీనికి నిరసనగా 12న నల్లగొండ, 13న విజయవాడ, 20న వరంగల్, 22న ఢిల్లీ, 24న నిజామాబాద్, 27న ఒరిస్సాలో 29న ఆదిలాబాద్‌లో బహిరంగసభలు నిర్వహిస్తామని చెప్పారు. దాంతో పాటే రాష్ట్రంలోని ప్రతి జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని జిల్లా కేంద్రాల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 7వ తేదీన ఢిల్లీలో నిర్వహించే బహిరంగసభకు ఏఐడీఎంకే నేతలు కనిమోళి, సమాజ్‌వాది పార్టీ నాయకులు ములయాంసింగ్, రాష్ట్రీయ జనతాదళ్ నాయకులు, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తులు పాల్గొంటారని చెప్పారు. బీసీల ఓట్లతో గెలుపొందిన నేతలు బీసీ డిమాండ్లను పక్కన పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు.

హస్తినకు చేరిన పంచాయితీ..!

సస్పెన్షన్‌పై అధిష్టానానికి సర్వే ఫిర్యాదు

- అనుచిత వ్యాఖ్యలపై కుంతియా నివేదిక

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

కేంద్ర మాజీ మంత్రి, ఏఐసీసీ సభ్యులు సర్వే సత్యనారాయణ సస్పెన్షన్ పంచాయితీ ఢిల్లీకి చేరిందా? పార్టీ నేతలను ప్రశ్నించినందుకు ఎలాంటి విచారణ చేయకుండానే ఆయన్ను సస్పెండ్ చేసే అధికారం రాష్ట్ర క్రమశిక్షణా సంఘానికి ఉందా? సర్వేపై ఎవరు ఫిర్యాదు చేయకపోయినా సుమోటోగా తీసుకుని పార్టీ నుంచి సస్పెండ్ చేయవచ్చా? గతంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రామచంద్రకుంతియాపై, టీపీసీసీ అధ్యక్షులు ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు? ఇత్యాధి ప్రశ్నలు కాంగ్రెస్‌వర్గాలను తొలుస్తున్నాయి. సర్వే సస్పెన్షన్ అంశం టీపీసీసీ మెడకు చుట్టుకునేలా ఉందని పార్టీ నేతలు చెబుతున్నారు. పార్లమెంటు నియోజకవర్గాల వారీ సమీక్షల సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన కిష్కింధకాండ ఏఐసీసీకి చేరడంతో అధిష్టానం టీపీసీసీపై ఆగ్రహంతో ఉందని తెలిసింది.

మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజవర్గం సమీక్షా సమావేశాల సందర్భంగా జరిగిన తాజా వివాదంపై అధిష్టానం సీరియస్‌గా ఉన్నట్టు సమాచారం. సర్వే వ్యవహారంలో పీసీసీ తొందరపడి నిర్ణయం తీసుకున్నట్టు కొంత మంది చెబుతుండగా, మరికొంత మంది నేతలు స్వాగతిస్తున్నారు. సర్వే సస్పెన్షన్‌ను మాజీ ఎంపీ మధుయాష్కీ బహిరంగంగానే వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో సర్వే సత్యనారాయణ తనపై వేటు చేయడాన్ని నిరసిస్తూ ఆయన ఏకంగా ఏఐసీసీ క్రమశిక్షణా సంఘ ఛైర్మెన్ ఏకే ఆంటోనీ కలిసి పరిస్థితి వివరించారు. తాను ఏఐసీసీ సభ్యుడిగా ఉన్నప్పటికి తనను ఏఐసీసీ అనుమతి లేకుండా పీసీసీ ఎలా సస్పెండ్ చేస్తుందని ఆంటోని దష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది.

ఈ క్రమంలో అగ్నికి ఆజ్యం పోసినట్టుగా ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ ఓటమితోపాటు తాజాగా పార్టీలో వివాదాలు టీపీసీసీ మెడకు చుట్టుకుంటున్నాయి. శాసనసభ ఎన్నికల తర్వాత హస్తం పార్టీ ఓటమికి టీపీసీసీ బాధ్యత తీసుకొని తన పదవికి రాజీనామా చేయాలని పార్టీ నేతల్లో డిమాండ్ పెరుగుతున్నది. వాటన్నింటిని తప్పించుకోవడానికి ఆయన సమీక్షలు కూడా ఆలస్యంగా ప్రారంభించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ ఓటమి నేపథ్యంలో రాష్ట్ర వ్యవహారాల బాధ్యతల నుంచి తనను తప్పించాలని కోరుతూ ఆయన అధిష్టానానికి లేఖ రాసినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పీసీసీ పదవి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వైదొలగాని పార్టీలో చర్చ జరుగుతున్నది. ఈ అంశంపై బహిరంగంగా డిమాండ్ చేయకపోయినా...పార్టీ అంతర్గతంగా గుసగుసలు వినిపిస్తున్నాయి.

కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లపై బుర్రా సమీక్ష

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

జనవరి 13 నుంచి 15 వరకు సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో జరిగే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ మరియు స్వీట్ ఫెస్టివల్ నిర్వహణ ఏర్పాట్లపై తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. కైట్, స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొనేందుకు వచ్చే సందర్శకుల వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, స్వీట్స్ స్టాల్స్, కైట్ ఫ్లేయర్స్, సాంస్కతిక కార్యక్రమాల నిర్వహణ, ఫుడ్ కోర్టుల ఏర్పాటు, మంచినీటి సరఫరాతో పాటు టాయిలెట్స్ నిర్మాణాలు, వ్యర్థ పదార్థాల తొలగింపుపై అధికారులతో చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో పర్యాటక శాఖ ఇన్‌చార్జి కమిషనర్ దినకర్‌బాబు, పర్యాటక అభివద్ధి సంస్థ ఛైర్మెన్ మనోహర్ రావు, సాంస్కతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికష్ణ, పర్యాటక శాఖ అధికారులు మహేష్, శశిధర్, నార్త్ జోన్ ట్రాఫిక్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మెన్‌గా విజయశాంతి!

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

రానున్న పార్లమెంటు ఎన్నికలపై ఏఐసీసీ దృష్టి సారించింది. ఎన్నికల నిర్వహణ కోసం టీపీసీసీ ఐదు కమిటీలు నియమించాలన్న అధిష్టానం సూచనమేరకు టీపీసీసీ కసరత్తు ప్రారంభించింది. పార్లమెంటు ఎన్నికల కోసం టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మెన్‌గా విజయశాంతి ఎంపిక చేసే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ముందస్తు ఎన్నికల్లో ప్రచార కమిటీ ఛైర్మెన్‌గా మల్లు భట్టి విక్రమార్క, స్టార్ క్యాంపెయినర్‌గా విజయశాంతి వ్యవహరించిన విషయం తెలిసిందే...

నిన్న అయోధ్య.. నేడు శబరిమల

ఇదే బీజేపీ రాజకీయ వ్యూహం
ఆడోళ్లను గుడిలోకి రానియొద్దని ఎక్కడున్నది?

- కట్టుబొట్టు మారుతున్నా మూఢ విశ్వాసాలేంటి?: 'అయ్యప్ప గుడిలోకి స్త్రీలకు ప్రవేశంపై సుప్రీంకోర్టు తీర్పు -మనువాదంపై చర్చ'లో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కంచ ఐలయ్య

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

అయోధ్య అంశం అవుట్‌డేటెడ్ కావడంతో శబరిమలపై రచ్చచేసి వచ్చే ఎన్నికల్లో లబ్దిపొందాలని బీజేపీ కుట్ర పన్నుతున్నదని, అందులో భాగంగానే సుప్రీంకోర్టు తీర్పునకు తిలోదకాలిస్తూ కేరళలో అల్లర్లు సృష్టిస్తున్నారని పలువురు వక్తలు విమర్శించారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సామాజిక ప్రజాసంఘాల ఐక్యవేదిక(టీమాస్) ఆధ్వర్యంలో 'అయ్యప్ప గుడిలోకి స్త్రీలకు ప్రవేశంపై సుప్రీం కోర్టు తీర్పు–మనువాదంపై చర్చ' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల హైమావతి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. టీమాస్ ఛైర్మెన్ కంచ ఐలయ్య మాట్లాడుతూ..ఆడోళ్లను గుళ్లలోకి రానియొద్దని భగవద్గీత, రామాయణం గ్రంథాల్లో ఎక్కడా రాయలేదన్నారు. కట్టు, బొట్టు, ఆహారపు అలవాట్లు మారుతున్న ఈ దశలో ఇంకా మూఢ విశ్వాసాలేంటి? అని ప్రశ్నించారు. శబరిమల సమస్య దేశ మొత్తం మీద కొత్త భావ సంఘర్షణను, హక్కుల సమస్యను తెరపైకి తెచ్చిందన్నారు. 1794 వరకు అయ్యప్ప దేవాలయం పూర్తిగా ఆదివాసీల ఆధీనంలో ఉండేదని, ఆ తర్వాత ట్రావన్‌కోర్ సంస్థానం పరిధిలోకి వచ్చిందని వివరించారు. అయ్యప్పస్వామి దేవాలయ డాక్యుమెంట్లలో ఆడవాళ్లు కూడా గుడిలోకి ప్రయివేశించేవారని ఉందని, ఇప్పుడు కొత్తగా ఆర్ఎస్ఎస్ వాళ్లు కపట భక్తితో అయ్యప్పపై వివాదాన్ని సృష్టిస్తున్నారని వివరించారు. కోర్టులు, చట్టాలు, రాజ్యాంగం పట్ల మనువాదులకు గౌరవం లేదన్నారు. కేరళలో నారాయణ గురు, అయ్యంకాళి తర్వాత ప్రస్తుత ముఖ్యమంత్రి పినరయి విజయన్ గొప్ప సంస్కరణలను అమలు చేస్తున్నారని కొనియాడారు. సామాజిక వేత్త రేఖ మాట్లాడుతూ.. త్రిపుల్ తలాక్ విషయంలో సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించిన బీజేపీ...శబరిమల గుడిలోకి మహిళలకు ప్రవేశం కల్పించడంపై ఎందుకు వివాదం చేస్తున్నారని ప్రశ్నించారు. కేరళలో విపత్తులు వచ్చినప్పుడు ఏ దేవుడూ రక్షించలేదని, అక్కడి ప్రభుత్వం చొరవ, ప్రజల చైతన్యంతో కోలుకున్నదని గుర్తుచేశారు. బహుజన రచయిత కాలువ మల్లయ్య మాట్లాడుతూ..నలుపు దుస్తువులు ధరించే దేవుళ్లందరూ ద్రావిడ దేవుళ్లని, అయ్యప్ప బ్రాహ్మణీకరించనంత వరకు ఆ గుడిలోకి మహిళలకు అవకాశం ఉండేదని గుర్తుచేశారు. సంస్కరణలను స్వీకరించిన బౌద్ధం ప్రపంచవ్యాప్తంగా పరిఢవిల్లుతుండగా...సమానత్వం, స్వేచ్ఛ, సంస్కరణలకు అవకాశం లేకనే హిందూ మతం విస్తరించట్లేదని వివరించారు. టీమాస్ రాష్ట్ర కన్వీనర్ జాన్‌వెస్లీ మాట్లాడుతూ..దేశవ్యాప్తంగా బీజేపీపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పక్కదారి పట్టించి వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులు కేరళలో అల్లర్లు సృష్టిస్తున్నారని విమర్శించారు. అందులో భాగంగానే ప్రజాస్వామ్య, అభ్యుదయ వాదులపై భౌతిక దాడులకు దిగుతున్నారని, అసభ్య సందేశాలు పంపుతూ బెదిరింపులకు గురిచేస్తున్నారని అన్నారు.

అభ్యుదయ, ప్రజాస్వామ్య, లౌకికవాదులు, మేధావులు, సామాజికవేత్తలు, ప్రజలంతా కలిసి బీజేపీ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్‌కే ప్రధాన కార్యదర్శి కె.హిమబిందు, చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎంవి.రమణ, తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్, ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్, మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, ప్రముఖ కవి పిఎస్ఎన్ మూర్తి, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, టీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు విజయ్‌కుమార్, కోటరమేష్, ఎం.శోభన్‌నాయక్, అడ్వకేట్ ప్రభాకర్, కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ద్వైపాక్షిక సహకారం పెంచుకుందాం

చైనా, ఉత్తరకొరియా అంగీకారం

- ఏడాదిలో నాలుగుసార్లు చైనాలో పర్యటించిన కిమ్



సియోల్ : ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ చైనాలో పర్యటిస్తున్న నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో చర్చలు జరిపిన తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, కిమ్‌ల మధ్య కీలకమైన ఏకాభిప్రాయాలు కుదిరాయి. ఏడాది కాలంలో కిమ్ చైనాలో పర్యటించడం ఇది నాల్గవసారి. కిమ్ తరచుగా చేస్తున్న పర్యటనలతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు బాగా పెరుగుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను నూతన శకంలోకి తీసుకెళ్లేందుకు సంయుక్తంగా కృషి చేసేందుకు ఉభయ పక్షాలు అంగీకరించాయి. కొరియా ద్వీపకల్ప సమస్యకు రాజకీయ పరిష్కార క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు అంగీకరించాయి. ఈ ప్రాంతం, మొత్తంగా ప్రపంచ శాంతి సుస్థిరతలకు, అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించాయి. ఇరు దేశాలు చేసిన సంఘటిత కృషితో గతేడాది చారిత్రక నూతన అధ్యాయం ఆరంభమైందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. ఇరు దేశాల సంబంధాలు భవిష్యత్‌లో మరింత అభివృద్ధి చెందేందుకు కిమ్‌తో కలిసి పనిచేసేందుకు సుముఖంగా ఉన్నట్టు తెలిపారు.

ఉన్నత స్థాయి మార్పిడులు కొనసాగించడం, వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేయడం, మిత్రపూర్వక మార్పిడులను పెంపొందించడం, దీర్ఘకాల ప్రాతిపదికన సహకారాన్ని పెంచుకోవడం, మొత్తంగా ఇరు దేశాల సంబంధాలు ఆరోగ్యకరమైన రీతిలో అబివృద్ధి చెందేందుకు చర్యలు తీసుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

హెచ్-1బీ వీసాలో మార్పులు : ట్రంప్



వాషింగ్టన్: హెచ్-1బీ వీసాలో మార్పులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. వీసా విధానంలో మార్పులు తీసుకురావడం వల్ల అమెరికా పౌరసత్వం పొందేందుకు ఇది దోహదపడుతుందని ఆయన అన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్1బీ వీసాల జారీ అంశాన్ని ప్రస్తావించారు. అత్యంత నైపుణ్యం ఉన్న వారికి మాత్రమే ఈ వీసాలు అందేలా చూస్తామని అన్నారు. ఇదే విషయాన్ని ట్విటర్ ద్వారా ట్రంప్ ప్రకటించారు. 'హెచ్ 1బీ వీసా విధానంలో త్వరలో మార్పులు చేపడతాం. దీని వల్ల వీసా విధానంలో సరళత్వం, కచ్చితత్వంతో పాటు పౌరసత్వం లభించే అవకాశం ఉంటుంది. కెరీర్ కోసం అమెరికాను ఎంచుకునే ప్రతిభ, అత్యంత నైపుణ్యం ఉన్న ప్రజలను మేం ప్రోత్సహిస్తాం' అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాల్లోని కంపెనీల్లో విదేశీయులు ఉద్యోగాలు చేసుకునేందుకు హెచ్-1బీ వీసా ఉపయోగపడుతుంది. ముఖ్యంగా భారతీయులు ఈ వీసాలను ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. ప్రస్తుతం యూఎస్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం ఏటా 65వేల హెచ్-1బీ వీసాలు జారీ చేయాలి.

సౌదీ యువతికి కెనడా ఆశ్రయం

ఒట్టావా : సౌదీ యువతి రహఫ్ మొహ్మద్ అల్-ఖునున్(18)కు ఆశ్రయం కల్పించనున్నట్టు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో తెలిపారు. మహిళల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మానవతా దృక్పథంతో ఖునున్‌కు ఆశ్రయం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అంతేగాకుండా, ఐరాస అభ్యర్థనను కూడా తాము పరిగణనలోకి తీసుకున్నామని అన్నారు. గతవారం బ్యాంకాక్ ఇమ్మిగ్రేషన్ అధికారులు కువైట్ నుంచి ఆస్ట్రేలియాకు పారిపోయేందుకు ప్రయత్నించిన ఖునున్‌ను నిర్బంధించిన సంగతి తెలిసిందే. ఆమెను తల్లిదండ్రులకు అప్పగించేందుకు అధికారులు ప్రయత్నించారు. తనకు ఆశ్రయం కల్పించాలంటూ ఖునున్ సోషల్ మీడియా ద్వారా ఐరాసను అభ్యర్థించింది. తనను సౌదీకి పంపినట్టయితే తల్లిదండ్రులు చంపేస్తారంటూ ఆందోళన వ్యక్తం చేసింది.

మదురోకే మద్దతు : వెనిజులా సైన్యం ప్రకటన




కారకస్ : వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో పట్ల విధేయంగా ఉంటామని సాయుధ బలగాలు ప్రకటించాయి. 'హృదయపూర్వకంగా మీరు నా పట్ల చూపుతున్న విశ్వాసం, క్రమశిక్షణ, వినయవిధేయతలను స్వీకరిస్తున్నాను.' అంటూ మదురో 4వేల మందికి పైగా గల సైనికులను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కారకస్‌లోని టియనా ఫోర్ట్‌లో బలివారియన్ మిలటరీ యూనివర్శిటీ ఆఫ్ వెనిజులా (యుఎంబివి)లో జరిగిన కార్యక్రమంలో మదురో మాట్లాడారు. మితవాద కార్యకర్తల నుంచి సైనికులు ఎన్నో దాడులు ఎదుర్కొన్నారని అన్నారు. మదురో వెంట అంతర్జాతీయ ప్రతినిధులు, ప్రభుత్వాధినేతలు వున్నారు. మదురోని కమాండర్ ఇన్ చీఫ్‌గా గుర్తిస్తున్నట్టు సైనిక అధిష్టానం ప్రకటించింది. సుప్రీం కమాండర్ హ్యూగో చావెజ్ వెనిజులాలో సైనిక విప్లవాన్ని తీసుకువచ్చారు. ఆ విప్లవం అంతటితో ఆగిపోరాదని మదురో వ్యాఖ్యానించారు. వెనిజులాలో సైనిక విప్లవాన్ని మరింత ఉధృతంగా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. వచ్చే ఆరేండ్లలో సైనిక సామర్థ్యాన్ని పెంచుతామని మదురో ప్రతిన చేశారు. దేశీయ సార్వభౌమాధికారాన్ని మరింత పరిరక్షించుకునేందుకు గానూ ఆయుధ వ్యవస్థను ఆధునీకరిస్తామని ప్రకటించారు. సైమన్ బలీవర్, హ్యూగో ఛావెజ్‌లు మంచి దార్శనికులని పేర్కొన్నారు. వారు భవిష్యత్‌ను చూశారని, గతంలోనే ఉండిపోలేదని, ప్రస్తుతమున్న సమస్యలు, కష్టాలతోనే ఆగిపోలేదని వాటన్నింటినీ అధిగమించి ఆశాజనకవమైన భవితవ్యాన్ని ఆశించారని మదురో పేర్కొన్నారు. వెనిజులా ప్రజలు తమ అధ్యక్షుడిగా మదురో కొనసాగాలని ఎన్నుకున్నారని, సాయుధ బలగాలు వారి ఆదేశాలను ఎలాంటి సందేహం లేకుండా ఆమోదించాయని రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో లోపెజ్ ప్రకటించారు. వెనిజులా స్వాతంత్ర్య సమర యోధుల్లో ఒకరైన రాఫెల్ ఆర్డనెటా కత్తి నమూనాను లోపెజ్, మదురోకి బహుమతిగా అందచేశారు. విదేశీ ప్రభుత్వ జోక్యం లేకుండా వెనిజులన్లే దేశాన్ని పాలించుకుంటారని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పారని మదురో పేర్కొన్నారు.

గగన్‌యాన్ ద్వారా అంతరిక్షయానం

మహిళా వ్యోమగామికి కూడా అవకాశం

- 2021 డిసెంబర్ నాటికి ఇస్రో మానవసహిత మిషన్ : ఇస్రో చైర్మెన్ శివన్



న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) గగన్‌యాన్ అనే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు చేపట్టనుంది. తద్వారా 2021 డిసెంబరు నాటికి భారత్ వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపించాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్టు ఇస్రో చైర్మన్ కె.శివన్ శుక్రవారం వెల్లడించారు. గగన్‌యాన్ ద్వారా వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపినట్టయితే స్వతంత్రంగా మనుషులను అంతరిక్షంలోకి పంపిన నాలుగో దేశంగా భారత్ ఘనత దక్కించుకోనుంది. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రధాని మోడీ గగన్‌యాన్ ప్రాజెక్టుపై ప్రకటన చేశారు. 2022నాటికి వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు. అయితే, ఇస్రో చైర్మెన్ మాత్రం 2021 డిసెంబరు నాటికే పంపాలని లక్ష్యం నిర్దేశించుకున్నట్టు తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టు ద్వారా పంపే వ్యోమగాములకు తొలుత భారత్‌లో, తర్వాత రష్యాలో శిక్షణ ఇప్పిస్తాము. ఈ బృందంలో ఓ మహిళ కూడా ఉంటారని శివన్ తెలిపారు. గగన్‌యాన్ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించింది. ముగ్గురు వ్యోమగాములను వారం పాటు అంతరిక్షంలోకి పంపనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం రష్యా, ఫ్రాన్స్‌లతో భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో చంద్రుడిపైకి 'చంద్రయాన్-2'ను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శివన్ వెల్లడించారు. ఇస్రో తొలుత 'చంద్రయాన్-2'ను జనవరి నుంచి ఫిబ్రవరి 16 మధ్యలో చేపడతామని తెలిపింది. అయితే కొన్ని పరీక్షలు పూర్తికాకపోవడం వల్ల తేదీని మార్చారు. మార్చి 25 నుంచి ఏప్రిల్ చివరి నాటికి ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతున్నామని శివన్ తెలిపారు.

అమెరికాలో నిరసన ప్రదర్శనలు



- షట్‌డౌన్ ఎత్తివేయాలంటూ డిమాండ్

వాషింగ్టన్ : ట్రంప్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న పాక్షిక ఆర్థిక ప్రతిష్టంభనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఫెడరల్ ఉద్యోగులు ప్రదర్శనలు నిర్వహించారు. ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన నిధులు లేక గత 20 రోజులుగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మా వేతనాలు మాకు కావాలి. ఈ ఆర్థిక ప్రతిష్టంభనను నిలువరించండి, మాకు పని కావాలి' అని రాసి ఉన్న ప్లకార్డులు చేబూని వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్ వెలుపల వందలాదిమంది ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. కేవలం ఈ రాజకీయాల భయంతో వేలాదిమంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను వదులుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఇది సిగ్గుచేటైన విషయమని అతి పెద్ద యూనియన్ ఎఎఫ్ఎల్సిఐఓ అధ్యక్షుడు రిచర్డ్ ట్రంకా వ్యాఖ్యానించారు. సామాన్యుల గురించి ట్రంప్ ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని 62ఏండ్ల శాస్త్రవేత్త ఎలైనే సురినావో వ్యాఖ్యానించారు. ఎంత కాలం ఈ అనిశ్చితి కొనసాగుతుందో తెలియడం లేదని, దాంతో అహారం, ఇతర ముఖ్య అవసరాలకు ఎంత మొత్తంలో జాగ్రత్తపడాలనేది కూడా గందరగోళంగా వుందని మరో ఉద్యోగి మాథ్యూ క్రిటన్ వ్యాఖ్యానించారు. పెన్సిల్వేనియా, ఉటా,డెన్వర్ వంటి పలు నగరాల్లో ప్రదర్శనలు జరిగాయి.

దావోస్ పర్యటన రద్దు చేసుకున్న ట్రంప్



ఆర్థిక ప్రతిష్టంభన నేపథ్యంలో నిరసనలు ఎదుర్కొనాల్సి వస్తుందనే భయంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దావోస్ పర్యటన రద్దు చేసుకున్నారు. కాగా, ఈ నెల 22 నుండి 25వరకు దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు జరగనున్నాయి. అయితే ఇప్పటికే 20రోజులుగా ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణకు నిధుల కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో దావోస్ సమావేశాల వరకు కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందా లేదా అనేది తెలియరావడం లేదు. అమెరికా మెక్సికో సరిహద్దులో నిర్మించ తలపెట్టిన గోడ నిర్మాణానికి నిధుల కోసం ట్రంప్, డెమోక్రాట్ల మధ్య ఘర్షణ జరుగుతోంది. సరిహద్దు భద్రతపై డెమోక్రాట్ల మొండితనం వల్ల దావోస్ ఫర్యటనను తాను రదు చేసుకుంటున్నట్టు ట్రంప్ ట్విట్టర్‌లో తెలిపారు.

క్యూబాలో బస్సు ప్రమాదం

- ఏడుగురు మృతి, 33 మందికి గాయాలు



హవానా : క్యూబాలో ఘోర బస్సు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు విదేశీయులు సహా ఏడుగురు మృతి చెందారు. 33 మంది గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది. బరాకో నుంచి క్యూబా రాజధాని హవానకు బస్సు బయల్దేరిన సమయంలో ప్రమాదానికి గురైంది. గ్వాటనమో ప్రాంతంలో ప్రమాదం జరిగింది. డ్రైవర్ నిర్లక్ష్యం, అతి వేగం కారణంగా బస్సు ప్రమాదం జరిగినట్టు అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న ప్రత్యేక బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ప్రమాదానికి గురైన సమయంలో బస్సులో 40 మంది ప్రయాణీకులు ఉన్నట్టు సమాచారం.

సర్పంచ్‌గిరికి పోటాపోటీ

ఏకగ్రీవానికి 'పంచాయతీ వేలం'

- కరీంనగర్‌లో 10వేల మందికి పైనే పోటీ?
- 580 జనరల్ స్థానాల్లో కులానికో నామినేషన్!
- 'గులాబీ' దళం నుంచే నామినేషన్ల జోరు
- పంచాయతీ నుంచే పట్టు కోసం
- ఇలా శాసనసభకెళ్లిన వారిలో 12మంది జిల్లా ప్రముఖులు..

నవతెలంగాణ- కరీంనగర్ ప్రతినిధి

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పంచాయతీలు:	1210
వార్డులు	: 11,132
మొదటి విడత పంచాయతీలు	: 414
రెండో విడత	: 389
చివరి విడత	: 407



సరిగ్గా ఐదేండ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలోనే అత్యధికంగా కరీంనగర్ జిల్లాలో 1207 స్థానాలకు ఏకంగా 9,363 మంది పోటీపడ్డారు. ఈ ఎన్నికల్లోనూ అదే ఒరవడి కనిపించే వాతావరణం కనిపిస్తోంది. ప్రస్తుత 1210 పంచాయతీల్లో పది వేల మందికి పైనే అభ్యర్థులు పోటీపడే అవకాశం లేకపోలేదు. జనరల్‌కు కేటాయించిన 580 స్థానాల్లో సామాజిక తరగతికో నామినేషన్ పడినా ఆశ్చర్య పోనక్కర్లేదు. శంకరపట్నం మండలం మొలంగూర్ నుంచి నామినేషన్ మొదటిరోజే 13 మంది పోటీకి సిద్ధమయ్యారు. మరోవైపు పంచాయతీలు ఏకగ్రీవం చేసి ఎలాగైనా సర్పంచ్‌గిరి చేయాలన్న ఆశతో రూ.లక్షలు ముట్టచెబుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల జోరు ఊపందుకుంటోంది. తొలి విడత నామినేషన్ల ఘట్టంలో ఊరూర ఆశావహుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఏకగ్రీవాల కోసం గ్రామాభివృద్ధి పేరుతో రూ.లక్షలు ఇచ్చేందుకు సిద్ధమై న అభ్యర్థులు పోటీదారులతో బేరసారాలకు రంగంలో దిగారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలను సింహభాగం కైవసం చేసుకున్న 'గులాబీ' పార్టీ నుంచి పల్లెపీఠాన్ని కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ నాయకులే అత్యధికంగా పోటీ పడుతున్నారు.

జనరల్ స్థానాల్లోనైతే ఒక్కో గ్రామంలో వారి సంఖ్య 10వరకు ఉంటోంది. ఈనెల 7న తొలిరోజు నామినేషన్ల సందర్భంగా శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామంలో 13మంది పోటీకి సిద్ధపడటమే అందుకు నిదర్శనం. ఈనెల 21 మొదటిదఫా ఎన్నికలు జరిగే 22 మండలాలకు సంబంధించి 414 పంచాయతీలకు 3513 నామినేషన్లు వచ్చాయి.



వెలిచాల గ్రామపంచాయతీ భవనం

బరిలో నిలబడటమా.. భయపెట్టడమా!

ఉన్న ఊరిలో తమ పలుకుబడిని చూపించేందుకు.. రాజకీయంగా పట్టు పెంచుకునేందుకు ఇదో అవకాశమనే ధోరణి ఉమ్మడి జిల్లాలో కనిపిస్తోంది. పోటీలో ఉంటామనే భరోసాను పెంచుకుంటే మున్ముందు అందే అవకాశాలకు ఇది ఒక మెట్టు అనే భావన గ్రామస్థాయి నాయకుల్లో తీవ్రంగా పెరుగుతోంది. గతంలో పోటీ చేసిన వారితోపాటు ఎక్కువ సంఖ్యలో యువత పోటీకి సిద్ధమవుతోంది. దీంతో ఒక్కో గ్రామంలో ఐదారుగురికిపైనే అభ్యర్థులుగా మారే అవకాశాలు ఉంటున్నాయి. జనరల్ స్థానాల్లోనైతే ఆ సంఖ్య 10కి మంచి ఉంటోంది. ముఖ్యంగా మేజర్ పంచాయతీలు సహా ఆర్థికంగా వనరులు ఎక్కువగా ఉన్న పంచాయతీల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఏకగ్రీవం చేసేందుకు కొన్ని గ్రామాల్లో ముందస్తుగానే కసరత్తు చేసినా.. ఏకాభిప్రాయాలు కుదరక పదుల సంఖ్యలో ఆశావహులు పుట్టుకొస్తున్నారు. రిజర్వేషన్ కలిసిరాని వారు ఉపసర్పంచ్ పదవినైనా దక్కించుకునేందుకు 'ముందస్తు' బేరసారాలకు దిగుతున్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఒగులాపూర్ పంచాయతీ రూ.5లక్షలకు ఏకగ్రీవం అయిన నేపథ్యంలో డబ్బులు ఒకేసారి చెల్లించాలని చెప్పడం, లేదంటే 'మేమే చెల్లిస్తాం.. నువ్వు తప్పుకో' అంటూ బలవంతం చేయడంతో భూక్యదేవదాసు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు.

సర్పంచ్ నుంచి అసెంబ్లీ వరకూ జిల్లా ప్రముఖులు..

- బుగ్గారం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై ఉమ్మడి రాష్ట్రంలో దేవాదాయశాఖ మంత్రిగా పని చేసిన జువ్వాడి రత్నాకర్‌రావు అంతకు ముందు తిమ్మాపూర్ సర్పంచ్‌గా 18ఏండ్లు సేవలందించారు.
- టీడీపీ హయాంలో అటవీశాఖ మంత్రిగా పని చేసిన న్యాలకొండ రాంకిషన్‌రావు అంతకు ముందు గంగాధర సర్పంచ్‌గా సేవలందించారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పని చేసిన న్యాలకొండ శ్రీపతిరావు కూడా గంగాధర సర్పంచ్‌గా కొనసాగారు.
- అసెంబ్లీ స్పీకర్‌గా పని చేసిన దుద్దిళ్ల శ్రీపాదరావు కూడా ప్రస్తుత భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దన్వాడ గ్రామ సర్పంచ్‌గా మూడుసార్లు పని చేశారు.
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి 1981లో కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ సర్పంచ్‌గా పని చేశారు. అనంతరం 2004లో ఎమ్మెల్యేగా పని చేశారు. ఇదే ప్రాంతానికి చెందిన నాలుగుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన సీపీఐ నేత దేశిని చినమల్లయ్య బొమ్మనపల్లి గ్రామానికి నాలుగుసార్లు సర్పంచ్‌గానూ పని చేశారు.
- 2004లో హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పని చేసిన కెప్టెన్ లక్ష్మీకాంతరావు హుజూరాబాద్ మండలం సింగపూర్ సర్పంచ్‌గా సేవలందించారు.
- నేరెళ్ల శాసనసభ్యుడిగా మూడుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీ హయాంలో సహకార శాఖ మంత్రిగా వ్యవహరించిన సుద్దాల దేవయ్య జగిత్యాల జిల్లా అంతర్గాం సర్పంచ్‌గా చేశారు.
- ప్రస్తుత హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ కూడా 1995లో సింగపూర్ సర్పంచ్‌గా పని చేశారు.
- బీజేపీ నుంచి పెద్దపల్లి ఎమ్మెల్యేగా 1999లో పని చేసిన గుజ్జుల రామకృష్ణారెడ్డి సైతం ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేట సర్పంచ్‌గా రాజకీయ అరగేట్రం చేసిన వారే.

యూసీఓలో సత్తాచాటిన 'నారాయణ'



హైదరాబాద్: జాతీయ స్థాయిలో యూనిఫైడ్‌కౌన్సిల్ వారు నిర్వహించే యూనిఫైడ్ సైబర్ ఒలంపియాడ్(యూసీఓ)-2019 రెండో దశ ఫలితాల్లో నారాయణ స్కూల్స్ విద్యార్థులు విజయబావుటా ఎగురవేశారు. శుక్రవారం విడుదలైన రెండో దశ పరీక్ష ఫలితాల్లో ఆలిండియా ఫస్ట్(1) ర్యాంకుతో పాటు 3,4,5,6,7,8,9 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు 10లోపు 54 ర్యాంకులను తమ విద్యార్థులు కైవసం చేసుకున్నారని నారాయణ విద్యాసంస్థల యాజమాన్యం తెలిపింది. అలాగే 2,5,8 తరగతుల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించారని నారాయణ మేనేజింగ్ డైరెక్టర్ డా. సింధూర నారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... విద్యారంగంలో విశిష్ట విజయాలకు కేరాఫ్ అడ్రస్‌గా తమ విద్యాసంస్థ నిలుస్తోందన్నారు. తమ విద్యార్థులకు న్యూమరికల్ స్కిల్స్‌ను పెంపొందించడంతో పాటు ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఏ పోటీ పరీక్ష నిర్వహించినా తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడానికి తమ విద్యాసంస్థల సూపిరీయర్ ప్లానింగ్, సూపర్‌లేటివ్ టీచింగే కారణమన్నారు. ఈ సందర్భంగా పరీక్షలో విజయం సాధించిన విద్యార్థులను నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునీత్ ప్రత్యేకంగా అభినందించారు.

డెంగ్యూతో మహిళ మృతి

- రెండేండ్ల కిందట భర్త..




నవతెలంగాణ-చిన్నంబావి

వనపర్తి జిల్లా కొప్పునూరులో డెంగ్యూ వ్యాధితో మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లంకెపల్లి లక్ష్మి(36)కి నెల కిందట డెంగ్యూ ప్రబలింది. అప్పటి నుంచి మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చింది. గురువారం రాత్రి పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి భర్త రెండేండ్ల కిందట డెంగ్యూ, కిడ్నీ సమస్యలతో మృతిచెందాడు. లక్ష్మికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లిదండ్రులు లేకపోవడంతో పిల్లలు అనాథలయ్యారు. వీరికి కాంగ్రెస్ నాయకురాలు కెసిరెడ్డి వెంకట రమణమ్మ రూ.10 వేలు సాయమందించారు.

'దళారీ వ్యవస్థను నియంత్రించాలి'

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్




వరి, కంది, మొక్కజొన్న తదితర పంటలకు మద్దతు ధరలు ఇవ్వకుండా రైతులను దోపిడీ చేస్తున్న దళారులను నియంత్రించాలని, రైతులకు న్యాయం దక్కేలా చూడాలని ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి.సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మార్కెట్లలో దళారులు ధరను తెగ్గోసి రైతులను మోసం చేస్తున్నా మార్కెట్ కమిటీలు చోద్యంగా చూస్తున్నాయని విమర్శించారు. రైతుబంధు పథకం కింద రైతులకు సర్కారు ఇచ్చిన రాయితీకన్నా ఎక్కువగా దళారులు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. తక్కువ ధరకు కొనుగోలు చేసేవారిపై చర్యలు తీసుకుని లైసెన్స్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు కచ్చితంగా మద్దతు ధర అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య

- వివాహేతర సంబంధమే కారణమా..?
- మృతులు సూర్యాపేట జిల్లా వాసులు

నవతెలంగాణ - మిర్యాలగూడ



(ఫైల్)

రైలు కింద పడి ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం జాలుబాయితండాకు చెందిన సరస్వతి(28)కి సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం మాల్యాతండాకు చెందిన రవీందర్‌తో పదేండ్ల కింద వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. రవీందర్, అదే గ్రామానికి చెందిన ధారావత్ భాస్కర్(30) లారీ డ్రైవర్లుగా పని చేస్తున్నారు. భాస్కర్‌కు ఇంకా వివాహం కాలేదు. అయితే, సరస్వతి తప్పిపోయినట్టు భర్త రవీందర్ నెల రోజుల కింద చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలోనే శుక్రవారం సరస్వతి, భాస్కర్ రైలు కింద పడి మృతిచెందారు. నెలరోజుల కిందట కనిపించకుండా వెళ్లిన సరస్వతి ఇలా మరొకరితో కలిసి ఆత్మహత్య చేసుకోవడంపై అలు అనుమానాలు కలుగుతున్నాయి. వరుసకు వీరిద్దరూ వదిన, మరిది. వీరి మధ్య వివాహేతర సంబంధమే ఆత్మహత్యకు కారణమా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాఫెల్ భయంతోనే అలోక్‌పై వేటు

- మమత బెనర్జీ ర్యాలీకి వెళ్ళం : సీపీఐ కార్యదర్శి నారాయణ

నవతెలంగాణ - న్యూఢిల్లీబ్యూరో



రాఫెల్ డీల్‌లో జరిగిన అవకతవకలకు భయపడే సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మపై మోడీ వేటేశారని సీపీఐ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. రాకేశ్ ఆస్థానా లాంటి అవినీతిపరుడు అలోక్ వర్మపై ఫిర్యాదు చేస్తే, దాని ఆధారంగా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటువంటి పరిణామాలు చోటు చేసుకోవడం సీబీఐ చరిత్రలోనే ప్రథమమని అన్నారు. కేంద్రం దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకొని ప్రత్యర్థులపై దాడి చేస్తుందని వివరించారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదని, వ్యవస్థలపై నమ్మకం కోల్పోతే దేశాన్ని కాపాడటం కష్టమన్నారు. ఈ చర్యలను తమ పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బీజేపీ ప్రభుత్వానికి అసహనం పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ, ప్రజాస్వామ్యంపై మోడీకి నమ్మకం లేదని విమర్శించారు. అస్సాం మండిపోతుందని, అందుకు బీజేపీ విధానాలే కారణమని దుయ్యబట్టారు. దేశంలో మతోన్మాద శక్తులను బీజేపీ పెంచిపోషిస్తుందని, మతపరంగా దేశాన్ని విభజించాలనే సంకుచిత భావంతో రాజకీయాలు చేస్తుందని ఆరోపించారు. కాగా, కోల్‌కతాలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ నిర్వహించే ర్యాలీకి తాము వెళ్ళటం లేదని స్పష్టం చేశారు. జాతీయస్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కలిసివస్తే ఆహ్వానిస్తామన్నారు.

ఇల్లు వస్తదో.. రాదో?

- మూలనపడ్డ పాత దరఖాస్తులు.. కొత్తవి తిరస్కరణ
- రెవెన్యూ కార్యాలయాలు, మీసేవల చుట్టూ చక్కర్లు
- మార్గదర్శకాలు రూపొందిస్తామంటున్న జీహెచ్‌ఎంసీ
- హైదరాబాద్‌లోనే సుమారు 3 లక్షలకుపైగా అప్లికేషన్లు

గ్రేటర్‌లోని పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఆందోళన





జీహెచ్‌ఎంసీ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ దరఖాస్తుల స్వీకరణలో స్పష్టత కొరవడింది. గతంలో చేసుకున్న దరఖాస్తుల పరిస్థితి చెప్పకపోగా.. కనీసం వాటిని పరిశీలించడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజలు మళ్లీ మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తుండగా కంప్యూటర్ తీసుకోవడం లేదంటూ సిబ్బంది తిప్పి పంపిస్తున్నారు. అధికారుల వద్దా సరైన సమాధానం లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో కొందరు దళారులను వెతుక్కుంటున్నారు. అయినప్పటికీ ఇల్లు వస్తదో రాదోనన్న ఆందోళన గ్రేటర్‌వాసుల్లో నెలకొన్నది.

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండ్లులేని పేదలు మీసేవ కేంద్రాల్లో దర ఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు ప్రకటించారు. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మేయర్ బొంతు రామ్మోహన్‌తో చర్చించి 'డబుల్' ఇండ్ల కేటా యింపు గురించి మార్గదర్శకాలు రూపొందించ నున్నామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ దానకిషోర్ చెబుతున్నారు. ఈ రెండు ప్రకటనలు ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇండ్లకోసం లక్షలాది మంది పేదలు తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. హైదరాబాద్ జిల్లాలోనే సుమారు మూడు లక్షలకుపైగా దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఆ దరఖాస్తులను ఇంత వరకూ పరిశీలించలేదు. సంచుల్లో మూటలు కట్టి మూలన పడేశారని అధికారులే చెబుతున్నారు. మరికొంత మంది మీసేవ కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల హంగామా మొదలైంది. మళ్లీ టీఆర్‌ఎస్ గెలిచిన తర్వాత 'డబుల్' దరఖాస్తుల స్వీకరణ తెరపైకి వచ్చింది.

గ్రేటర్‌లో అర్హులు 4లక్షలకుపైనే..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత గ్రేటర్‌లో అధికారులు సర్వే నిర్వహించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇండ్లులేని నిరుపేదలు సుమారు నాలుగు లక్షలకుపైగానే ఉన్నారని గుర్తించారు. రెండు లక్షల మందికి ఇండ్లు నిర్మించడానికి రెండు వేల ఎకరాల భూమి సేకరించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. లక్ష ఇండ్లను మాత్రమే కట్టిస్తామని ప్రభుత్వం లెక్కలేసింది. వాటిని నాలా బాధితులు, భూసేకరణలో ఇండ్లు కోల్పోయిన వారికి మాత్రమే ఇస్తామని జీహెచ్‌ఎంసీ అధికారులు ఇప్పటికే ప్రకటించారు. 'డబుల్' ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలనే కీలకపాత్ర పోషించాలని గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించారు. దీంతో జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోని ప్రజల కోసం ప్రత్యేక కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. కానీ నాలుగున్నరేండ్లల్లో ఐడీహెచ్‌కాలనీలో 396, నాచారంలోని లంబాడీతండాలో 176 ఇండ్లు తప్ప ఎక్కడా పూర్తిచేసిన దాఖలాల్లేవు.

ఏది ప్రాతిపదిక ?

జీహెచ్‌ఎంసీ పరిధిలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలున్నాయి. వీటి పరిధిలో 109 ప్రాంతాల్లో లక్ష 'డబుల్' ఇండ్లు నిర్మిస్తున్నారు. వీటిలో 34 ప్రాంతాల్లో ఇన్‌సిటూ (పాత ఇండ్ల స్థానంలో కొత్తగా నిర్మించడం), 75 ప్రాంతాల్లో ఖాళీ స్థలాల్లో ఇండ్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. నిర్మాణం ఒకెత్తయితే.. లబ్దిదారుల ఎంపిక మరో ఎత్తు. ఇండ్లు నిర్మించే బాధ్యత జీహెచ్‌ఎంసీ, లబ్దిదారుల ఎంపిక రెవెన్యూ శాఖ తీసుకున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో 24 మంది ఎమ్మెల్యేలు, 150 మంది కార్పొరేటర్లు ఉన్నారు. అయితే, నియోజకవర్గం, మండలం, వార్డు, ఏరియా ఇలా ఏ ప్రాతిపదికన లబ్దిదారులను ఎంపిక చేస్తారనేది స్పష్టత లేదు. గతంలో పేదలు పెట్టుకున్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, వాంబే, రాజీవ్‌గృహకల్పకు సంబంధించిన దరఖాస్తులను సైతం ఇంతవరకు పరిష్కరించలేదనే విమర్శలూ లేకపోలేదు.

'మీ సేవా'కేంద్రాల్లో బారులు

'డబుల్' ఇండ్ల కోసం పేదలు 'మీ-సేవా' కేంద్రాల్లో బారులు తీరుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే దరఖాస్తులు చేతబూని నిలబడుతున్నారు. ఆధార్, ఓటరు గుర్తింపు, విద్యుత్తు చెల్లింపు బిల్లు, రెండు ఫొటోలతో రూ.35చెల్లించి దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రం చేదు అనుభవం ఎదురవుతోంది. పాతవారు మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి వెళ్తే ఆన్‌లైన్‌లో స్వీకరించడం లేదు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులను అడిగితే తమ దగ్గర కూడా సమాచారం లేదని చెబుతున్నారు.

అప్లికేషన్లు ఇచ్చి నాలుగేండ్లు : ఆశ, ఉప్పల్

డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం నాలుగేండ్ల కింద ఆన్‌లైన్‌లో అప్లికేషన్ ఇచ్చాం. ఇప్పటి వరకూ ఇండ్లు రాలేదు. మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నారని కాలనీలో చెబితే మీ సేవా కేంద్రానికి వెళ్లి ఇచ్చాం. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి రావని చెబుతున్నారు. అందుకే మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు వచ్చాం. అసలు ఇండ్లు ఇస్తారా..ఇవ్వరా అనే విషయాలేమీ చెప్పడం లేదు.

667 దరఖాస్తులు వచ్చాయి : వాణి - మీసేవా మేనేజర్

రామంతాపూర్ మీసేవా కేంద్రంలో 667 డబుల్ బెడ్‌రూం ఇండ్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్స్ వచ్చాయి. అధికారుల నుంచి కానీ, పాలకుల నుంచి కానీ, దరఖాస్తులు తీసుకోమని అధికారికంగా ఎవరూ చెప్పలేదు. ఆన్‌లైన్‌లో హౌజింగ్ మేడ్చల్ జిల్లా అని చూపిస్తుంటే లబ్దిదారుల నుంచి అప్లికేషన్లు తీసుకుంటున్నాం.

ఇండ్లు కట్టించండి సారూ..

జీహెచ్‌ఎంసీ వద్ద భోజగుట్ట బస్తీ వాసుల ధర్నా


నవతెలంగాణ-సిటీబ్యూరో

'నాంపల్లి నియోజకవర్గంలోని భోజగుట్టలో ఉన్న మా ఇండ్లను కూల్చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టిస్తామన్నారు. ఏడాది కావస్తున్నా ఇండ్లు కట్టించి ఇవ్వలేదు. వెంటనే మాకు ఇండ్లు ఇవ్వాలి' అని హైదరాబాద్ భోజగుట్ట ప్రాంత వాసులు శుక్రవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకుముందు కార్యాలయం లోపలికి వెళ్లడానికి యత్నిస్తే పోలీసులు అడ్డుకున్నారు. దాంతో వాగ్వాదం జరిగింది. సుమారు రెండు గంటలకుపైగా కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ కన్నా సురేష్‌కుమార్‌ను కలిసి తమ గోడును వినిపించారు. డబుల్ కొత్త ఇండ్లు కట్టిస్తామంటే ఇండ్లన్నీ ఖాళీ చేశామన్నారు. ప్రభుత్వం చూపించిన దగ్గరకు వెళ్లిపోవాలని ఆదేశించారనీ, దూరప్రాంతాలకు వెళ్లలేక, కిరాయి ఇండ్లల్లో ఉండలేక అక్కడే గుడిసెలేసుకుని జీవిస్తున్నామనీ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమకు ఇండ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. భోజగుట్టలో 1824 ఇండ్లు మంజూరయ్యాయనీ, ప్రస్తుతం 512 ఇండ్ల నిర్మాణాలు సాగుతున్నాయనీ తెలిపారు. ఇండ్ల గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అందరికీ ఖచ్చితంగా ఇండ్లు కట్టించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై ఈనెల 22 తేదీన మరో సారి చర్చిస్తామని తెలిపారు. దీంతో బాధితులు ఆందోళన విరమించారు.

వారిదే పెత్తనం..

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రతినిధి

ప్రజాస్వామ్యంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీలను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తూ ఊరిపై పెత్తనం చెలాయించేందుకు పెత్తందార్లు రూపొందించుకున్న సరికొత్త ఎత్తుగడే వీసీడీ. ఊరి అభివృద్ధిపై ఎమ్మెల్యేతో చర్చించాలన్నా వాళ్లే ప్రత్యక్షమవుతారు. ఆ కమిటీల్లో అన్ని కులాలకు ప్రాతినిథ్యం అన్న మాటేగానీ.. మొత్తంగా గ్రామాన్ని తమ చెప్పుచేతుల్లో పెట్టుకునేందుకు అగ్రకుల పెత్తందార్ల యత్నిమిది. ప్రధానంగా నిజామాబాద్ జిల్లాలోని పలు మండలాల్లో వీడీసీలు చెలామణిలో ఉన్నాయి. ప్రధానంగా ఆర్మూర్, బాల్కొండ, భీంగల్, జక్రాన్‌పల్లి, కమ్మర్‌పల్లి, మెండోరా, మోర్తాడ్, ముప్కాల్, నందిపేట్, వేల్పూర్, ఏర్గట్ల మండలాల్లో వీడీసీల ప్రభావం అధికంగా ఉంది. ఆ మండలాల్లో 177 గ్రామాల్లో కమిటీల పెత్తనం కొనసాగుతుండగా ఆర్మూర్ రెవెన్యూ డివిజన్ పరిధిని ఆనుకుని జగిత్యాల, నిర్మల్ జిల్లాలోని కొన్ని పల్లెలపైనా ప్రభావం ఉన్నది. అక్కడ వీడీసీలు చేపట్టే నిర్ణయాలను వ్యతిరేకించినా, ప్రశ్నించినా బహిష్కరణలతో అణగారిన వర్గాలను నొక్కిపెడుతున్నాయి.



నిర్ణయాలన్నీ వీడీసీవే..

గ్రామంలోని అన్ని సామాజిక తరగతుల నుంచి ఒక్కొక్కరికి సభ్యత్వం ఉన్నప్పటికీ.. అగ్రకులాలకు మాత్రం 'కులం పంత' (తర్ప) పేరిట ఇద్దరు నుంచి ముగ్గురికి మెజారిటీ గ్రామాల్లో సభ్యత్వం కల్పిస్తారు. దీంతో ఆ కమిటీలో ఏ నిర్ణయమైనప్పటికీ వారికే అనుకూలంగానే ఉంటున్నాయి. బీసీలు, దళితులు ఒక్కొక్కరు సభ్యులుగా ఉన్నా కమిటీ తీసుకునే అప్రజాస్వామిక చర్యలను వ్యతిరేకించే పరిస్థితి లేదు. ఒకవేళ సాంఘిక బహిష్కరణను కమిటీలోని దళితుడు వ్యతిరేకిస్తే.. మొత్తం గ్రామ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారా? అన్న ప్రశ్న ముందుకు తెస్తున్నారు. గొల్ల కుర్మ సభ్యులు వ్యతిరేకిస్తే భవిష్యత్తులో తమ గొర్లు, మేకల మేతకు ఎక్కడ అడ్డుతగులుతారో? అని బెదిరిపోతున్నారు. మరోవైపు సర్పంచులను డమ్మీ చేస్తూ ప్రభుత్వం నుంచి వచ్చే నిధులను సైతం తూతూమంత్రంగా గ్రామసభ నిర్వహించి ఇష్టారీతిన ఖర్చు చేస్తుంటారు. గ్రామాల్లో ఊరేగింపులు, జాతాలు అన్నింట్లోనూ సర్పంచ్ అధికారికంగా పాల్గొనాల్సి ఉండగా.. వీడీసీ సభ్యుడే ముందు వరుసలో ఉంటాడు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ సర్పంచులుగా ఉంటే కూరలో కరివేపాకులుగా తీసేస్తున్న పరిస్థితి. ఎమ్మెల్యేతో జరిగే సమావేశాల్లోనూ, ఇతర కార్యక్రమాల్లోనూ వీడీసీ అధ్యక్షుడే గ్రామం తరపున ప్రాతినిథ్యం వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఆర్థిక వనరులపై పట్టు..

గ్రామంలోని అన్ని కులాలపై అనధికార పన్ను విధిస్తూ నిధులు సమీకరిస్తున్నారు. కమిటీలకు పెత్తందార్లే ప్రెసిడెంట్లుగా ఉండగా వారి వద్దే నగదు జమ చేస్తున్నారు. గ్రామంలో 50 మంది గౌడ కుటుంబాలుంటే.. వాళ్లు చెట్లు గీసినందుకు కుటుంబానికి ఏడాదికి 'ఇంతమొత్తంలో' చెల్లించాలంటూ ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉదాహరణకు నందిపేట్ మండలం లక్కంపల్లి గ్రామంలో గౌడ కులస్తుల నుంచి ఊరిమీద కింద సుమారు రూ. రెండు లక్షలు ఇవ్వాలని వీడీసీ డిమాండ్ చేసింది. 'ఇవ్వబోం' అన్నందుకు మొత్తం కులాన్ని బహిష్కరించింది. ఇక బెల్ట్‌షాపులకు టెండర్లు, కూల్ డ్రింక్‌ల అమ్మకంపై పన్ను సహా చెరువు కట్టలు, ఖాళీ భూముల్లో పెరిగిన చెట్ల అమ్మకం ద్వారా నగదు పోగుచేస్తున్నారు. చివరకు ఆలయ భూములకు వచ్చే నిధులు సైతం వీడీసీ ప్రెసిడెంట్ వద్ద ఉంచుకుంటున్నాడు. అధికారికంగా ఈ నిధులన్నీ గ్రామపంచాయతీలకు చెల్లించాల్సి ఉంటుంది. ఆ నిధులు సర్పంచ్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాలి. కానీ వీడీసీ ప్రెసిడెంట్‌దే అంతిమ నిర్ణయమవుతోంది. వాటికి అదనంగా గొల్లకుర్మలు యేడాదికి ఊరిమీద మేకలు వదలడం, బెస్తకులస్తులు చేపలు పట్టివ్వడం పరిపాటి! ఓ రకంగా చెప్పాలంటే గ్రామంలో రాజకీయ, న్యాయ, పోలీసు, వివాదాలు అన్నింట్లో వాళ్లదే పెత్తనం.

రాజీ మంత్రమే...

జిల్లాలో చోటుచేసుకుంటున్న బహిష్కరణలన్నింటిల్లోనూ ఇప్పటి వరకు నిందితులకు శిక్షలు పడ్డ దాఖలాలు లేవు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో అటు పోలీసులు, ఇటు అధికారులు రాజీ మంత్రమే జపిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన ఇస్సాపల్లి, అభంగపట్నం, మంథని, కమ్మర్‌పల్లి తదితర ఘటనలన్నింటోల్లోనూ చివరకు రాజీ ప్రయత్నమే చేశారు. పోలీసులు దర్యాప్తు సమయం నుంచే బాధితులను మానసికంగా 'వీళ్లతో మీకేందుకు. తెల్లారి ముఖం చూసుకునేవాళ్లు' అంటూ కేసులను నీరుగార్చారు. ఇక కోర్టుల్లో న్యాయపోరాటం చేసేందుకు సైతం సామాజికంగా వెనుకబడిన దళితులు, బీసీలు ముందుకు రావడం లేదు. దీంతో ఈ బహిష్కరణలు దావానంలా ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి పాకుతున్నాయి.



పొలం నాట్లకు ట్రాక్టర్‌ను రానియ్యలేదు : రాజేశ్వర్(మారంపల్లి) బాధితుడు

అంబేద్కర్ యువజన సంఘం కడుతున్నామనే అక్కసుతో ఏకంగా 80 మాల కుటుంబాలను బహిష్కరించారు. కనీసం వరి నాట్ల కోసం పొలం చదును చేసేందుకు ట్రాక్టర్‌ను కూడా రానియ్యలేదు. ప్రభుత్వ డెయిరీతో పాటు ప్రయివేటు డెయిరీలోనూ మేం తీసుకెళ్లిన పాలు తీసుకోలేదు. ఊళ్లో సగానికి పైగా ఎక్కువ మంది కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ కూలీలకు పిలవడం లేదు.



ప్రణయ్ ఉదంతం అడ్డం పెట్టుకుని.. : విజయ్(కమ్మర్‌పల్లి) బాధితుడు

రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక కుంటిసాకులు చూపి గ్రామబహిష్కరణ చేశారు. మను సంస్కృతి దహనంతో పాటు దళితులపై దాడులకు వ్యతిరేకంగా కమ్మర్‌పల్లి మండలంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టాం. దీన్ని ఓర్వలేక నల్గొండ ప్రణయ్-అమృత ఉదంతం ఘటనపై సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్టు షేర్ చేశానని కారణం చూపి ఏకంగా గ్రామబహిష్కరణ చేశారు.

అధికారులొచ్చినా ఫలితం లేదు : రాజన్న(మారంపల్లి) మాజీ సర్పంచి, బాధితుడు

మారంపల్లి బహిష్కరణ ఘటనపై పోలీసులతో పాటు ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు రాములు వచ్చి గ్రామంలో దర్యాప్తు నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసినా పరిస్థితిలో మార్పురాలేదు. మమ్మల్ని దొంగల్లాగా చూస్తున్నారు. కూలీలకు కోసం మారంపల్లి నుంచి పక్కగ్రామమైన గంగసరం వెళ్తున్నారు.

మచ్చుకు కొన్ని సాంఘిక బహిష్కరణలు..

- నందిపేట మండలంలో మారంపల్లిలో అంబేద్కర్ భవన్ నిర్మించడాన్ని జీర్ణించుకోలేక 80 మాల కుటుంబాలను వీడీసీ బహిష్కరించింది. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు వచ్చిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు రాములను వీడీసీ అడ్డుకుంది.
- ఇస్సాపల్లిలో వినాయక చవితి సందర్భంగా దళితుల ఊరేగింపును ఓర్వలేక దాడులు చేశారు.
- కమ్మర్‌పల్లి మండలంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు విజయ్‌ను వీడీసీ బహిష్కరించింది. రాజకీయ ఎదుగుదల ఓర్వలేక.. ప్రణయ్ ఉదాంతంపై సోషల్‌మీడియాలో పోస్టును సాకుగా చూపుతు బహిష్కరణ చేశారు.
- నందిపేట్ మండలం లక్కంపల్లి గ్రామంలో గౌడ కులస్తులను వీడీసీ బహిష్కరించింది.

అలోక్‌వర్మ రాజీనామా

న్యూఢిల్లీ : సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో సీబీఐ డైరెక్టర్ స్థానంలో కూర్చున అలోక్ వర్మకు అంతలోనే పెద్ద అవమానం ఎదురైంది. కొద్ది గంటల వ్యవధిలోనే ఆ బాధ్యత నుంచి అలోక్‌వర్మను తప్పిస్తూ మోడీ సర్కార్ తీసుకున్న నిర్ణయం ఆయన్ని తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. దీంతో తన ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నానని శుక్రవారం సంచలన నిర్ణయం వెలువడించారు.

బుధవారం మరోసారి సీబీఐ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అలోక్‌ను మళ్లీ తప్పిస్తూ కేంద్రం గురువారం సాయంత్రం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా ఆయనను ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్‌గా బదిలీ చేసింది. ఈ పరిణామాలతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురై అగ్నిమాపక డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టకుండానే ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో సీబీఐ తాత్కాలిక డైరెక్టర్‌గా మళ్లీ నాగేశ్వరరావును నియమించారు.

ఆరోపణలు నిరాధారం : అలోక్‌వర్మ

నిరాధారమైన, నిష్ప్రయోజనమైన, తప్పుడు ఆరోపణలు చేసి తనను పదవి నుంచి తొలగించారని సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్‌వర్మ ఆరోపించారు. కేవలం ఒక్క వ్యక్తి తనకు వ్యతిరేకంగా చేసిన ఆరోపణలతో తనను బదిలీ చేశారనీ అన్నారు. కాగా ఈ విషయంపై అలోక్‌వర్మ మాట్లాడుతూ, అవినీతి కేసులపై దర్యాప్తు జరిపే సీబీఐ స్వతంత్రను తప్పనిసరిగా కాపాడాలని కోరారు. తాను సంస్థ సమగ్రతను కాపాండేందుకు ప్రయత్నించానని చెప్పారు. కానీ న్యాయపరమైన సమ్మతి లేకుండా అక్టోబరు 23న కేంద్రం, సీవీసీ తనపై ఆదేశాలు జారీచేసిందని చెప్పారు.

నిరాధారమైన ఆరోపణలతో తనను కమిటీ బదిలీ చేయడం చాలా విచారకరమని అన్నారు. సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మ భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునేందుకు ఏర్పాటైన కమిటీ, అవినీతి, విధుల పట్ల అలసత్వం వంటి ఆరోపణలు ఉన్నట్టు కేంద్ర నిఘా కమిషన్ (సీవీసీ) సమర్పించిన నివేదిక ఆధారంగానే ఆయనను బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుందని ప్రభుత్వ వర్గాల వెల్లడించాయి.

మసకబారిన సీబీఐ ప్రతిష్ట

సీబీఐ డైరెక్టర్ అలోక్‌వర్మను బలవంతపు సెలవుపై పంపించడం చెల్లదనీ, ఆయన్ని ఆ పదవిలో పునర్‌నియమిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన మరునాడే (గురువారం) ఆయన్ని ఆ పదవి నుంచి ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ తొలగించటం సంచలనం రేపింది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలోక్‌వర్మను ఆ పదవిలో కొనసాగించడం సీబీఐ ప్రతిష్టకే భంగకరం కనుక ఆయన్ని ఆ పదవి నుంచి తప్పించి అగ్నిమాపక సర్వీసుకు బదిలీ చేయాల్సి వచ్చిందని ప్రభుత్వం సమర్థించుకుంది. వాస్తవానికి ఈ నిర్ణయంతోనే సీబీఐ ప్రతిష్ట మరింత మసకబారింది.

అలోక్‌వర్మపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సరైన సాక్ష్యాధారాలు ఉన్నాయంటూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ రహస్య నివేదిక వెల్లడించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోడీ, ప్రధాన న్యాయమూర్తి సూచించిన జస్టిస్ సిక్రీ, ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గేలతో కూడిన ఎంపిక కమిటీ వర్మపై బదిలీ చేసింది. అయితే ఈ నిర్ణయాన్ని ప్రతిపక్ష నేత ఖర్గే వ్యతిరేకించారు.



సీబీఐ డైరెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే వాటిపై ఉన్నతస్థాయిలో విచారణ జరిపి నిజానిజాల్ని తేల్చాల్సింది మోడీ ప్రభుత్వమేననీ, అలా చేయకుండా బదిలీ ఎందుకు చేసింది? అని ఆయన ప్రశ్నించారు. "ఆయన అవినీతికి పాల్పడితే శిక్షించడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింత పెంచవచ్చు కదా? అదే అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాపై మోడీ ప్రభుత్వం ఎందుకు చర్యలు చేపట్టడం లేదు? రాఫెల్ కుంభకోణంపై దర్యాప్తు చేయాలని అలోక్‌వర్మ నిర్ణయించిన మరుక్షణం ఈ పరిణామాలు జరుగుతున్నాయి.

సందేహాలెన్నో...

సీబీఐ సంక్షోభం మొదలైననాటి నుంచి ఎన్నో ప్రశ్నలు, అనుమానాలు రావటం తప్ప, వాటికి సమాధానం లభించలేదు. ఎంపిక కమిటీ నిర్ణయం లేకుండానే అలోక్ వర్మపై చర్య తీసుకున్నారు. ఈ చర్య చెల్లదని వెంటనే సుప్రీంకోర్టు చెప్పకుండా, సీవీసీ దర్యాప్తునకు ఆదేశించింది. అందునా రహస్య నివేదిక ఇవ్వాలంది. మరి రాకేశ్ ఆస్థానాపై ఇదే రకంగా దర్యాప్తునకు సుప్రీం ఎందుకు ఆదేశించలేదన్నది ప్రశ్న. సీవీసీ రహస్య నివేదిక ఆధారంగానే కేంద్రం నిర్ణయం తప్పని సుప్రీం తీర్పు తేల్చింది. అదే రహస్య నివేదిక ఆధారంగా ఇప్పుడు ప్రధాని మోడీ నేతృత్వంలోని ఎంపిక కమిటీ అలోక్‌వర్మపై బదిలీవేటు వేసింది. ఇవి రెండూ ఒకే వ్యక్తిపై ఎలా ప్రయోగిస్తారన్నది అర్థం కావటం లేదు.

ఒడిశాలో హిందూత్వ శక్తులకు మద్దతుగా నిలబడ్డారన్న ఆరోపణలున్న వ్యక్తి నాగేశ్వరరావును తాత్కాలిక సీబీఐ చీఫ్‌గా నియమించటం కూడా వివాదాస్పదమైంది. ఇదంతా పక్కా ప్రణాళిక ప్రకారం జరుగుతోందన్న అనుమానాలు బలపడ్డాయి. ఈ అనుమానాలు, సందేహాలు...తీర్చాల్సిన బాధ్యత మోడీ సర్కార్‌పైనే ఉంది. లేదంటే సీబీఐ ప్రతిష్ట శాశ్వతంగా మసకబారుతుంది.

రాకేశ్ ఆస్థానాను విచారించండి...
ఎఫ్‌ఐఆర్ కొట్టివేసేందుకు న్యాయస్థానం నిరాకరణ

న్యూఢిల్లీ : సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానాకు ఢిల్లీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అవినీతి ఆరోపణల వ్యవహారంలో తనపై కేసును కొట్టివేయాలంటూ ఆస్థానా వేసిన పిటీషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది. ఈ కేసులో దర్యాప్తు జరపాల్సిందేననీ, 10వారాల్లోగా ఈ దర్యాప్తు పూర్తిచేయాలనీ సీబీఐని ఆదేశించింది.

మాంసం ఎగుమతిదారు మెయిన్ ఖురేషీ కేసులో తనను తప్పించేందుకు ఓ మధ్యవర్తి ద్వారా రాకేశా ఆస్థానాకు తాను లంచం ఇచ్చినట్టు హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త సతీశ్‌బాబు చెప్పడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రాకేశ్ ఆస్థానా, సీబీఐ డిప్యూటీ ఎస్పీ దేవేందర్ కుమార్, మధ్యవర్తి మనోజ్ ప్రసాద్‌లపై ఎఫ్‌ఐఆర్ నమోదైంది. అయితే దీన్ని సవాల్ చేస్తూ వీరు ఢిల్లీ హైకోర్టుకు వెళ్లారు.

దీనిపై విచారణ పూర్తిచేసిన న్యాయస్థానం, ఆస్థానా, మిగతా ఇద్దరిపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టేసేందుకు నిరాకరించింది. ఈ కేసులో 10వారాల్లోగా దర్యాప్తు పూర్తిచేయాలని సీబీఐని ఆదేశించింది. అంతేగాక, ఆస్థానాపై క్రిమినల్ దర్యాప్తు చేపట్టకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను కూడా న్యాయస్థానం రద్దు చేసింది. దీంతో ఈ కేసులో ఆస్థానాను అరెస్టు చేసే అవకాశముంది.

ఆసరాపై ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా పింఛన్‌దార్ల సంఖ్య పెరగనున్నది. పింఛన్ల సొమ్ము సైతం రెట్టింపు కానుంది. పింఛన్‌దార్ల వయస్సు తగ్గించిన నేపథ్యంలో అదనంగా మరో 15 లక్షల మంది లబ్దిదారులను కొత్తగా గుర్తించే అవకాశాలు ఉన్నాయి. పాత పింఛన్ల సంఖ్య మొత్తం 39,36,503. దీంతో పాతవి, కొత్తవి కలిపి మొత్తం 54,36,503 పింఛన్లు కానున్నట్టు అధికారిక సమాచారం. వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, చేనేత, గీత కార్మికులు, ఎయిడ్స్ రోగులు, ఫైలేరియా వ్యాధిగ్రస్తులు, బీడీ వర్కర్లు, ఒంటరి మహిళలకు కలిపి ప్రతియేటా రూ. 16 వేల కోట్లు అవసరమవుతాయని అధికారిక అంచనా. ఈమేరకు కొత్తగా కొన్ని మార్గదర్శకాలను సైతం ప్రభుత్వానికి ప్రతిపాదించారు. కొత్త పింఛన్‌దార్లను ప్రభుత్వ ఆదేశం మేరకు 2018, నవంబరు 19న ప్రచురించిన కొత్త ఓటర్ల జాబితా ప్రకారం ఎంపిక చేయనున్నట్టు సమాచారం. రాష్ట్రంలో ఈ జాబితా ప్రకారం 57 ఏండ్లుపైబడిన వారు 41.60 లక్షల మంది ఉన్నారు. అలాగే 57 నుంచి 64 సంవత్సరాల్లోపు ఉన్నవారు 19.58 లక్షల మంది ఉన్నట్టు అధికారిక సమాచారం.

అర్హతలివిగో..

కొత్త పింఛన్‌దార్లకు తాజా ఓటర్ల జాబితా ఆధారంగా ఎంపిక చేయనున్నారు.57 నుంచి 64 ఏండ్ల వయస్సున్న అర్హులు 15 లక్షల మంది ఉన్నట్టు ప్రాథమిక అంచనా. ఈ జాబితాల పరిశీలనకు ఆయా జిల్లాల కలెక్టర్లు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లకు వాటిని అందజేసినట్టు సమాచారం. సమగ్ర కుటుంబ సర్వేతో కూడా సరిపోల్చే అవకాశాలున్నాయి. గ్రామ పంచాయతీ, వార్డు సభల్లో లబ్దిదారులను ఎంపిక చేస్తారు. బ్యాంకు ఖాతా, యూఐడీ సంఖ్య, ఫొటోలను అర్హుల నుంచి సేకరిస్తారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పరిపాలనా అనుమతుల కోసం ఆయా జిల్లా కలెక్టర్లకు జాబితాలు పంపుతారు. ఆ తరువాత ఇప్పటికే అందుబాటులో ఉన్న ఆసరా సాఫ్ట్‌వేర్‌లో కొత్త జాబితాను అప్‌లోడ్ చేస్తారు. దీంతో వారికి పింఛన్లు మంజూరైనట్టు లెక్క.

పాత నిబంధనలివే..

గ్రామీణ లబ్దిదారులకు రూ.1.50 లక్షల ఆదాయం, పట్టణ లబ్దిదారులకు రూ.2 లక్షలు మించరాదు. మూడెకరాల తరి లేదా 7.5 ఎకరాల చెలక కంటే ఎక్కువ భూమి ఉంటే పింఛన్ వర్తించదు. ప్రభుత్వ, రిటైరైన ఉద్యోగులకు పింఛన్ రాదు. కాంట్రాక్టర్లు, డాక్టర్లు, అర్కిటెక్ట్‌లు, చార్టెట్ అక్కౌంటెంట్లు అనర్హులు. ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లులు, పెట్రోల్ పంపులు, రిగ్ ఓనర్లు, ఆయా వ్యాపారాలతో కూడా షాపులు ఉన్న వారికి కూడా పింఛన్ వర్తించదు. ఇంతరకు ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పింఛన్ వస్తుంటే, కొత్త పింఛన్ మంజూరు చేయరు. నాలుగు చక్రాల వాహనాలు ఉన్నవారు, భారీ వాహనాలు ఉన్నవారు అనర్హులు.

శ్మశాన వాటికకు భూమి.. సర్పంచ్ ఏకగ్రీవం

- వార్డు, ఉపసర్పంచ్ పదవులకు వేలం

నవతెలంగాణ- విలేకరులు

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపూర్ గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకుడు బస్వరాజు సర్పంచ్ పదవి కోసం రెండున్నర ఎకరాలు శ్మశానవాటిక నిర్మాణం కోసం గ్రామానికి ఇచ్చాడు. దీంతో గ్రామస్తులు ఏకగ్రీవానికి తీర్మానించినట్టు సమాచారం. అదే గ్రామంలో ఉప సర్పంచ్ కోసం రూ.3లక్షల 60 వేలు, 8 వార్డులకు సభ్యుల కోసం 3 లక్షల 50 వేలకు వేలం నిర్వహించారు. ఈ గ్రామానికి మూడో విడత లో ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా మక్తల్ మండలం గడ్డపల్లిలో సర్పంచ్‌గా త్రివేణి ఏకగ్రీవానికి గ్రామస్తులు తీర్మానించారు.

గ్రామాభివృద్ధికి ఉద్యమబాట

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత పెంచేందుకు వీలుగా కొత్తగా రూపొందించిన చట్టంపై పంచాయతీ ప్రతినిధులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ పంచాయతీకి కొత్త చట్టం తెలుగు ప్రతులను పంపించాలని ఆదేశించారు. కొత్తగా నియామకమయ్యే పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కలిసికట్టుగా పనిచేయడానికి అవసరమైన అవగాహన కల్పించాలని చెప్పారు. కొత్తగా ఎన్నికకాబోయే సర్పంచులు..మూస పద్ధతిలో కాకుండా, గ్రామాల సమగ్ర వికాసానికి పాటుపడే ఉద్యమ కారులుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చే అంశంపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్‌రెడ్డి, మర్రి జనార్ధన్‌రెడ్డి, కాలె యాదయ్య, సీఎంవో ప్రత్యేక కార్యదర్శి భూపాల్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రతీ గ్రామానికి ఒక కార్యదర్శిని నియమించడం కోసం పంచాయతీ కార్య దర్శులు నియామకం కూడా జరుగుతున్నది. గ్రామాభివద్ధిలో వీరిద్దరి పాత్ర చాలా కీలకం. పంచాయతీలకు విధులు, బాధ్యతలు అప్పగించే విషయంలో కొంత జాప్యం అనివార్యమవుతుంది. ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఓట్ ఆన్ అకౌంట్‌ను పొయ్యే అవకాశం ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కూడా ఓట్ ఆన్ అకౌంట్‌కే పోతుంది. ఏప్రిల్, మే నెలల్లో పార్లమెంటు ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెడతాం. ఆ బడ్జెట్లోనే పంచాయతీలకు నిధులు కేటాయించడం సాధ్యమవుతుంది. ఆ లోగా సర్పంచులు, కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణనివ్వటం ద్వారా గ్రామాభివద్ధి కోసం పాటుపడే కార్యకర్తలుగా వారిని తీర్చిదిద్దాలి. తెలంగాణ గ్రామీణాభివద్ధి సంస్థ, ఆస్కి, ఎమ్‌సీఆర్‌హెచ్‌ఆర్‌డీ తదితర సంస్థల ద్వారా శిక్షణ ఇప్పించాలి' అని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు.

పోలియో బాధితుడు శివసాయికి ఫిబ్రవరిలో ఆపరేషన్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రామగుండానికి చెందిన పోలియో బాధిత బాలుడు శివసాయికి ఫిబ్రవరి మొదటి వారంలో ఆపరేషన్ చేయనున్నట్టు హైదరాబాద్‌లోని సన్‌షైన్ ఆస్పత్రి తెలిపింది. అతడి ఆపరేషన్‌కి సంబంధించిన పూర్తి బాధ్యతలను తాను తీసుకుంటానంటూ టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొద్ది రోజుల క్రితం హామీనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం సన్‌షైన్ ఆస్పత్రిలో డాక్టర్ గురువారెడ్డిని శివసాయి కలిశాడు. ఆయన బాలుణ్ని చెకప్ చేశారు. అతడికి ఫిబ్రవరి మొదటి వారంలో ఆపరేషన్ చేస్తామని.. కచ్చితంగా నడక వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

బదిలీ చేయటం దారుణం : సీపీఐ(ఎం)

న్యూఢిల్లీ : సీబీఐ డైరెక్టర్‌గా అలోక్‌వర్మను నియమించాలని సుప్రీం ఆదేశించిన కొద్ది గంటల్లోనే మోడీ సర్కార్ ఆయనపై బదిలీ వేటు వేయటం దారుణమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. అలోక్ వర్మను మరోచోటకు బదిలీ చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. సీబీఐ స్వతంత్ర ప్రతిపత్తి పూర్తిగా దెబ్బతిన్నదని ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్‌బీఐ, సీబీఐ, న్యాయవ్యవస్థ, సమాచార కమిషన్...వంటివన్నీ భారత ప్రజాస్వామ్యానికి పునాదులు లాంటివి, కావాలనే రాజ్యాంగబద్ధ సంస్థల్ని కేంద్రం దెబ్బతీస్తోందనీ, ఈ పరిణామాలన్నింటినీ ప్రజలు గమనిస్తు న్నారనీ, రాబోయే ఎన్నికల్లో బీజేపీకి గట్టి బుద్ధి చెబుతారనీ పొలిట్‌బ్యూరో తన ప్రకటనలో తెలిపింది.

సీబీఐని రాజకీయ, ఎన్నికల ఎజెండాకు వాడుకోవాలన్న ఆలోచనతో మోడీ సర్కార్ ఇదంతా చేస్తోందనీ, తమను విమర్శించేవారిని బెదిరించడానికి, బ్లాక్‌మెయిల్ చేయడానికి సీబీఐని వాడాలన్నదే బీజేపీ ఆలోచన అనీ, ప్రధాని మోడీ అనుయాయుల్ని రక్షించుకోవటం కోసం ఇదంతా చేస్తున్నారనీ పొలిట్‌బ్యూరో ఆరోపించింది. ఇలాంటి చర్యల ద్వారా మోడీ సర్కార్ అసలు స్వరూపం బయటపడిందని వ్యాఖ్యానించింది. పొలిట్‌బ్యూరో శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో, గతేడాది అక్టోబరు 23న అర్ధరాత్రి హఠాత్తుగానే సీబీఐ ప్రధాన కార్యాలయంపై కేంద్రం దాడులు జరిపింది. ఇదంతా అక్రమమని, తిరిగి అలోక్‌వర్మను సీబీఐ చీఫ్‌గా నియమిస్తూ సుప్రీం తీర్పు చెప్పింది. అయితే న్యాయస్థానం తీర్పును మోడీ సర్కార్ జీర్ణించుకోలేకపోయింది. ప్రధాని మోడీ నేతృత్వంలో ఎంపిక కమిటీ హఠాత్తుగా సమావేశమై అలోక్‌వర్మపై బదిలీ వేటు వేసింది. అవినీతి బాగోతాలు, క్రోనీ క్యాపిటలిజం, రాఫెల్ అవినీతి...మొదలైనవి బయటపడతాయని అలోక్‌వర్మను మోడీ సర్కార్ లక్ష్యంగా చేసుకుంది. అనేక విషయాలు తెరవెనుకే ఉండాలని కేంద్రం కోరుకుంటోంది.

నవచిత్రం

ఆద్యంతం నవ్వించే సినిమా



అనిల్ రావిపూడి, మెహరీన్, వరుణ్‌తేజ్, వెంకటేష్, తమన్నా

వెంకటేష్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరోహీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఎఫ్ 2'. శ్రీ వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం నేడు(శనివారం) విడుదల కానుంది. ఈ నేపథ్యంలో గురువారం ప్రీ రిలీజ్ వేడుకని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ, 'ఈ సంక్రాంతికి మా సినిమా రావడం చాలా ఆనందంగా ఉంది. సాధారణంగా పండగలకి వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ని ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ సంక్రాంతికి ఈ సినిమా ద్వారా సంక్రాంతి అల్లుళ్లుగా వస్తున్నాం. నేను పెద్ద హీరోనని ఎప్పుడూ అనుకోను. కథ, దర్శకుడిని నమ్మి సినిమా చేశాను. అనిల్‌తో కథపై చాలా డిస్కస్ చేశాం. దిల్‌రాజుతో కూడా మంచి అనుబంధం ఉంది. 'దృశ్యం', 'గురు' సినిమాల తర్వాత చేసిన చిత్రమిది. చాలా నేచురల్‌గా చేశా. అనిల్ కూడా చాలా ఫ్రీడమ్ ఇచ్చి చేయించుకున్నాడు. వరుణ్‌తేజ్, రాజేంద్రప్రసాద్‌తో కలిసి పనిచేయడం ఆనందంగా ఉంది. తమన్నా, మెహరీన్ అద్భుతంగా నటించారు. సినిమా కచ్చితంగా పండక్కి అలరిస్తుంది' అని అన్నారు.

'సినిమాలో నేను వరుణ్ యాదవ్‌లా కనిపిస్తా. ఫస్ట్ టైమ్ మాస్ పాత్ర పోషించా. కామెడీ చేశాను. సినిమా షూటింగ్ త్వరగా అయిపోయింది. ఈ జర్నీ మెమరబుల్‌గా సాగింది. దర్శకుడు అనిల్‌ని చూస్తుంటే మాకంటే బావున్నాడనిపిస్తుంది. ఈ సినిమా ద్వారా అనిల్ లాంటి ఓ మంచి ఫ్రెండ్ దొరికినందుకు ఆనందంగా ఉంది. ఈ బ్యానర్‌లో మరిన్ని సినిమాలు చేయాలని కోరుకుంటున్నా. చిన్నప్పట్నుంచి చిరంజీవి, బాబాయ్‌ల సినిమాలు ఎలా చూస్తానో, నవ్వుకోవడానికి రాజేంద్రప్రసాద్ సినిమాలు చూసేవాడిని. ఆయనతో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. మా పెద్దనాన్నగారి సమకాలీకులు వెంకటేష్. ఆయనతో చేసేటప్పుడు ఎక్కడో చిన్న భయం. కానీ ఆయన మాతో చాలా కంఫర్ట్‌గా, ఓ ఫ్రెండ్‌లా, మెంటర్‌లా ఉన్నారు. నెక్ట్స్ టైమ్ ఆయనతో స్టోరీ అడక్కుండానే సినిమా చేసేందుకు రెడీ. ఈ సినిమాలో మా ఇద్దరి మధ్య కెమిస్ట్రీ బాగా పండుతుంది. ప్రేక్షకులు సీట్లో కుదురుగా కూర్చుని సినిమా చూడలేకుండా నవ్వుతూనే ఉంటారు. సంక్రాంతికి విడుదలైన రెండు సినిమాలకి మంచి టాక్ వచ్చింది. మా సినిమాని కూడా హిట్ చేస్తారని కోరుకుంటున్నా' అని వరుణ్ తేజ్ తెలిపారు.

తమన్నా చెబుతూ, 'కొన్ని సినిమాలు మైలురాళ్ళుగా నిలిచిపోతాయి. నాకు ఈ సినిమా అలాంటిది. 'ఊపిరి' తర్వాత డబ్బింగ్ చెప్పుకున్నా. చాలా షేడ్స్ ఉన్న పాత్ర పోషించా. 'ఎఫ్3' వస్తే బాగుండూ అనిపిస్తుంది' అని చెప్పారు. 'మా సినిమా ఆడియెన్స్‌ని నవ్వుల్లో ముంచెత్తుతుంది. 80శాతం కామెడీ ఉంటుంది. మంచి టైమింగ్ ఉన్న గొప్ప నటులు పనిచేశారు. వెంకటేష్, తమన్నా మధ్య కెమిస్ట్రీ, కామెడీ, వరుణ్ తెలంగాణ యాస ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు అనిల్ రావిపూడి తెలిపారు. దిల్‌రాజు చెబుతూ, 'ఓ సినిమా రెడీ కావడానికి 24 క్రాఫ్ట్స్ కష్టం ఉంటుంది. దీనికి మేమంతా కష్టపడ్డాం. 'కలియుగ పాండవులు'తో వెంకటేష్‌కి అభిమానినయ్యా. వారం రోజుల ముందే టికెట్ బుక్ చేసుకుని అభిమానిగా చూశా. ఆయనతో రెండో సారి పనిచేసే అవకాశం దక్కింది. అనిల్ దగ్గర ఓ మ్యాజిక్ ఉంది. పూర్తి స్క్రిప్ట్ లేకుండా సినిమా తీయడానికి నేను ఒప్పుకోను. అలాంటి నన్ను కేవలం సన్నివేశాలు చెప్పి ఒప్పించాడు. సినిమా చాలా బాగా వచ్చింది' అని దిల్‌రాజు తెలిపారు. రాజేంద్రప్రసాద్, మెహరీన్, శిరీష్ తదితరులు పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

సమ్మర్ స్పెషల్ 118



'118' చిత్రంలో కళ్యాణ్‌రామ్

నందమూరి కళ్యాణ్ రామ్, నివేదా థామస్, షాలిని పాండే హీరోహీరోయిన్లుగా కె.వి.గుహన్ దర్శకుడిగా పరిచయం అవుతూ రూపొందిస్తున్న చిత్రం '118'. ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ పతాకంపై మహేష్ కోనేరు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా చిత్ర విడుదల తేదీని ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ, 'విడుదల చేసిన ఈ చిత్ర టైటిల్ లోగో, ఫస్ట్‌లుక్, టీజర్‌కి మంచి స్పందన లభించింది. సినిమా షూటింగ్ పూర్తయ్యింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. కళ్యాణ్ రామ్ పాత్ర ఎలా ఉంటుందనే దానితోపాటు, సినిమా ఏ జోనర్‌లో తెరకెక్కుతుందనే విషయాన్ని టీజర్‌లో చూపించాం. సీట్ ఎడ్జింగ్ థ్రిల్లర్ చిత్రమిది. కళ్యాణ్‌రామ్ ఇప్పటి వరకు చేయనటువంటి జోనర్. వెంకట్, అన్బరివు, రియల్ సతీష్ అద్భుతమైన యాక్షన్ పార్ట్ సినిమాలో చాలా కీలకంగా ఉంటుంది. బ్యూటిఫుల్ విజువల్స్‌తో ప్రేక్షకులని మెస్మరైజ్ చేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ గుహన్‌ని ఈ సినిమా ద్వారా దర్శకుడిగా పరిచయం చేయడం హ్యాపీగా ఉంది. మంచి కథ, కథనాలకు ఆయన దర్శకత్వం తోడవ్వడంతో సినిమా చాలా బాగా వచ్చింది. విజువల్‌గానూ ఆకట్టుకుంటుంది. శేఖర్ చంద్ర సంగీతం శ్రోతలని అలరిస్తుంది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సినిమాని మార్చి 1న సమ్మర్ స్పెషల్‌గా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తమ్మిరాజు.

ఓ జీవితాన్ని చూసిన ఫీలింగ్ కలిగింది

'ఎన్టీఆర్- కథానాయకుడు' బయోపిక్ గురించి కృష్ణ




నరేష్, కృష్ణ, విజయ నిర్మల

"ఎన్టీఆర్- కథానాయకుడు' సినిమా చూస్తుంటే ఓ జీవితాన్ని చూసిన ఫీలింగ్ కలిగింది. ఎన్టీఆర్ పాత్రలో బాలకృష్ణ వందశాతం కనిపించారు. పాత్రకు న్యాయం చేశారు. ఆయన వేసిన అన్ని గెటప్స్‌లోనూ బాగున్నారు. ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది' అని నటుడు కృష్ణ అన్నారు. నందమూరి తారక రామారావు జీవితం ఆధారంగా 'ఎన్టీఆర్' పేరుతో బయోపిక్ రూపొందిన విషయం విదితమే. ఎన్టీఆర్‌గా బాలకృష్ణ నటించిన ఈ చిత్రానికి క్రిష్ దర్శకత్వం వహించారు. ఎన్.బి.కె.ఫిల్మ్స్, వారాహి చలన చిత్రం, విబ్రి పతాకాలపై వసుంధరా దేవి, బాలకృష్ణ నిర్మించారు. బుధవారం ఈ సినిమా మొదటి భాగం 'ఎన్టీఆర్–కథానాయకుడు' విడుదలైంది. తాజాగా ఈ చిత్రాన్ని కృష్ణ, విజయ నిర్మల ప్రత్యేకంగా వీక్షించారు. ఈ సందర్భంగా కృష్ణ పై విధంగా స్పందించారు.

విజయ నిర్మల మాట్లాడుతూ, 'నా పన్నెండేండ్ల వయసులో ఎన్టీఆర్‌తో కలిసి 'పాండు రంగ మహత్యం' సినిమా చేశా. ఆ సినిమాలో కృష్ణుడిగా నటించా. ఈ బయోపిక్‌లో బాలకృష్ణని చూస్తుంటే స్వయంగా ఎన్టీఆర్‌నే చూస్తున్న ఫీలింగ్ కలిగింది. సినిమా చాలా బాగుంది' అని చెప్పారు. 'మా అమ్మగారు(విజయనిర్మల) తొలి సినిమా ఎన్టీఆర్‌తోనే నటించారు. 'ప్రేమ సంకెళ్లు' సినిమా టైమ్‌లో నేను ఆయన ఆశీర్వాదం తీసుకున్నా. ఈ బయోపిక్‌లో నేను నటించాలన్నప్పుడు చాలా సంతోషించా. అది కూడా బి.ఏ.సుబ్బరావు వేషం. ఆ సన్నివేశాల్లో యాక్ట్ చేస్తున్నప్పుడు థ్రిల్ ఫీలయ్యా. దర్శకుడు క్రిష్ ఈ సినిమాతో గ్రేట్ డైరెక్టర్ నుంచి లెజెండరీ దర్శకుడయ్యాడు. ఎన్టీఆర్ బయోపిక్ తీయడం అంత ఈజీ కాదు. కానీ క్రిష్ ఓ ప్లానింగ్‌తో, అనుకున్న సమయంలో సినిమాని పూర్తి చేశారు. ఆయనకు హ్యాట్సాఫ్. బాలయ్యతో మంచి అనుబంధం ఉంది. ఈ సినిమాతో ఆయన మహానటుడిగా అవతరించారు' అని నరేష్ చెప్పారు.

వెన్నుపోటుకి కౌంటర్



నారా చంద్రబాబు నాయుడు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జీవితం ఆధారంగా 'చంద్రోదయం' పేరుతో ఓ బయోపిక్‌ని రూపొందిస్తున్నారు. పి.వెంకటరమణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మోహన శ్రీజ సినిమాస్, శ్వేతార్క గణపతి ఎంటర్‌ప్రైజెస్ పతాకాలపై జి.జె.రాజేంద్ర నిర్మిస్తున్నారు. చంద్రబాబుగా వినోద్ నువ్వుల నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాలోని 'వెన్నుపోటు అని వాగే వాజెమ్మలు' అంటూ సాగే పాటని విడుదల చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'ఆకులు ఎన్ని కాల్చిన బొగ్గులు కావు బ్రదర్. జిత్తులమారి నక్కలు, తోడేళ్ళు ఎన్ని ఏకమైనా అడవికి రాజు, మృగరాజు నా అల్లుడే..' అనే లిరిక్‌తో సాగే పాటని విడుదల చేస్తున్నాం. 'ఎన్టీఆర్' బయోపిక్‌కి పోటీగా వర్మ 'లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాని తెరకెక్కిస్తూ పాటలను విడుదల చేస్తున్న నేపథ్యంలో, ఇప్పుడు వర్మకి, వెన్నుపోటు పాటకి కౌంటర్‌గా మేం ఈ పాటని రిలీజ్ చేశాం. చంద్రబాబు నాయుడు దేశ చరిత్రలోనే ఆదర్శవంతమైన నాయకుడు. ఆయన జీవితం అందరికీ తెలియజెప్పాలనే సంకల్పంతో బాబుగారి బయోపిక్‌ని తెరమీదకు తీసుకొస్తున్నాం. చిత్రీకరణ పూర్తి చేశాం. ఓ సామాన్య కుటుంబంలో పుట్టి అసామాన్యమైన స్థాయికి చేరిన ఆయన జీవితాన్ని అత్యద్భుతంగా తెరకెక్కిస్తున్నాం. నారా వారి పల్లె, హైదరాబాద్, అమరావతి, సింగపూర్ లాంటి లొకేషన్లలో సినిమా షూటింగ్ చేశాం. మహానాయకుడి బయోపిక్‌ని మేం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నందుకు గర్వంగా ఉంది. సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు. శివానీ చౌదరి, మౌనిక, భాస్కర్ నటిస్తోన్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ ముకుందన్, సంగీతం: రాజ్ కిరణ్.

పిల్లల పుస్తక రూపంలో డిప్రెషన్ అనుభవాలు..

నాలుగేండ్ల క్రితం డిప్రెషన్ వల్ల తన జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని, ఆ డిప్రెషన్ నుంచి బయట పడేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించడంతో నేడు సాధారణ స్థితికి రాగలిగాను' అని అంటోంది దీపికా పదుకొనె. దీపికా డిప్రెషన్ అనుభవాలు ఇకపై పిల్లల పుస్తక రూపంలో అందుబాటులోకి రానున్నాయి. 'ది డాట్ దట్ వెంట్ ఫర్ ఏ వాక్' పేరుతో లక్ష్మి నంబియార్, రీమా గుప్తా, శరదా అక్కినేని రాసిన ఈ పుస్తకాన్ని రాశారు.

ఈ సందర్భంగా దీపికా మాట్లాడుతూ, 'ఇటీవల డిప్రెషన్ ఎదుర్కొంటున్న మహిళలు పెరిగారు. దీనిపై ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమ అనుభవాలను పంచుకోవాలి. ఎదుగుతున్న పిల్లలకి మన అనుభవాలు ఎంతో ఉపయోగపడతాయి. రాబోయే పిల్లల పుస్తకంలో దేశ వ్యాప్తంగా దాదాపు 51 మంది మహిళలు పిల్లలకు మహిళా శక్తి గురించి తెలియజేసిన కాన్సెప్ట్‌లు ప్రచురితం కానున్నాయి' అని తెలిపింది. దీపికా ప్రస్తుతం మేఘనా గుల్జర్ దర్శకత్వంలో యాసిడ్ దాడి బాధితురాలు లక్ష్మి అగర్వాల్ జీవితం ఆధారంగా రూపొందబోయే సినిమాతో పాటు '83'లో కపిల్‌దేవ్ భార్య రోమీ భాటియా పాత్రలో నటించనుంది. ఇందులో రీల్ వైఫ్‌గా రణ్‌వీర్‌సింగ్ సరసన నటించడం విశేషం.



దీపికా పదుకొనె


డిఫరెంట్ లవ్ స్టోరీ



నెమలి అనిల్, సుబాంగి పంథ్, విరాజ్

నెమలి అనిల్, సుబాంగి పంథ్ జంటగా ఎన్.మహేశ్వర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రావే నా చెలియా'. నెమలి సురేష్ సమర్పణలో సూర్య చంద్ర ప్రొడక్షన్స్ పతాకంపై నెమలి అనిల్, నెమలి శ్రమణ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర లోగో లాంచ్ శుక్రవారం జరిగింది. అతిథిగా విచ్చేసిన నిర్మాత రాజ్ కందుకూరి లోగోను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, 'చిన్న సినిమాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఆ జాబితాలో ఈ సినిమా చేరింది. చిత్ర టైటిల్ ఆకట్టుకునేలా ఉంది. కంటెంట్ కూడా బాగుంటుందని నమ్ముతున్నా. కంటెంట్ బాగుంటే సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది' అని అన్నారు. 'హీరోగానే కాదు, మా బ్యానర్‌కిది మొదటి సినిమా. టీమ్ అంతా కష్టపడి, ప్రాణం పెట్టి సినిమా చేశాం. చిన్న చిత్రమైనా మంచి కంటెంట్‌తో రూపొందించాం. ఆదరిస్తారని ఆశిస్తున్నా' అని హీరో అనిల్ తెలిపారు. సమర్పకుడు నెమలి సురేష్ చెబుతూ, 'సబ్జెక్ట్ బాగుంటే ఆడియెన్స్ ఆదరిస్తారని తెలుసు. అందుకే మంచి కథని ఎంచుకున్నాం. అన్ని వర్గాలకు నచ్చుతుందని భావిస్తున్నాం' అని చెప్పారు. 'విరాజ్ వల్ల సినిమా మొదలైంది. నిర్మాతలు, హీరో నన్ను నమ్మి సపోర్ట్ చేశారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయనని చెబుతున్నా. ఈ సినిమాకి కెమెరా వర్క్ చాలా బాగా వచ్చింది. డిఫరెంట్ లవ్ స్టోరీతో వస్తున్నాం. ఆదరించాలని కోరుకుంటున్నాం' అని దర్శకుడు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రవణ్, రవి, ఎన్.విరాజ్, విజయ్ దగ్గుబాటి, ఎం.ఎం.కుమార్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బెస్ట్ ఎంటర్‌టైనర్‌గా ఉండాలి



రణ్‌వీర్ సింగ్

'నేనొక బెస్ట్ ఎంటర్‌టైనర్‌గా ఉండాలనుకుంటున్నా. ఆడియెన్స్‌కి కావాల్సిన వినోదాన్ని పంచడమే నా ఎజెండా' అని అంటున్నారు రణ్‌వీర్ సింగ్. గతేడాది 'పద్మావత్', 'సింబా' చిత్రాలతో ఆకట్టుకున్నాడు. ప్రస్తుతం 'గల్లీబాయ్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ నేపథ్యంలో రణ్‌వీర్ మాట్లాడుతూ, 'ప్రస్తుతం అందరి దృష్టి డబ్బు చుట్టూ తిరుగుతుంది. ఆ విషయాలు విన్నప్పుడు ఏం చేయాలో అర్థం కాక తల గోక్కుంటాను. రకరకాల ఆలోచనలు వెంటాడుతుంటాయి. వాటి నుంచి నన్ను నేను రక్షించుకోగలగాలి. ఇప్పటి వరకు ఎలా అయితే పని చేశానో, ముున్ముందు కూడా అదే విధంగా వర్క్ చేయాలనుకుంటున్నా. సాధ్యమైనంత వరకు మరింత కష్టపడి ఆడియెన్స్‌కి బెస్ట్ ఎంటర్‌టైనర్‌గా ఉండాలనుకుంటున్నా. ఈ క్రమంలో నన్ను నేను మెరుగు పర్చుకుంటాను. చేసే ప్రతి సినిమా నిజాయితీగా చేస్తాను. నాకు లెక్కలు ముఖ్యం కాదు. సినిమా అంటే ఇష్టం. ఆడియెన్స్‌కి కావాల్సిన వినోదం పంచడమే నా అంతిమ లక్ష్యం. అదే నా సింగిల్ ఏజెండా' అని తెలిపారు. జోయా అక్తర్ దర్శకత్వంలో రూపొందిన 'గల్లీబాయ్స్' చిత్రంలో అలియా భట్ హీరోయిన్‌గా నటించింది. ఇందులో రణ్‌వీర్ సింగ్ గాయకుడు కావాలనుకుంటాడు. అందుకోసం ఏం చేశాడనేది తెరపై చూడాల్సిందే. ఈ సినిమా ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

విజయ్ దేవరకొండ సరసన..!



కేథరిన్

రెండేండ్ల క్రితం 'గౌతమ్ నందా', 'నేనే రాజు నేనే మంత్రి' చిత్రాలతో కేథరిన్ తెలుగు ఆడియెన్స్‌ని అలరించింది. ఎక్కువగా తమిళ చిత్రాలకే ప్రయారిటీ ఇస్తున్న ఆమె ఈ ఏడాది తెలుగు సినిమాల్లో నటించేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఇప్పటికే సంతోష్ శ్రీనివాస్ దర్శకత్వంలో రవితేజ నటించే చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్టు సమాచారం. తాజాగా విజయ్ దేవరకొండ సరసన ఓ సినిమాలోనూ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. 'మళ్ళీ మళ్ళీ ఇది రాని రోజు' ఫేమ్ క్రాంతి మాధవ్ దర్శకత్వంలో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేస్తున్నారు. ఇందులో ముగ్గురు కథానాయికలకు స్కోప్ ఉంది. ఇప్పటికే రాశీఖన్నా, ఐశ్వర్య రాజేష్, ఇజబెల్లెలను ఎంపిక చేశారు. తాజాగా కేథరిన్‌ని కూడా అనుకుంటున్నారట. మరి ఇప్పటికే ఎంపికైనా ముగ్గురి కథానాయికల్లో ఒకరిని రీప్లేస్ చేస్తారా? లేక నాలుగవ కథానాయికగా కేథరిన్‌ని తీసుకుంటారా అనేది ప్రస్తుతానికి సస్పెన్స్. ఇదిలా ఉంటే కేథరిన్ ఇప్పుడు మూడు తమిళ ప్రాజెక్ట్‌లతోపాటు ఓ మలయాళ చిత్రంతో ఫుల్ బిజీగా ఉంది.

ఏడాది చివర్లో మున్నాభాయ్ 3 షురూ..



రాజ్ కుమార్ హిరానీ

రాజ్ కుమార్ హిరానీ దర్శకత్వంలో రూపొందించిన 'మున్నాభాయ్: ఎంబీబీఎస్', 'లగే రహో మున్నాభాయ్' చిత్రాలు ఎంతటి ఘన విజయాన్ని సాధించాయో తెలిసిందే. సంజయ్ దత్, అర్షద్ వార్సి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సెటైరికల్ కామెడీ డ్రామా చిత్రాలు రెండూ వంద కోట్లకుపైగా కలెక్షన్లని రాబట్టాయి. ఈ చిత్రానికి రెండో సీక్వెల్ రాబోతుందంటూ చాలా రోజులుగా సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. తాజాగా మరోసారి ఈ వార్త తెరపైకి వచ్చింది. ఈ ఏడాది 'మున్నాభాయ్ 3' కచ్చితంగా ఉండబోతుందట. 'సినిమాపై భారీ అంచనాలున్నాయి. కాబట్టి జాగ్రత్తగా ప్లాన్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం రాజ్ కుమార్ హిరానీ స్క్రిప్ట్‌ని ఫైనల్ చేసే పనిలో ఉన్నారు. ఆయనతో మరోసారి చర్చించాల్సి ఉంది. సినిమా ఎప్పుడు ప్రారంభమవుతుందని కరెక్ట్‌గా చెప్పలేం. కానీ అన్నీ కుదిరితే ఈ ఏడాది చివర్లోనే పట్టాలెక్కే అవకాశం ఉంది. ఇది మా అందరికీ డ్రీమ్ ప్రాజెక్ట్' అని అర్షద్ వార్సి తెలిపారు. మూడో చిత్రంలోనూ సంజయ్ దత్, అర్షద్ వార్సి కలిసి నటించనున్నారు. ప్రస్తుతం సంజయ్ దత్ 'టార్బాజ్', 'కళంక్', 'పానిపట్', 'శంషేర్', 'సడక్ 2', 'ప్రస్థానం' రీమేక్‌లో నటిస్తూ బిజీగా ఉన్నారు. అర్షద్ వార్సి 'ఫ్రాడ్ సైయ్యాన్', 'టోటల్ దమాల్' చిత్రాల్లో నటిస్తున్నాడు.

నానా పటేకర్‌తోనే నట సమ్రాట్ రీమేక్..!



కృష్ణవంశీ

తెలుగు చిత్ర పరిశ్రమలో క్రియేటివ్ డైరెక్టర్‌గా పేరుతెచ్చుకున్న కృష్ణవంశీకి సక్సెస్ దూరమై చాలా రోజులవుతుంది. 2017లో ఆయన రూపొందించిన 'నక్షత్రం' బాక్సాఫీసు వద్ద ఘోరంగా డిజాస్టర్ అయ్యింది. ఈ నేపథ్యంలో డైరెక్టర్‌గా తానేంటో నిరూపించుకునే ప్రయత్నంలో కృష్ణ వంశీ ఉన్నట్టు సమాచారం. దీని కోసమై ఓ రీమేక్ సినిమాని తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. మరాఠీ సూపర్ హిట్ 'నటసమ్రాట్' చిత్రాన్ని రీమేక్ చేయబోతున్నారని తెలుస్తోంది. మహేష్ మంజ్రేకర్ దర్శకత్వంలో నానా పటేకర్ ప్రధాన పాత్రలో నటించిన ఈ డ్రామా చిత్రం 2016లో విడుదలై ఘన విజయం సాధించింది. ఏకంగా రూ.50 కోట్లు వసూలు చేసింది. ఈ సినిమాని తెలుగులో కృష్ణవంశీ రీమేక్ చేయబోతున్నారు. ఇందులో మొదట ప్రకాష్‌రాజ్‌ని అనుకున్నారు. కానీ తాజాగా నానా పటేకర్‌నే తీసుకోవాలని భావిస్తున్నారు. ప్రస్తుతం కథా చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తున్నాయి. నానా పటేకర్‌ని ఎంపిక చేయడం వల్ల మార్కెట్ పరంగా తెలుగుతోపాటు హిందీలోనూ వర్కౌట్ అవుతుందనే ఆలోచనలో కృష్ణవంశీ ఉన్నారట.

సెన్సెక్స్ ▼96.66	నిఫ్టీ ▼27	డాలరుకు రూపాయి విలువ	బంగారం(10గ్రా)	వెండి (కేజీ)	కోడిగుడ్లు (వందకి)
36,009	10,794	70.50	రూ. 31,943	రూ. 39,259	హైదరాబాద్ 433, ఒక్కగుడ్డుకు 4.70, వరంగల్ 433, విజయవాడ 441, చెన్నై 455, ముంబయి 484

జీఎంఆర్ ఎయిర్‌పోర్టుకు అవార్డు..



హైదరాబాద్ : జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (జీహెచ్ఐఎఎల్)కు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో మరో గుర్తింపు లభించింది. ఐసీఎస్ఐ ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన సీఎస్ఆర్ అవార్డును ముంబయిలో జీహెచ్ఐఎఎల్ సీఎఫ్ఓ రాజేష్ ఇండియా ప్రొఫెషనల్ ఫోరమ్ ప్రెసిడెంట్ మోహన్ కౌల్, సెబీ మాజీ ఛైర్మన్ జీఎన్ బజ్‌పాల్ అందజేశారు.

లివ్‌ఫాస్ట్ నుంచి కొత్త ఇన్వర్టర్లు

- తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల



హైదరాబాద్: ఎస్ఏఆర్ గ్రూపునకు చెందిన లివ్‌ఫాస్ట్ మార్కెట్లోకి 25 శాతం వేగవంతమైన చార్జింగ్, 25 శాతం అదనపు బ్యాటరీ బ్యాకప్‌తో కూడిన ఇన్వర్టర్ శ్రేణిని మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ గ్రూపు వాహన బ్యాటరీలు, ఇన్వర్టర్లు, ఇన్వర్టర్ బ్యాటరీల వ్యాపారంలో ఉంది. క్రితం ఆర్థిక సంవత్సరంలో రూ.1000 కోట్ల టర్నోవర్ నమోదు చేశామని లివ్‌ఫాస్ట్ సీఈఓ గురుప్రీత్ సింగ్ బాటియా తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ లివ్‌ఫాస్ట్ బ్యాటరీలకు ప్రముఖ క్రికెటర్ ధోనీని ప్రచారకర్తగా నియమించుకున్నామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రెట్టింపు రెవెన్యూ రూ.2,000 కోట్లు అంచనా వేస్తున్నామన్నారు. ఇన్వర్టర్ల విభాగంలో వచ్చే 15 మాసాల్లో 15 శాతం మార్కెట్ వాటా అంచనా వేస్తున్నామన్నారు. ప్రస్తుత ఏడాది ముగింపు నాటికి దేశ వ్యాప్తంగా 25,000 అవుట్‌లెట్లకు విస్తరించనున్నామన్నారు. ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 22 మంది డిస్ట్రిబ్యూటర్లు, 3,000 మంది డీలర్లకు విస్తరించనున్నామని తెలిపారు. తాము ప్రస్తుతం 18 మోడళ్ల బ్యాటరీలను తయారు చేస్తున్నామన్నారు. దేశంలో రూ.55వేల కోట్ల విలువ చేసే ఇన్వర్టర్ల బ్యాటరీల వ్యాపారం జరుగుతుందన్నారు.

పసిడి పరుగుకు బ్రేక్

న్యూఢిల్లీ : నాలుగు రోజులుగా వరుసగా పెరిగిన బంగారం ధరకు శుక్రవారం బ్రేక్ పడింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.40 తగ్గి వరుసగా రూ.33,030, రూ.32,880గా నమోదయ్యింది. ఆభరణాల వర్తకులు, వినియోగదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో బంగారం ధర తగ్గినట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి. కిలో వెండిపై రూ.60 తగ్గి రూ.40,450గా పలికింది.

పారిశ్రామికోత్పత్తి ఢమాల్

నవంబర్‌లో పడకేసిన తయారీ రంగం

- సీఎస్ఓ గణాంకాల వెల్లడి

19 నెలల కనిష్టానికి పతనం



న్యూఢిల్లీ : దేశంలో కొనుగోలు డిమాండ్ పడిపోయి పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) నేల చూపులు చేస్తోంది. ముఖ్యంగా తయారీ రంగంలో స్తబ్దత వల్ల గతేడాది నవంబర్‌లో ఐఐపీ వృద్ధి 0.5 శాతానికి క్షీణించింది. దీంతో పారిశ్రామిక ఉత్పత్తి 19 నెలల కనిష్టానికి పడిపోయినట్లయ్యింది. శుక్రవారం కేంద్ర గణాంకాల శాఖ (సీఎస్ఓ) నవంబర్ ఐఐపీ రిపోర్టును వెల్లడించింది. 2017 ఇదే నవంబర్‌లో ఏకంగా 8.5 శాతం వృద్ధి చోటు చేసుకుంది. ఇది వరకు జూన్ 2017లో అత్యల్పంగా 0.3 శాతం పెరుగుదల నమోదయ్యింది. ఆ తర్వాత ఈ స్థాయిలో క్రితం నవంబర్‌లోనే పడిపోయింది. 2018 అక్టోబర్ ఐఐపీ సూచీని 8.1 శాతం నుంచి 8.4 శాతానికి కేంద్ర గణంకాల శాఖ సవరించింది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 3.2 శాతం పెరుగుదల నమోదయ్యింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో 77.63 శాతం వాటా కలిగిన తయారీ రంగం క్రితం నవంబర్‌లో కేవలం 0.4 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. 2017 ఇదే మాసంలో ఈ రంగం 10.4 శాతం వృద్ధిని సాధించింది. ఈ నెలలో గనుల రంగం 1.4 శాతం పెర్గగా, 2018 నవంబర్‌లో 2.7 శాతం వృద్ధిని కనబర్చింది. విద్యుత్ రంగం ఉత్పత్తి 5.1 శాతానికి పెరిగింది. 2017 ఇదే మాసంలో విద్యుత్ రంగం 3.9 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఈ మాసంలో కాపిటల్ గూడ్స్ 3.7 శాతంగా ఉండగా, క్రితం నవంబర్‌లో 3.4 శాతానికి పడిపోయింది.

కన్సూమర్ డ్యూరబుల్స్ సూచీ 2017 నవంబర్‌లో 3.1 శాతం వృద్ధిని సాధించగా, క్రితం నవంబర్‌లో ఏకంగా 0.9 శాతం పెరుగుదలతో సరిపెట్టుకుంది. ఇదే సమయంలో కన్సూమర్ నాన్ డ్యూరబుల్స్ పెరుగుదల 0.6 శాతానికి క్షీణించింది. 2017 ఇదే మాసంలో ఈ రంగం ఉత్పత్తి ఏకంగా 23.7 శాతం వృద్ధిని సాధించింది. 2018 నవంబర్‌లో తయారీ రంగంలోని 23 పరిశ్రమల గ్రూపుల్లో 10 సూచీలు మాత్రమే సానుకూలంగా ఉండగా, మిగితా విభాగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. క్రితం నవంబర్‌లో ప్రాథమిక వస్తువులు 3.2 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ (-)4.5 శాతం, మౌలిక వసతులు, నిర్మాణ రంగం 5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. భారత్ సులభ వ్యాపారంలో దూసుకుపోతుందని, మేక్ ఇన్ ఇండియా ఫలితాలు అద్భుతంగా ఉన్నాయని పదే పదే చెప్పుకుంటున్న మోడీ సర్కార్‌కు నవంబర్ మాసం పారిశ్రామికోత్పత్తి గణంకాలు చెంపపెట్టులా నమోదయ్యాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇన్ఫీ లాభాల్లో 30% పతనం

- రూ.8,260 కోట్ల షేర్ల బైబ్యాక్



ముంబయి : దేశంలోనే రెండో అతిపెద్ద ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ ఆర్థిక ఫలితాలు నిరాశ పర్చాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఇన్ఫీ లాభాలు 3,610 కోట్లకు పడిపోయాయి. 2017-18 ఇదే త్రైమాసికంలో రూ.5,129 కోట్ల లాభాలు సాధించింది. దీంతో పోల్చితే క్రితం క్యూ3 లాభాల్లో 30 శాతం పతనం చోటు చేసుకుంది. బెంగళూరు కేంద్రంగా పని చేస్తున్న ఇన్ఫీ క్రితం క్యూ3లో 20.3 శాతం వృద్ధితో రూ.21,400 కోట్ల రెవెన్యూ సాధించింది. ఇంతక్రితం క్యూ3లో రూ.17,794 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. క్రితం డిసెంబర్ త్రైమాసికంలో కొత్తగా 18,773 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు వెల్లడించింది.

ప్రత్యేక డివిడెండ్..

ప్రతీ షేర్‌పై ప్రత్యేక డివిడెండ్ కింద రూ.4 చెల్లించనున్నట్లు ఇన్ఫోసిస్ వెల్లడించింది. దీంతో ఇన్వెస్టర్లకు రూ.2,107 కోట్లు అందించనుంది. జనవరి 25న దీనికి కచ్చిత తేదిగా నిర్ణయించగా, 28వ తేదిన చెల్లింపులు చేయనున్నట్టు పేర్కొంది. అదే విధంగా రూ.8,260 కోట్ల విలువ చేసే ఈక్విటీలను బైబ్యాక్ చేయనున్నట్లు ప్రకటించింది. ప్రతీ షేర్ ధరను రూ.800గా నిర్ణయించింది. 2018-19 రెవెన్యూ గైడ్‌లైన్స్‌ను 8.5-9 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. స్థిర ధరల వద్ద క్యూ3లో తాము రెండంకెల వృద్ధిని నమోదు చేశామని ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండి సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. డిజిటల్ బిజినెస్‌లో మరో పటిష్టమైన వృద్ధి సాధించామన్నారు. ఈ విభాగంలో 33.1 శాతం వృద్ధితో 1.57 బిలియన్ డాలర్ల రెవెన్యూ నమోదయ్యిందని.. 2019లో విశ్వాసంతో ప్రవేశించడానికి దోహదం చేస్తుందన్నారు. క్రితం త్రైమాసికంలో కొత్తగా 101 మంది ఖాతాదారులను పొందింది. దీంతో తమ ఆక్టివ్ క్లయింట్ల సంఖ్య 1,251గా ఉందని వెల్లడించింది. కాగా వచ్చే ఏప్రిల్ ఒక్కటో తేది నుంచి కిరణ్ మజుందర్ షాను తిరిగి ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా తీసుకోవడానికి ఆ కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. శుక్రవారం బీఎస్ఈలో ఇన్ఫోసిస్ షేర్ 0.58 శాతం పెరిగి రూ.683.70 వద్ద ముగిసింది.

ఎన్ఎస్ఈ చైర్మెన్ రాజీనామా

- మాక్సిస్-ఎయిర్‌సెల్ కేసు ఎఫెక్ట్



ముంబయి : నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈ) చైర్మన్ అశోక్ చావ్లా రాజీనామా చేశారు. ఎయిర్‌సెల్-మాక్సిస్ కేసులో ఆయనకు పాత్ర ఉందని ఈ మధ్య కాలంలో వచ్చిన రిపోర్టులతో వైదొలగాల్సి వచ్చిందని తెలుస్తోంది. కాగా చావ్లా రాజీనామా తక్షణమే అమల్లోకి వచ్చినట్లు ఎన్ఎస్ఈ శుక్రవారం వెల్లడించింది. ఆయనపై వచ్చిన ఆరోపణలపై సెబీ కూడా విచారణ జరపనుంది. ఎయిర్‌సెల్- మాక్సిస్ కేసులో చావ్లాతో పాటు మరో నలుగురు అధికారులను విచారించడానికి అనుమతి నివ్వాలని సీబీఐ శుక్రవారం ఢిల్లీలోని స్పెషల్ కోర్టును కోరింది. ఆర్థిక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎవరైనా స్టాక్ ఎక్స్ఛేంజీ నిర్వహణలో ఉండకూడదని సెబీ స్టాక్ ఎక్సేజీ అండ్ క్లియరింగ్ కార్పొరేషన్స్ (ఎస్ఈసీసీ) నిబంధనలు పేర్కొంటున్నాయి. చావ్లాపై రెండు ఫిర్యాదులు రావడంతో సెబీ కూడా ప్రాథమిక విచారణ ప్రారంభించినట్టు తెలిపింది. ఈ నేపథ్యంలోనే చావ్లా వైదొలిగారని తెలుస్తోంది. అదే విధంగా ఈ కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ కేంద్ర మంత్రి పి చిదంబరం, ఆయన కుమారుడు కార్తిని ఫిబ్రవరి 1 వరకు అరెస్ట్ చేయకుండా స్పెషల్ కోర్టు ఉత్తర్వులిచ్చింది. 2006లో చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నపుడు మ్యాక్సిస్ అనుబంధ సంస్థ గ్లోబల్ కమ్యూనికేషన్స్‌కి రూ.3,680 కోట్ల మేర ఎఫ్ఐపీబీ అనుమతులు జారీ చేసింది. రూ.600 కోట్లు దాటితే కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీనే అనుమతులివ్వాలి. చిదంబరం నిబంధనలు ఉల్లంఘించి ఎలా అనుమతులిచ్చారనే విషయమై దర్యాప్తు సంస్థలు విచారిస్తున్న విషయం తెలిసిందే. మాక్సిస్‌కు అనుమతులిచ్చిన సమయంలో చావ్లా ఆర్థిక వ్యవహారాల అదనపు కార్యదర్శితో పాటు, ఎఫ్ఐపీబీలో సభ్యులుగా ఉన్నారు.

మార్కెట్లలో తీవ్ర ఊగిసలాట

- సెన్సెక్స్ 96 పాయింట్ల పతనం

ముంబయి : మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడంతో వరుసగా రెండో రోజూ దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలు చవి చూశాయి. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ తొలుత 36,192 గరిష్ట స్థాయి వద్ద బలంగానే ప్రారంభమైనప్పటికీ అంతర్జాతీయ బలహీన పరిణామాల నేపథ్యంలో ఎక్కువ సమయం నిలువలేకపోయింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం, డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో పలు కార్పొరేట్ కంపెనీల ఫలితాలు మదుపర్లను మురిపించలేకపోవడం తదితర పరిణామాల మధ్య మార్కెట్లు తీవ్ర ఊగిసలాటకు గురైయ్యాయి. తుదకు బీఎస్ఈ సెన్సెక్స్ 96.66 పాయింట్లు లేదా 0.27 శాతం తగ్గి 36,009.84కు పడిపోయింది. ఇంట్రా ట్రేడింగ్‌లో 36,214-35,840 మధ్య కదలాడింది. సెన్సెక్స్-30లో ఇండుస్‌ఇండ్ బ్యాంకు, టాటా మోటార్స్, టసీఎస్, యస్ బ్యాంకు, ఎల్అండ్‌టీ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఐటీసీ, ఓఎన్‌జీసీ, వేదాంత, ఇన్ఫోసిస్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ సూచీలు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. రంగాల వారిగా నిఫ్టీలో ఎఫ్ఎంసీజీ, రియాల్టీ సూచీలు అత్యధికంగా 1.43 శాతం మేర నష్టపోయాయి. బీఎస్ఈలో మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు వరుసగా 0.13 వాతం, 0.19 శాతం చొప్పున నష్టపోయాయి.

త్వరలో కొత్త ఐఫోన్ మోడల్స్..!

వాషింగ్టన్: ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఆపిల్ ప్రస్తుత ఏడాదిలో మూడు కొత్త ఐఫోన్లను ఆవిష్కరించనుందని వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ నివేదికలో వెల్లడించింది. కొత్తగా విడుదలయ్యే మోడల్స్‌లో ఐఫోన్ ఎక్స్ఆర్ మోడల్‌కు తర్వాతి వర్షెన్ కూడా ఉండనున్నట్లు తెలిపింది. అలాగే కొత్త మోడల్ ఫోన్లలో సరికొత్త కెమెరా ఫీచర్లను కూడా చేర్చనున్నట్లు పేర్కొంది. దీనిపై ఆపిల్ అధికారికంగా స్పందించలేదు. చైనాలో ఐఫోన్లకు డిమాండ్ తగ్గడంతో ఇటీవల యాపిల్ షేర్లు అత్యధికంగా పది శాతం పడిపోయాయి.

సింగరేణి.. అద్భుత ప్రగతి...

- గడిచిన ఐదేండ్లలో రెట్టింపునకు పైగా వృద్ధి
- బొగ్గు రవాణాలో 122 శాతం, ఓ.బి. తొలగింపులో 257 శాతం
- అమ్మకాల్లో 132 శాతం, లాభాల్లో 314 శాతం వృద్ధి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్రంలో అద్భుత ప్రగతిని సాధిస్తూ పురోగమిస్తున్న ప్రభుత్వ సంస్థల్లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ అగ్రభాగాన నిలిచిందని ఆ సంస్థ తెలిపింది. పలు అనుమానాలను పటాపంచలు చేస్తూ గత ఐదేండ్లలో అనూహ్యమైన ప్రగతిని, వృద్ధిరేటును సాధించిందని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం ఆ సంస్థ ఒక ప్రకటన విడుదల చేసింది.

తెలంగాణ రాక పూర్వం ఐదేండ్ల కాలంలో అనగా (2009-14)లో సాధించిన బొగ్గు రవాణా, ఓ.బి. తొలగింపు, అమ్మకాలు, నికర లాభాలతో పోలిస్తే రాష్ట్ర ఆవిర్భవం తర్వాత గడిచిన ఐదేండ్ల (2014-19) కాలంలో సింగరేణి సాధించిన వృద్ధి ఎంతో ఎక్కువని పేర్కొంది. దేశంలో 8 సబ్సిడరీ కంపెనీలు గల కోలిండియా సైతం గత ఐదేండ్లలో ఇంత వద్ధిని నమోదు చేయలేదని వివరించింది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందు ఐదేండ్ల కాలంలో బొగ్గు రవాణాలో కేవలం 90 లక్షల టన్నుల వద్ధిని సాధించిన సింగరేణి, ఆ తర్వాత గడచిన ఐదేండ్లలో 200 లక్షల టన్నుల వృద్ధిని సాధించింది. అంటే 122 శాతం వృద్ధి అన్నమాట. ఓవర్ బర్డెన్ తొలగింపులో 2009 నుంచి 2014 మధ్య కాలంలో కేవలం 70 మిలియను క్యూబిక్ మీటర్ల వద్ధిని మాత్రమే సాధించిన కంపెనీ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గడచిన ఐదేండ్లలో 250 మిలియను క్యూబిక్ మీటర్ల వద్ధిని నమోదుచేసింది. ఈ వృద్ధి 257 శాతంగా నమోదైందని తెలిపింది. మరోవైపు తెలంగాణ రాకముందు ఐదేండ్ల అమ్మకాలలో రూ. 5,600 కోట్ల వృద్ధిని నమోదు చేసిన కంపెనీ, రాష్ట్రావిర్భావం తర్వాత 2014-19 కాలంలో రూ.13వేల కోట్ల వృద్ధిని సాధించడం విశేషం. ఇది 132 శాతంగా నమోదైంది. అలాగే ట్యాక్సులు చెల్లించిన తర్వాత నికరలాభం కూడా భారీగా పెరిగింది. 2009-2014 మధ్య కాలంలో నికర లాభాల్లో రూ.290 కోట్ల వద్ధిని నమోదు చేసిన కంపెనీ, గడచిన ఐదేండ్ల కాలంలో రూ.1,200 కోట్ల వృద్ధిని (314 శాతం) నమోదు చేసింది.

క్ర.సం.	అంశము	తెలంగాణ రాష్ట్రపూర్వం (2013-14 వరకు సాధించిన వృద్ధి)	తెలంగాణ వచ్చిన తర్వాత (ప్రస్తుత సంవత్సరం 2018-19 సాధించిన వృద్ధి)	వృద్ధి (దాదాపుగా)
1	బొగ్గు రవాణా	479 లక్షల టన్నులు	680 లక్షల టన్నులు	200 లక్షల టన్నులు
2	ఓ.బి. తొలగింపు	169 మి. క్యూబిక్ మీటర్లు	420 మి. క్యూబిక్ మీటర్లు	250 మి. క్యూబిక్ మీటర్లు
3	అమ్మకాలు	రూ. 11,928 కోట్లు	రూ. 25,100 కోట్లు	రూ. 13,000 కోట్లు
4	నికర లాభాలు	రూ. 419 కోట్లు	రూ. 1,600 కోట్లు	రూ. 1,200 కోట్లు

క్ర.సం.	అంశము	తెలంగాణ రాష్ట్రపూర్వం (5 ఏళ్ల కాలంలో సాధించిన వృద్ధి) (2009 - 14)	తెలంగాణ వచ్చిన తర్వాత (5 ఏళ్ల కాలంలో సాధించిన వృద్ధి) (2014 - 19)	వృద్ధి శాతం
1	బొగ్గు రవాణా	90 లక్షల టన్నులు	200 లక్షల టన్నులు	122 శాతం
2	ఓ.బి. తొలగింపు	70 మిలియన్ క్యూబిక్ మీటర్లు	250 మిలియన్ క్యూబిక్ మీటర్లు	257 శాతం
3	అమ్మకాలు	5,600 కోట్ల రూపాయలు	13,000 కోట్ల రూపాయలు	132 శాతం
4	నికర లాభాలు	290 కోట్ల రూపాయలు	1,200 కోట్ల రూపాయలు	314 శాతం

రాంకీకే మహానగర పారిశుద్ధ్య బాధ్యత

ముందుగా రవాణా బాధ్యతలు అప్పగించేందుకు కసరత్తు

- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్లలో అమలుకు సన్నాహాలు
- కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్‌స్టేషన్ ఇచ్చేందుకు చర్యలు
- రాంకీ ఒప్పందం అమలుకు సర్కార్ నిర్ణయం



నవతెలంగాణ- సిటీబ్యూరో

గ్రేటర్ హైదరాబాద్‌లో పారిశుధ్య నిర్వహణ బాధ్యత రాంకీ సంస్థకు అప్పగించేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే చెత్త సేకరణకు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు. అయితే పారిశుధ్య విభాగాన్ని రాంకీకి అప్పగించడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ విషయంపై గతంలో ఆందోళనలు కూడా జరిగాయి. అందుకే ఒకేసారి కాకుండా ఒక్కొక్కటిగా అప్పగిస్తూ రాంకీ ఒప్పందాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే ముందుగా చెత్త రవాణా విభాగాన్ని రాంకీకి అప్పగించడానికి రంగం సిద్ధం చేశారు. ఇప్పటికే కాప్రా సర్కిల్‌లో రాంకీ సంస్థకు చెందిన 37 కాంపాక్టర్లు (చెత్త రవాణా చేసే వాహనాలు) జీహెచ్ఎంసీలో నడుస్తున్నాయి. కూకట్‌పల్లి జోన్‌లోని కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను అప్పగించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అందులో భాగంగానే జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్, రాంకీ సంస్థ ఎండీ గౌతంరెడ్డి, ఇతర అధికారులు శుక్రవారం కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పారిశుధ్యాన్ని నిర్వహించడానికి 'రాంకీ ఎన్వీరో' సంస్థతో 2009లో అప్పటి ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కాంట్రాక్టు 25 ఏండ్లపాటు కొనసాగుతుంది. ఈ ఒప్పందంలో గ్రేటర్ పరిధిలోని 361 ఎకరాల స్థలంతో పాటు, మూడు డంపింగ్ యార్డులు, కార్పొరేషన్ సొంత వాహనాలను రాంకీకి ధారాదత్తం చేయాలని నిర్ణయించారు. ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.1475 చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంలో చెత్తను ఇంటి నుంచి ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలించడానికి 40 శాతం, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నుంచి జవహర్‌నగర్ డంప్ యార్డుకు తరలించేందుకు 20 శాతం, తరలించిన చెత్తను ప్రాసెస్ చేయడానికి మిగిలిన 40 శాతం డబ్బులివ్వాలని నిర్ణయించారు. ప్రతి ఏడాదీ ఐదు శాతం పెంపు ఉంటుంది.

ఒప్పందం ప్రకారమే...

ఒప్పందంలో భాగంగానే జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థలు ముందుకెళ్తున్నాయి. ప్రభుత్వం సైతం అందుకు సుముఖంగానే ఉందని జీహెచ్ఎంసీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సైతం ఇవ్వడానికి జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగానే అధికారులు తనిఖీ చేశారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు నిర్వహణతో పాటు చెత్త రవాణా సైతం ఇవ్వడానికి కసరత్తు చేస్తున్నారు. ప్రాజెక్టులో 40 శాతం డంపింగ్ యార్డులో ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ, 20శాతం చెత్త రవాణా, మొత్తం 60 శాతాన్ని రాంకీ సంస్థకు ఇవ్వనున్నారు. తర్వాత మిగిలిన 40 శాతం (ఇంటింటి చెత్త సేకరణ)ను కూడా ఇవ్వనున్నారు. అయితే ప్రస్తుతం గ్రేటర్ పరిధిలో 5000 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. దీన్ని డంపింగ్ యార్డులో సైంటిఫిక్ డిస్పోజల్ చేసినందుకుగాను రాంకీ సంస్థకు జీహెచ్ఎంసీ ప్రతినెలా సుమారు రూ.7 కోట్లకు పైగా చెల్లిస్తోంది.

అడ్డుకున్న కార్మికులు

పారిశుధ్య విభాగాన్ని రాంకీ సంస్థకు ఇచ్చి తమ పొట్టగొట్టొద్దని కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. కైతలాపూర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తనిఖీ చేయడానికి వచ్చిన కమిషనర్ దానకిషోర్, రాంకీ ఎండి గౌతంరెడ్డిని శుక్రవారం అడ్డుకున్నారు. రాంకీ గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. తమను తొలగించకుండా పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆందోళన అక్కర్లేదు: దానకిషోర్ - కమిషనర్

పారిశుధ్య కార్మికులకు జీహెచ్ఎంసీ అండగా ఉంటుంది. ఏ ఒక్కర్నీ తొలగించబోం. కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో కార్మికులదే కీలకపాత్ర.

ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దు : పాలడుగు భాస్కర్, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పారిశుధ్యం లాంటి నిరంతర సేవలను ప్రయివేటు సంస్థలకు ఇవ్వొద్దు. ఇలాంటి నిర్ణయాలు తీసుకుని ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దు. పారిశుధ్య విభాగాన్ని రాంకీ సంస్థకు ఇవ్వొద్దని ఎన్నో పోరాటాలు చేశాం. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ నిర్ణయం మారుకోవాలి.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి

- రంగారెడ్డి జిల్లా ఔటర్‌పై అంబులెన్స్‌ను ఢీకొన్న కారు
- నలుగురు మృతి.. ముగ్గురిది ఒకే కుటుంబం
- చనిపోయిన బంధువు ఇంటికెళ్తూ దంపతులు...
- నవాబ్‌పేటలో ఆర్టీసీ బస్సు బోల్తా.. 20 మందికి గాయాలు



నవతెలంగాణ-రంగారెడ్డిప్రతినిధి/యాచారం/నవాబ్‌పేట/ మునగాల/జగిత్యాల/తిమ్మాపూర్

శుక్రవారం వేర్వేరు రహదారులపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతిచెందారు. మరో 26 మంది గాయపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ కారు అంబులెన్స్‌ను ఢీకొట్టడంతో అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. అందులో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురున్నారు. సూర్యాపేట జిల్లాలో చనిపోయిన తమ బంధువుని చూసేందుకు వెళ్తున్న దంపతులను కారు ఢీకొట్టడంతో వారిద్దరు అక్కడికక్కడే మరణించారు. వికారాబాద్ జిల్లాలో బస్సు బోల్తాకొట్టి ఇరవై మంది తీవ్ర గాయాలపాలయ్యారు.

రంగారెడ్డి జిల్లా రావిర్యాల సమీపంలోని ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదిభట్ల సీఐ వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరుకు చెందిన వెంకటేశ్వరరావు(60) లివర్‌క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. బల్లారిలో చెట్ల మందులు వేయించుకుని ఏలూరుకు చెందిన ఎంహెచ్ 29ఎన్ 9244 అనే నెంబరు గల ఎస్‌కెఎస్ చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు చెందిన అంబులెన్స్‌లో తీసుకొస్తున్నారు. రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రావిర్యాల గ్రామ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 13 వద్దకు రాగానే మరో మార్గంలో నుంచి వెళ్తున్న టాటా ఎక్స్‌పో కారు అతి వేగంగా డివైడర్‌ను దాటొచ్చి అంబులెన్స్‌ను ఢీకొట్టింది. దీంతో అంబులెన్స్‌లో ఉన్న వెంకటేశ్వరావుతో పాటు ఆయన భార్య సుబ్బలక్ష్మి (55), అల్లుడు శ్రీనివాస్, డ్రైవర్ శివ(30) అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వరావు అన్న రామారావు, కుమారుడు హేమచందర్, మరో డ్రైవర్ లోహిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. వారిలో రామారావు, హేమచందర్ పరిస్థితి విషమంగా ఉంది. టాటా ఎక్స్ కారులో వనస్థలిపురంకు చెందిన కుటుంబ సభ్యులు విహారయాత్రకు వెళ్లి వస్తున్నారు. మరో పది నిమిషాల్లో బొంగ్లూర్ ఔటర్‌రోడ్డు దిగిపోతామనుకుంటుండగానే ఈ ప్రమాదం జరిగింది. కారుడ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరేందర్ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా దంపతులు..

సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన సూరేపల్లి ముత్తయ్య(55), కమలమ్మ(50) లు ముకుందాపురంలో చనిపోయిన తమ బంధువును చూసేందుకు వెళ్తున్నారు. 65వ నెంబర్ జాతీయ రహదారిని కాలినడకన దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. కమలమ్మ అక్కడికక్కడే మృతి చెందగా ముత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతిచెందాడు.

రంగారెడ్డి జిల్లా యాచారం మండలం నక్కగుట్టతండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. సీఐ మధుకుమార్ వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన జీఎన్.అనిల్‌చౌదరి (38), కుమారుడు ధర్మేష్, కూతురు తేజస్విని, అనిల్ స్నేహితుడి భార్య గౌతమిలు కలిసి శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని మియాపూర్ నుంచి వినుకొండకు ఇండికా కారులో బయలుదేరారు. తక్కళ్లపల్లి తండా వద్దకు రాగానే కారు అదుపు తప్పి అతివేగంగా చెట్టును ఢీకొట్టింది. అనిల్‌చౌదరి అక్కడికక్కడే మృతి చెందగా గౌతమి, ధర్మేశ్, తేజస్వినిలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రికి తరలించారు.

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం వెంకటాపూర్‌లో గ్రామ పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. రూరల్ ఎస్ఐ మధుకర్ తెలిపిన వివరాల ప్రకారం.. బుగ్గారం మండల కేంద్రానికి చెందిన మహేష్ (25) కోరుట్ల పట్టణంలోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వచ్చి తిరుగు ప్రయాణమయ్యాడు. వెంకటపూర్ గ్రామ పరిసరాల్లోకి చేరుకోగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలైన మహేష్ అక్కడికక్కడే మరణించాడు.

కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్ గ్రామ శివారులోని పెట్రోల్ బంక్ నుంచి మహారాష్ట్రకు చెందిన బండార్కర్ రోడ్డు దాడుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలై బండార్కర్ (30) అక్కడికక్కడే మరణించాడు. మృతుడు అల్గునూర్‌లోనే భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్నాడు.

నాగిరెడ్డిపల్లి గేటు వద్ద బస్సు బోల్తా..

వికారాబాద్ డిపోకు చెందిన ఏపీ21 జెడ్ 0324 అనే నెంబరు గల ఆర్టీసీ బస్సు శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ వైపు వెళ్తుండగా నాగిరెడ్డిపల్లి గేటు సమీపంలో ప్రమాదవశాత్తు బోల్తా పడింది. బస్సులో మొత్తం 20 మంది ఉన్నారు. ధారూర్‌కు చెందిన కిషన్, శంకర్‌పల్లికి చెందిన శ్యాంలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. వికారాబాద్ జేసీ అరుణ కుమారి, ఆర్డీఓ విశ్వనాథం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



క్వాలిటీ పెంచుకోండి

ప్రస్తుత నవీన యుగంలో సంగీతాన్ని హై డెఫినేషన్ సౌండుతో వినడానికి అందరూ ఇష్టపడతారు. కానీ, కొంత మంది వారి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో పూర్తి స్థాయి హై డెఫినేషన్ అందుకోలేరు. అటువంటి వారు మంచి క్వాలిటీ గల సౌండ్ పొందడానికి ఏమిచేయాలంటే...

ప్రస్తుత ఆండ్రాయిడ్ ప్లాట్ఫారమ్ కలిగిన స్మార్ట్ ఫోన్లు లేదా టాబ్లెట్లకు అందుబాటులో ఉన్న అన్ని మొబైల్ ఆపరేటింగ్ సిస్టమ్లకు ఇది సులభంగా అందుబాటులో ఉంటుంది. ఇది సాధారణ ఆండ్రాయిడ్ ఆపరేటింగ్ సిస్టమ్ వినియోగదారులు దాని కోర్ లక్షణాలు అనుకూలీకరించడానికి అనుమతిస్తుంది.

మీరు గనుక Android వినియోగదారులు అయితే మీ ఫోను మూలాల రహస్యాన్ని సులభంగా తెలుసుకోవచ్చు. మీరు మీ Android అనుభవాన్ని మెరుగుపరచడానికి దీనిని అందంగా ట్వీక్స్ చేయవచ్చు. దీనికోసం గూగుల్ ప్లే స్టోర్లో అనేక ఆప్స్ అందుబాటులో ఉన్నాయి. ఆడియో నాణ్యత మెరుగుపరచే విషయానికి వచ్చినప్పుడు సౌండ్ నాణ్యతను మెరుగుపరచడానికి అందుబాటులో పరిమిత సంఖ్యలో ఉన్నకొన్ని ఆప్స్ అందుబాటులో ఉన్నాయి.

మీరు Android పరికరం నుండి ఆన్లైన్లో Ainur NERO Zip ఫైల్ను డౌన్లోడ్ చేసుకోవాలి. అలాగే స్క్రీన్ దిగువన ఉన్న ఫ్లాష్ స్లయిడర్ని స్లయిడ్ చేయాలి. అప్పుడు ఫోన్ రీబూట్ అవుతుంది. అది బూట్ చేసినప్పుడు మీ ఆడియో నాణ్యతలో గణనీయంగా పెరుగుతుంది. ఇది సంగీతం లేదా వాయిస్ ప్రయోజనాల కోసం నిర్మించిన అన్ని ఆప్లకు కూడా వర్తిస్తుంది.

TWRP తో రీ బూట్ చేస్తున్నపుడు జాగ్రత్తగా ఉండాలి. మీరు దీని యాక్సెస్ చేయడానికి ముందు కచ్చితంగా నిపుణుల సహాయం తీసుకోవాలి. ఎందుకంటే ఈ రీబూట్ వలన మీ ఫోన్కు ఒక్కోసారి సమస్యలు రావొచ్చు.

ఆధార్ మీ చేతుల్లోనే

ఇప్పుడు అన్ని ప్రభుత్వ సేవలకు ఆధార్ కార్డులు తప్పనిసరి. కానీ ఈ ఆధార్ కార్డు పోయినట్లుయితే? అలాంటి సందర్భాలలో మనకు ఉన్న ఏకైక ఆప్షన్ (UIDAI) వెబ్ సైట్ ద్వారా నకిలి కార్డు పొందటమే. ఈ నేపథ్యంలో UIDAI సరికొత్త సర్వీస్ను లాంచ్ చేసింది. మీ ఆధార్కార్డు పోతే కేవలం రూ.50 చెల్లిస్తే చాలు మీ ఆధార్ కార్డు పొందవచ్చు. ఈ కొత్త ఆధార్ కార్డు స్పీడ్ పోస్ట్ ద్వారా కేవలం 5 రోజుల్లో మీ అడ్రస్కు చేరుతుంది.

గుర్తించుకోవాల్సిన మొదటి విషయం...

రిప్రింటింగ్ రిక్వెస్ట్ను రైజ్ చేయడానికి మీ ఆధార్కార్డు నెంబర్ లేదా వర్చువల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ (VID)ను గుర్తుపెట్టుకోవాలి.



స్టెప్ 1: పిసి బ్రౌజర్లో WWW.uidai.gov.in సైట్ను ఓపెన్ చేయండి. Aadhar service సెక్షన్ను ఓపెన్ చేసి Order Aadhaar Reprint (Pilot basis) అనే ఆప్షన్ను సెలెక్ట్ చేయండి. వెంటనే వేరే ట్యాబ్ ఓపెన్ అవుతుంది. అందులో మీ ఆధార్కార్డు నెంబర్ లేదా వర్చువల్ ఐడెంటిఫికేషన్ నెంబర్ VID ను అలాగే సెక్యూరిటీ కోడ్ (captcha) ను డైలాగ్ బాక్స్లో ఎంటర్ చేయండి.

స్టెప్ 2: మీరు ముందే మీ నెంబర్ను రిజిస్టర్ చేసి ఉంటె Send OTP అనే బట్టన్ను క్లిక్ చేయండి. ఒక వేళా మీరు రిజిస్టర్ చేసుకోకపోతే if you do not register your mobile number and proceed అనే డైలాగ్ బాక్స్ పై క్లిక్ చేయండి.

స్టెప్ 3: మీ ఫోన్ నెంబర్కు వచ్చిన OTP ను ఎంటర్ చేయండి. మీ డీటైల్స్ను ఒకసారి చెక్ చేసుకొని Make Payment అనే ఆప్షన్ను క్లిక్ చేసి మీకు ఈజీగా ఉన్న మోడ్లో పేమెంట్ చేయండి.

స్టెప్ 4: ఈ ప్రక్రియ అంత పూర్తయ్యాక మీకు స్క్రీన్పై కన్ఫర్మేషన్ మెసేజ్ వస్తుంది. అలాగే ఫ్యూచర్ రెఫెర్న్సు కోసం SRN number మెసేజ్ మీ ఫోన్కు వస్తుంది.

నోట్: ఒక వేళ మీరు మీ ఫోన్ నెంబర్ను రిజిస్టర్ చేసుకోకపోయుంటే స్టెప్ 2లో చెప్పిన విధానంగా enter the mobile number to receive OTP అనే ఆప్షన పై క్లిక్ చేయండి.

స్టేటస్ను ట్రాక్ చేయడానికి ఈ స్టెప్స్ ఫాలో అయిపోండి:

- WWW.resident.uidai.gov.in/check-aadhaar-reprint లింక్ను ఓపెన్ చేయండి.
- మీ ఫోన్కు వచ్చిన SRN number ను ఎంటర్ చేయండి.
- సెక్యూరిటీ కోడ్ను ఫిల్ చేసి సబ్మిట్ చేయండి.



హీటెక్కుతుంటే..!

ప్రతి కంపెనీ మొబైల్ తయారీ సమయంలో దాని మీద డూప్లికేట్ ఛార్జింగ్ కేబుల్స్ ఉపయోగించకూడదని రాసి ఉంటుంది. ఎందుకంటే డూప్లికేట్ ఛార్జింగ్ వాడినట్లయితే ఫోన్ బ్యాటరీ పాడయ్యే ప్రమాదం ఉంది. ఫోన్ హీటెక్కడానికి ఇది కూడా ఓ ప్రధాన కారణం. కాబట్టి ఒరిజినల్ ఛార్జర్ని మాత్రమే ఉపయోగించండి.

ఆండ్రాయిడ్ మొబైల్ వాడే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. మీ చేతుల్లో కూడా అలాంటి మొబైల్ ఉండే ఉంటుంది. అయితే స్మార్ట్ మొబైల్స్లో ఫీచర్స్ ఎక్కువగా ఉండటం వల్ల వాడకం కూడా ఎక్కువగా ఉంటుంది. దాంతో ఒక్కోసారి బాగా హీటెక్కుతుంది. ఈ వేడి దెబ్బకి ఒక్కోసారి మొబైల్స్ పేలిపోయే ప్రమాదం కూడా ఉంది. మొబైల్ హీటెక్కడానికి అనేక రకాల కారణాలు ఉంటాయి. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు కొన్ని చిట్కాలు ఉన్నాయి. ఈ చిట్కాలు పాటించినట్లయితే మన ఫోన్ని ఓవర్ హీట్ నుండి రక్షించుకోవచ్చు. ఆ చిట్కాలేంటో ఓ సారి చూద్దాం.

చెక్ చేసుకోండి

ఫోన్ ఛార్జింగ్ పెట్టే సమయంలో చెక్ చేసకోవాలి. పగటి సమయంలో అయితే కేవలం 70 నుంచి 80 శాతం వరకు మాత్రమే ఛార్జింగ్ ఉండేలా చూసుకోండి. రాత్రి వేళ అయితే 100 శాతం ఛార్జింగ్ అయ్యేలా చూసుకోండి.

వైఫై

వైఫై వాడకానికి ఫోన్ హీటింగ్కి సంబంధం ఉండకపోవచ్చు. కానీ ఒక్కోసారి దీని వల్ల కూడా సమస్యలు వస్తూ ఉంటాయి. వైఫై ఉన్న సమయంలో బ్యాక్ గ్రౌండ్ యాప్స్ రన్ అవుతూ ఉంటాయి. కాబటటి వైఫై ఉన్న సమయంలో ఈ యాప్స్ని మీరు చెక్ చేసుకోండి.



బ్లూటూత్

బ్లూటూత్ కానీ జీపీఎస్ కానీ అవసరం ఉన్నప్పుడే ఆన్ చేయాలి. అనవసర టైంలో ఆన్ చేయడం వల్ల బ్యాటరీ త్వరగా ఛార్జ్ అయిపోతూ ఉంటుంది. దీనివల్ల ఫోన్ హీట్ కూడా ఎక్కుతుంది. అందుకే బ్లూటూత్, జీపీఎస్ అవసరమైనప్పుడు మాత్రమే ఆన్ చేసి పెట్టుకోవాలి.

వాడకం తగ్గించండి

మీ ఫోన్ వాడకం వీలయినంతగా తగ్గిస్తే చాలా మంచింది. 24 గంటలు దానితోనే ఉండటం వల్ల మీ మొబైల్ కే కాకుండా మీకు కూడా సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

పూర్తిగా తగ్గించాలి

యూట్యూబ్ వాడకాన్ని పూర్తిగా తగ్గిస్తే చాలామంచిది. లైవ్ స్ట్రీమింగ్ జోలికి వెళ్లకండి ఒక వేళ వెళ్లినా వీలయినంత తక్కువ సమయం కేటాయించండి.

గేమ్స్ ఆడుతుంటే

ఫోన్ చేతిలో ఉంటే చాలామందికి గేమ్స్ మీదకే దృష్టి పోతుంది. కాస్త ఖాళీ సమయం దొరికినే అదే పనికి గేమ్స్ ఆడుతుంటారు. అయితే ఇది చాలా ప్రమాదం. దీన్ని వల్ల కూడా ఫోన్ హీటెక్కే అవకాశం ఉంది. అందుకే ఇలాంటి అలవాటు ఉన్నవారు తగ్గించుకునేందుకు ప్రయత్నించండి.

ప్లాస్టిక్ కవర్లు వద్దు

ఫోన్ అందంగా కనపడాలని ఏవేవో కవర్లు వేస్తుంటారు. వాటి జోలికి వెళ్ళవద్దు. ముఖ్యంగా Plastic, Leather Case ల జోలికి అసలు వెళ్లవద్దు. వీటివల్ల ఫోన్ వేడెక్కే అవకాశాలు చాలా ఉన్నాయి.

డ్యామేజ్ అయితే...

బ్యాటరీ డ్యామేజి అయిందని తెలిస్తే దాన్ని వెంటనే మార్చుకోవడం చాలా ఉత్తమం. లేకుంటే ఫోన్ పేలిపోయే ప్రమాదం ఉంది. అలాగే మీ ఫోన్ని వాటర్కి వీలయినంత దూరంగా ఉంచండి. ముఖ్యంగా స్నానం చేసే సమయంలో మ్యూజిక్ వినడం లాంటి పనులు చేయవద్దు.

బ్రైట్నెస్ తగ్గించండి

మీరు ఫోన్ వాడే సమయంలో ఫోన్ బ్రైట్ నెస్ని వీలయినంతగా తగ్గించుకోవడం ఉత్తమం. ఎందుకంటే ఎక్కువ బ్రైట్ నెస్ మీ ఫోన్ బ్యాటరీని తినేస్తుంది. కాబట్టి మీకు ఎంత కావాలో అంత మాత్రమే సెట్ చేసుకోండి.

కూలింగ్ యాప్స్ వాడండి

జంక్ ఫైల్స్ ఎప్పటికప్పుడు క్లీన్ చేసుకోండి. దీనికోసం కొన్ని రకాల యాప్స్ అందుబాటులో ఉన్నాయి. వాటిని వాడండి. అలాగే ఫోన్ కూలింగ్ యాప్స్ వాడండి. Cooling Master-Phone cooler, Device cooler Heat Minimizer, Device Cooler - Colling Master, Coolify లాంటి యాప్స్ వాడటం ద్వారా మీ ఫోన్ కూల్ గా ఉంచుకోవచ్చు.

అప్రమత్తంగా ఉండాలి

చాలామంది ఫీచర్స్ బాగున్నాయాన్ని వాటి గురించి ఏమీ తెలుసుకోకుండా నచ్చిన వెంటనే డౌన్లోడ్ చేసుకుంటారు. అయితే వీటిలో కొన్ని ఫీచర్స్ బ్యాటరీని తినేస్తాయి. ఈ విషయం పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏవైనా కొత్త వాటిని డౌన్ లోడ్ చేసేటప్పుడు నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

టెక్నాలజీపరంగా మీరేదైనా సమస్యను ఎదుర్కొన్నారా.. దానిని మీరెలా పరిష్కరించారు..? ఇలాంటి అనుభవాలేమైనా ఉంటే మాకు రాసి పంపండి. మా చిరునామా : 'టెక్‌ప్లస్' పేజీ, నవ తెలంగాణ దినపత్రిక, ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, ఆజామాబాద్, ఆర్.టి.సి కల్యాణ మండపం వీధి, హైదరాబాద్ - 500020.

tech+@ navatelangana.com

సరికొత్తగా వచ్చేస్తున్నది

ఇన్స్టాగ్రామ్... సోషల్ నెట్వర్కింగ్ సైట్లల్లో ఫుల్ ట్రెండింగ్లో ఉండే ఫోటో షేరింగ్ ప్లాట్ఫామ్. ప్రతి దశలోనూ తన సరికొత్త ఫీచర్లతో వినియోగదారులను అలరిస్తూ, ప్రతి రోజూ కొత్తగా చేరుతున్న వేలకొలదీ వినియోగదారులతో ముందుకు దూసుకుని పోతూ ఉంది. వీటిల్లో ఈ మధ్య ఇన్స్టాగ్రామ్ పొందుపరచిన సరికొత్త ఫీచర్లలో "నేం టాగ్" ఫీచర్ కూడా ఒకటి. సాధారణంగా ఇతరులను మిమ్ములను అనుసరించడానికి, తరచుగా మీ ప్రొఫైల్ను వారితో పంచుకోవడం జరుగుతుంటుంది. దీని వల్ల కొన్ని సమస్యలు వస్తుంటాయి. ఈ సమస్యలను నివారించేందుకు మీ ప్రొఫైల్ కోడ్ ను సాధారణ స్కాన్ సహాయంతో సులభంగా గుర్తించేందుకు ఈ ఫీచర్ వెసులుబాటును కల్పిస్తుంది. అంటే మీ ప్రొఫైల్ గుర్తించడాన్ని సులభతరం చేస్తుంది.

బై బటన్

ఫేస్ బుక్ ఆధీనంలో ఉన్న ఇన్స్టాగ్రామ్ వచ్చే ఈ ఏడాది నుంచి వినియోగదారుల కోసం షాపింగ్ ఫీచర్ని అందుబాటులోకి తీసుకువస్తున్నది. మీరు ఇకపై మీ ఇన్స్టాగ్రామ్ యాప్ నుండే నేరుగా షాపింగ్ చేసుకోవచ్చు. దీనికోసం ప్రత్యేకంగా బై బటన్ని తీసుకొస్తోంది.

బటన్ ఉపయోగం

మీరు ఇన్స్టాగ్రామ్ యాప్లో ఉన్న బై బటన్ని క్లిక్ చేయగానే నేరుగా మీరే ఏ పేజీనైతే క్లిక్ చేశారో ఆ సెల్లర్ వెబ్ పేజీలోకి వెళుతుంది. తద్వారా యూజర్లు తమకు నచ్చిన ఉత్పత్తులను నేరుగా అక్కడి నుండే కొనుగోలు చేయవచ్చు.

యుఎస్ లో ప్రయోగం

ఈ ఫీచర్ని యుఎస్లో 2016 నుంచి ప్రయోగిస్తున్నారు. అక్కడ ఈ ఫీచర్ విజయవంతం కావడంతో ఆ తర్వాత దీన్ని 46 దేశాలకు విస్తరించారు. కాగా అక్కడ ఈ ఫీచర్ విజయవంతం కావడం వల్ల మరిన్ని



దేశాలకు దీన్ని విస్తరించేందుకు కంపెనీ రెడీ అయింది. ఇందులో ఇండియా కూడా ఉంది. ఈ విషయాన్ని ETtech రిపోర్ట్ చేసింది.

90 మిలియన్ అకౌంట్లు

ఇన్స్టాగ్రామ్ చెప్పిన వివరాల ప్రకారం ప్రతి నెలా 90 మిలియన్ అకౌంట్లు ఈ షాపింగ్ ఫీచర్ మీద ట్యాప్ చేస్తున్నాయని తెలిపింది. ప్రొడక్ట్ మీద క్లిక్ చేయగానే దానికి సంబంధించిన పూర్తి సమాచారం ఇన్స్టాగ్రామ్ వాల్ మీద ప్రత్యక్షమవుతుంది.

20 Products

ప్రతి మెంబర్ 5 ప్రొడక్ట్ల ఇమేజ్ లేక వీడియోలను అలాగే 20 ప్రొడక్టుల సమాచారాన్ని పేజీ నుండి తెలుసుకోవచ్చు. అలాగే సెల్లర్లు వీడియోలు ఇమేజ్లను స్టిక్కర్ ద్వారా యాడ్ చేసుకోవచ్చని ఇన్స్టాగ్రామ్ టీం చెబుతోంది. అలాగే ఈ ఉత్పత్తులను షేర్ చేసుకునే సౌలభ్యాన్ని కూడా కల్పిస్తోంది.

పేమెంట్

ఇన్స్టాగ్రామ్ పేజీ నుండే నేరుగా పేమెంట్ చెల్లించేలా ఈ మధ్య ఫీచర్ని తీసుకువచ్చారు. సింపుల్ ప్రాసెస్ లో ఈ కామర్స్ షాపింగ్ అయ్యేలా ఇన్స్టాగ్రామ్ బై బటన్లో మార్పులు చేర్పులను చేసింది. యూజర్లు సమయాన్ని కూడా ఆదా చేసుకునే విధంగా ఇది అందుబాటులోకి వచ్చింది.

ఒప్పో R15 ప్రో

ఫోన్ 6GB RAM , 128GB అంతర్గత మెమొరీతో వస్తుంది. ఇది 25,990 రూపాయల ధరతో అమెజాన్ ద్వారా ప్రత్యేకంగా అందుబాటులో ఉంటుంది. ఈ డివైజ్, ప్రత్యేకంగా Amazon.in ద్వారా విక్రయించబడుతోంది. దానిపై కొన్ని లాంచ్ ఆఫర్లు కూడా ఉన్నాయి. ఈ డివైజ్ ఒక ముఖ్యమైన లక్షణం పైన నోచ్, ఇది 6.28 అంగుళాల FHD + డిస్ప్లేను కలిగి ఉంది. VOOC ఛార్జింగుకు మద్దతు ఇస్తుంది. అయితే దీని IP రేటింగ్స్ గురించి మాత్రం ఇక్కడ ప్రస్తావించలేదు. ఈ స్మార్ట్ ఫోన్ కూడా 'మెరుగైన - AI' కెమెరాలతో, వెనుకవైపున డ్యూయల్ సెన్సార్, ఒక ఫ్రంట్ ఫేసింగ్ సెన్సార్ను కూడా వుంది.

Oppo R15 Pro ప్రత్యేకతలు

ఈ R15 ప్రో ఒక 6.28 అంగుళాల HD + OLED ప్యానల్ను 19: 9 డిస్ప్లే ఆస్పెక్ట్ రేషియాతో, 89 శాతం స్క్రీన్ -టూ- బాడీ నిష్పత్తితో కలిగివుంది. ఇది క్వాల్కమ్ స్నాప్ డ్రాగన్ 660 ప్రాసెసర్, 6 GB RAM, 128 GB అంతర్గత మెమొరీతో పాటు మైక్రో SD కార్డ్ ద్వారా 256GB వరకు మెమొరీని పెంచుకునే సామర్థ్యాన్ని కలిగివుంటుంది. ఈ స్మార్ట్ ఫోన్, Android 8.1Oreo OS పైన ఆధారపడిన ColorOS 5.0 తో నడుస్తుంది. ఇది 3430 mAh బ్యాటరీతో వస్తుంది. ఈ ఫోన్ కేవలం ఐదు నిమిషాల ఛార్జింగుతో రెండు గంటల టాక్ టైమును అందిస్తుందంటున్నారు.

నయామాల్




ఆప్టిక్స్ పరంగా, ఒప్పో R15 ప్రో వెనుక 20 MP + 16MP డ్యూయల్ కెమెరా సెటప్ ఉంటుంది. ఇక్కడ రెండు సెన్సార్లకు F / 2.0 ఎపర్చరు లెన్స్ లభిస్తుంది. ముందు 20 MP f / 2.0 ఎపర్చరు తో సెన్సారుతో ఈ డివైజ్ వస్తుంది. ఈ ఫోన్, డ్యూయల్ సిమ్ (నానో + నానో), డ్యూయల్ స్టాండ్బై (4G + 4G) బ్లూటూత్ 5.0 తో పాటు, NFC కి కూడా మద్దతు ఇస్తుంది.

Oppo R15 Pro ధర, లభ్యత లాంచ్ ఆఫర్లు

ఇది కాస్మిక్ పర్పుల్, రూబీ రెడ్ రంగులలో వస్తుంది. ఈ ఫోన్ కొనుగోలుకు కొన్ని లాంచ్ ఆఫర్లు కూడా ఉన్నాయి. దీనితో జీయో వినియోగదారులు 3.2 జీబి డేటాను, రూ .4,900 వరకు లాభం పొందవచ్చు. బజాజ్ ఫైన్ సర్వ్ EMI కార్డులపై కొనుగోలుచేసేవారికి No Cost EMI కూడా అందువబాటులో ఉంది. అలాగే అమెజాన్ పే ICICI క్రెడిట్ కార్డుపై రూ.3000 కంటే పైన చెల్లింపు చేసేవారికి కూడా ఇది వర్తిస్తుంది. అన్ని ప్రధాన క్రెడిట్ కార్డులపై కూడా No Cost EMI అందుబాటులో వుంది. కొన్ని ఎంపిక చేసిన డెబిట్ కార్డులకు కూడా వర్తిస్తుంది.

సైన్స్ కార్నర్



అంగారకుడిపైకి స్పేస్ క్రాఫ్ట్

అంతరిక్ష ప్రయోగంలో నాసా మరో విజయం సాధించింది. అంగారకుడిపై ఎప్పటి నుంచో ప్రయోగాలు చేస్తున్న నాసా తాజాగా ఇన్సైట్ స్పేస్క్రాఫ్ట్ను విజయవంతంగా అంగారకుడిపైకి పంపింది. అంతేకాదు అంగారకుడిపై నుంచి తొలి ఫొటోను తీసి పంపింది. ఈ చిత్రాన్ని నాసా విడుదల చేసింది. ఇక అంగారకుడిపై ల్యాండ్ అయిన ఈ స్పేస్ క్రాఫ్ట్ ఆ గ్రహానికి సంబంధించి లోతైన పరిశోధనలు చేపబడుతున్నది. 1976 వికింగ్ ప్రొట్ తర్వాత అంగారకుడిపై స్పేస్ క్రాఫ్ట్ ల్యాండ్ చేయాలని భావించిన నాసా ఒకసారి తప్ప అన్ని సార్లు విజయం సాధించింది.

బోర్డర్-గవాస్కర్ సమరం ముగిసింది. చారిత్రక సిరీస్ కోహ్లిసేన చేతికి చిక్కింది. టెస్టు ఫార్మాట్‌ను అత్యున్నత స్థాయిలో ముగించిన కోహ్లిసేన.. ఇప్పుడు ప్రపంచకప్‌పై మనసు పెడుతోంది. మిషన్ వరల్డ్‌కప్‌లో భాగంగానే గెలుపు కూర్పుపై ధ్యాస పెట్టింది. కొత్త కొత్తగా కనిపిస్తోన్న కంగారూపై వన్డేల్లో హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోన్న కోహ్లిసేన.. ఇక నుంచి వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి మార్పు, ఆలోచించే ప్రతి వ్యూహం ప్రపంచకప్ కోసమే!.
నేడు సిడ్నీలో ఆసీస్‌తో భారత్ తొలి వన్డే.



మిషన్ వరల్డ్‌కప్!

- ఆ ధ్యాసతోనే ఆసీస్‌తో వన్డే పోరు
- ఫామ్ సాధించటంపై ధోని గురి
- భారత్, ఆస్ట్రేలియా తొలి వన్డే నేడు

ఉదయం 7.50 నుంచి సోనీసిక్స్‌లో...

సిడ్నీ (ఆస్ట్రేలియా)

ఆసీస్ గడ్డపై అసమానుల పోరాటం!. రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లిలతో కూడిన టాప్-3 త్రయం భారత్ బ్యాటింగ్ వెన్నెముక కాగా, ఆసీస్ తరపున అరోన్ ఫించ్, అలెక్స్ కారే, ఉస్మాన్ ఖవాజలు టాప్-3లో ఉన్నారు. ఏడాదిగా నిలకడగా దుమ్మురేపుతోన్న రోహిత్, ధావన్, కోహ్లి కాంబినేషన్ కొత్త ఏడాదిలో కొట్టుడు మొదలుపెడితే ఆతిథ్య ఆసీస్‌కు చుక్కలు కనిపించటం లాంఛనమే. టాప్-3లోనే కాదు మిడిల్, లోయర్ సహా బౌలింగ్ విభాగంలోనూ కోహ్లిసేనతో ఆసీస్ సమవుజ్జీగా ఏమాత్రం కనిపించటం లేదు. కొత్త కూర్పుతో కోహ్లిసేనతో తలపడేందుకు సిద్ధమవుతున్న ఆస్ట్రేలియా నేడు జోరుమీదున్న టీమ్ ఇండియాను ఏ విధంగా నిలువరిస్తుందనేది ఆసక్తికరం.

మహి మెరిసేనా? : మిషన్ వరల్డ్‌కప్‌లో మహేంద్రసింగ్ ధోనిని భాగం చేయాలనే ఆలోచన సరైనదే అని చెప్పేందుకు ఆసీస్‌తో సిరీస్‌ను మహి వినియోగించుకునే అవకాశం కనిపిస్తోంది. యువ రిషబ్ పంత్ జోరుమీదున్న వేళ ఫామ్‌లో లేని ధోనిని కేవలం అనుభవం పేరిట ప్రపంచకప్‌కు పంపించటం సరైన నిర్ణయం కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధోని పేలవ ఫామ్ విమర్శలకు మరింత బలం చేకూరుస్తోంది. సిడ్నీలో కాలుమోపగానే ప్రాక్టీస్‌లో నిమగ్నమైన ధోని అసలు పోరులో మునుపటి వాడి వేడీ చూపిస్తాడా? లేదా అనే ఉత్కంఠ కొనసాగుతోంది. హార్దిక్ పాండ్య లేకపోవటంతో తుది జట్టు కూర్పు సమతుల్యం కోల్పోయినా.. జడేజా అతడి స్థానంలో జట్టులోకి రానున్నాడు. టాప్-3 రోహిత్, ధావన్, కోహ్లిలతో పాటు రాయుడు సైతం ఫామ్ కొనసాగించాలని కోరుకుంటున్నాడు. గాయాల నుంచి తిరిగొచ్చిన కేదార్ జాదవ్ ప్రదర్శన సైతం ఆసక్తికరమే. బంతితో భువనేశ్వర్, ఖలీల్, షమిలు ఉత్సాహంగా ఉన్నారు. జడేజాకు తోడు కుల్దీప్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

ఆసీస్ పోటీనిచ్చేనా? : స్టీవ్ స్మిత్, డెవిడ్ వార్నర్‌లపై నిషేధం పడిన తర్వాత ఏ ఫార్మాట్‌లోనూ సిరీస్ విజయం సాధించని ఆస్ట్రేలియా ఇప్పుడూ ఆ ఆశలు పెట్టుకోలేదు. అరోన్ ఫించ్ నాయకత్వంలోని ఆసీస్ బలహీనంగా కనిపిస్తోంది. ఓపెనర్ అలెక్స్ ఆడిన 17 ఫస్ట్ క్లాస్ ఇన్నింగ్స్‌ల్లో స్ట్రయిక్‌రేట్ కనీసం 80 కూడా లేదు. ఉస్మాన్ ఖవాజ సైతం ఫామ్‌లో లేడు. హ్యాండ్స్‌కాంబ్ టెస్టు వైఫల్యంతో ఒత్తిడిలో కూరుకుపోయాడు. స్టోయినిస్, మాక్స్‌వెల్, సిడిల్‌లు వన్డే సిరీస్‌ను నూతనంగా ఆరంభించనున్నారు. కీలక పేసర్లకు విశ్రాంతి లభించటంతో బంతితోనూ ఆతిథ్య జట్టు పేలవమే అనిపిస్తోంది.

పిచ్ రిపోర్టు : చివరి టెస్టు సందర్భంగా సిడ్నీలో వరుణుడు చికాకు పెట్టించినా, వన్డే పోరుకు అటు వైపు వెళ్లటం లేదు!. సిడ్నీ పిచ్ ఫ్లాట్‌గా కనిపిస్తోంది, పిచ్‌పై కొంత పచ్చిక వదిలేసినా పరుగుల వరద పారటం ఖాయం అనిపిస్తోంది. సిడ్నీలో భారత్, ఆస్ట్రేలియాలు 16 వన్డేల్లో తలపడగా కేవలం రెండింటిలో మాత్రమే టీమ్ ఇండియా విజయం సాధించింది. చివరగా ఇక్కడ ఆడిన (2016) వన్డేలో 331 టార్గెట్‌ను మరో రెండు బంతులుండగానే భారత్ ఛేదించింది. అప్పటి శతక హీరో మనీశ్ పాండే తాజా జట్టులో లేడు.

తుది జట్లు (అంచనా) : ఆస్ట్రేలియా : అరోన్ ఫించ్ (కెప్టెన్), అలెక్స్ కారే, ఉస్మాన్ ఖవాజ, షాన్ మార్ష్, పీటర్ హ్యాండ్స్‌కాంబ్, మార్కస్ స్టోయినిస్, గ్లెన్ మాక్స్‌వెల్, పీటర్ సిడిల్, రిచర్డ్‌సన్, నాథన్ లైయాన్, జేసన్ బెహన్‌డార్ఫ్.

భారత్ : రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి (కెప్టెన్), అంబటి రాయుడు, ఎం.ఎస్ ధోని, కేదార్ జాదవ్, రవీంద్ర జడేజా, భువనేశ్వర్ కుమార్, కుల్దీప్ యాదవ్, ఖలీల్ అహ్మద్, మహ్మద్ షమి.



'భువి, బుమ్రాలు కాకుండా మరో ఇద్దరు, ముగ్గురు నాణ్యమైన పేసర్ల అన్వేషణలో ఉన్నాం. రేసులో ఉన్న వారు సత్తా చాటేందుకు ఈ మ్యాచులు ఓ వేదిక, ఇదే సమయంలో ఆత్మవిశ్వాసం సైతం సాధించే అవకాశం ఉంది. అటువంటి పేస్ కూర్పు కోసం ప్రయత్నిస్తున్నాం'
- విరాట్ కోహ్లి, భారత కెప్టెన్

65 వన్డేల్లో 5000 పరుగుల మైలురాయికి శిఖర్ ధావన్ మరో 65 పరుగుల దూరంలో ఉన్నాడు. జడేజా 2000 పరుగుల కోసం మరో 18 పరుగులు చేస్తే చాలు!.

1 వంద వికెట్ల క్లబ్‌లో చేరేందుకు స్వింగ్‌మాస్టర్ భువనేశ్వర్‌కు ఒకే ఒక్క వికెట్ అవసరం.



వేటు పడింది!

- పాండ్య, రాహుల్‌లపై సస్పెన్షన్
- న్యాయ విచారణ తర్వాతే జట్టులోకి?

ముంబయి : మహిళల పట్ల అనుచిత, అసభ్య రీతిలో వ్యాఖ్యలు చేసిన యువ క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లపై బీసీసీఐ కొరడా ఝులిపించింది. సినిమా స్టార్ కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఓ టెలివిజన్ షోలో పాండ్య, రాహుల్‌లు వ్యక్తిగత విషయాలపై పిచ్చాపాటిగా మాట్లాడుతూ, నియంత్రణ కోల్పోయారు!. ఆదివారం ఈ షో ప్రసారమైన తర్వాత, వీరి వ్యాఖ్యలపై దుమారం రేగింది. తొలుత పాండ్య, రాహుల్‌లకు షోకాజ్ నోటీసు ఇచ్చిన బీసీసీఐ, సంజాయిషీతో సమాధాన పడలేదు. ఇద్దరిపై రెండు వన్డేల నిషేధం విధించాలని పాలకుల కమిటీ చైర్మన్ వినోద్ రాయ్ సిఫారసు చేయగా, సీవోఏ సభ్యురాలు న్యాయ విభాగం సలహా కోరింది. న్యాయ విభాగం సూచన మేరకు, తదుపరి విచారణ పూర్తయ్యేవరకూ ఇద్దరిపై సస్పెన్షన్ వేటు వేస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకున్నది. బీసీసీఐ సీఈవో లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్న సమయంలో అమలు చేసిన ప్రక్రియనే ఇప్పుడూ అవలంభిస్తున్నారు. బీసీసీఐ నిర్ణయంతో ప్రస్తుత ఆస్ట్రేలియా సిరీస్‌తో పాటు న్యూజిలాండ్ పర్యటనకు సైతం పాండ్య, రాహుల్ దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. కెప్టెన్ విరాట్ కోహ్లి సైతం యువ ద్వయం వ్యాఖ్యలను ఏమాత్రం సమర్థించబోమని, వారి వ్యక్తిగత అభిప్రాయాలని.. డ్రెస్సింగ్‌రూమ్ సంస్కృతికి సంబంధం లేని అంశమని పేర్కొన్నాడు.

ఇప్పుడెలా? : హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లపై సస్పెన్షన్ వేటు పడటంతో జట్టును వీడి, స్వదేశానికి రానున్నారు. తొలుత దీనిపై సందిగ్ధత కొనసాగినా, కెప్టెన్ కోహ్లి వీరి వ్యాఖ్యల పట్ల అసంతృప్తి వ్యక్తం చేయగా వెంటనే స్వదేశానికి వచ్చేమని బోర్డు ఆదేశాలిచ్చింది. ఆసీస్‌తో మూడు వన్డేలకూ అందుబాటులో ఉండరనే విషయం తేలిపోగా, న్యూజిలాండ్ పర్యటన లోగా విచారణ పూర్తి అవుతుందా? లేదా అనేది సమస్య. ప్రపంచకప్ ప్రణాళికలో కీలకమైన హార్దిక్ పాండ్య, కెఎల్ రాహుల్‌లు ఈ వన్డేలకు దూరం కావటం ఇబ్బందికరమే. వీరి స్థానంలో రిషబ్ పంత్, మనీశ్ పాండేలను ఆస్ట్రేలియాకు పంపించే అవకాశముందని బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచకప్‌కు ముందు ఆడాల్సిన వన్డేలు తక్కువగా ఉండటంతో వీరిపై మరిన్ని మ్యాచుల నిషేధానికి జట్టు మేనేజ్‌మెంట్ వ్యతిరేకత చూపే అవకాశం లేకపోలేదని బోర్డు వర్గాలు అంటున్నాయి.

ఫైనల్లో బెంగళూర్

- సెమీస్‌లో ఓడిన అవాధె వారియర్స్
- ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

బెంగళూర్ : బెంగళూర్ రాప్టర్స్ అదరగొట్టింది. పీబీఎల్ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం బెంగళూర్‌లోని కంఠీరవ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్లో అవాధె వారియర్స్‌పై గెలుపొందిన బెంగళూర్ రాప్టర్స్ టైటిల్ పోరుకు సై అనేసింది. స్టార్ షట్లర్లు కిదాంబి శ్రీకాంత్, బి. సాయిప్రణీత్‌లు మెరవటంతో బెంగళూర్ అలవోకగా నెగ్గింది. తొలుత మిక్స్‌డ్ డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో క్రిస్టియన్‌సేన్, అశ్విని పొన్నప్ప జోడీ 15-7, 15-10తో బెంగళూర్ జంట ఎలిస్, స్మిత్‌లపై గెలుపొందారు. దీంతో అవాధె 2-0 ఆధిక్యం సాధించింది. కానీ తర్వాత వరుసగా బెంగళూర్ రెచ్చిపోయింది. తొలి మెన్స్ సింగిల్స్‌లో 15-9, 15-4తో బి. సాయిప్రణీత్ నెగ్గగా.. 15-7, 15-10తో సన్‌వాన్ హోపై కిదాంబి శ్రీకాంత్ పైచేయి సాధించాడు. దీంతో స్కోరు 2-2తో సమమైంది. బెంగళూర్ మెన్స్ డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో 15-4, 15-9తో సెథిరన్, మహ్మద్ అశన్ జోడి గెలుపొంది బెంగళూర్‌ను 4-2తో ముందంజలో నిలిపారు. ఈ విజయంతో బెంగళూర్ సెమీస్ విజయం ఖాయం చేసుకుని, ఫైనల్లోకి అడుగుపెట్టింది.



మోడీ అర్ధరాత్రి నిర్ణయాలు !

రాఫెల్ పత్రాలు బయటకొస్తాయన్న భయమా?

- అలోక్‌వర్మ బదిలీపై అనుమానాలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశానికి బ్రిటీషోళ్లు అర్ధరాత్రి స్వాతంత్ర్యం ఎందుకిచ్చారో తెలియదు కానీ, కేంద్రంలో మోడీ ప్రభుత్వం అర్ధరాత్రి నిర్ణయాలతో ప్రజలందర్నీ ఆందోళనకు గురిచేస్తున్నారు. నోట్ల రద్దు నిర్ణయాన్ని అర్ధరాత్రి తీసుకుని మెజార్టీ ప్రజల ఆక్రందనలకు కారణమయ్యారు. ఒకటి కాదు ఇలా ఎన్నెన్నో నిర్ణయాలతో ప్రజల జీవనం చిన్నాభిన్నమైంది. ప్రజల కోసం పనికొచ్చేది గాకుండా చిన్నాభిన్నం చేసేందుకు మోడీ ప్రభుత్వం అర్ధరాత్రి నిర్ణయాలతో భయపెడుతున్నదని విశ్లేషకుల అభిప్రాయం.మరోవైపు ప్రజాస్వామ్యంపైనా, రాజ్యాంగ వ్యవస్థలపైనా మోడీ దాడులు చేస్తూ సర్వనాశనం చేయడానికి పూనుకున్నారు. సీబీఐ డైరెక్టర్‌గా తిరిగి బాధ్యతలు చేపట్టిన మరుసటి రోజే అలోక్‌వర్మను మరోచోటకు బదిలీ చేస్తూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చాలామందిని కలవరపాటుకు గురిచేసింది. సీబీఐ డైరెక్టర్ ఆలోక్‌వర్మను బలవంతపు సెలవుపై పంపించడం చెల్లదనీ, ఆయన్ని ఆ పదవిలో పునర్నియమిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన మరునాడే, గురువారం సాయంత్రం వర్మను ఆ పదవి నుంచి మోడీ నేతత్వంలోని అత్యున్నత స్థాయి కమిటీ తొలగించడాన్ని చాలామందిని ఆశ్చర్యానికి గురిచేసింది. వర్మ బదిలీని ప్రభుత్వవర్గాలు సమర్థించుకున్నా, కోపంతో కక్షగట్టుకుని పంపించినట్టుగా ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. కమిటీ నిర్ణయం అనేదానికంటే కావాలనే కక్షగట్టి వర్మను సీబీఐ నుంచి పంపించారన్న చర్చ సాగుతున్నది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలోక్‌వర్మను ఆ పదవిలో కొనసాగించడం సీబీఐ ప్రతిష్టకే భంగకరం కనుక ఆయన్ని ఆ పదవి నుంచి తప్పించి అగ్నిమాపక సర్వీసుకు బదిలీ చేయాల్సి వచ్చిందని ప్రభుత్వం సమర్థించుకుంది. రాఫెల్ స్కామ్ పత్రాలు బయటకొస్తాయన్న భయంతోనే మోడీ వర్మను బదిలీ చేసి ఉంటారని తెలుస్తోంది. ఆధారాలతో సహా రాఫెల్ పత్రాలను బీజేపీ సీనియర్ నేతలు యశ్వంత్‌సిన్హా, అరుణ్‌శౌరి వర్మకు అందించారన్న సమాచారంతోనే సీబీఐలో వివాదం అంటూ ప్రత్యేక డైరెక్టర్ ఆస్తానాతో పాటు వర్మను సెలవులపై పంపారన్న ప్రచారం గతంలోనే నడిచింది. కోర్టు ఆదేశాలతో బాధ్యతలు తీసుకున్న కొద్ది గంటల్లోనే వర్మ అక్టోబర్ 23 నుంచి జనవరి 8 వరకు తీసుకున్న బదిలీలను రద్దు చేయడం కేంద్రప్రభుత్వానికి కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఈ భయమే మోడీప్రభుత్వ నిర్ణయానికి కారణమై ఉంటుందని తెలుస్తోంది. అయితే ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వర్మ రాజీనామా చేయడం విశేషం. బాధ్యతలనుండి పూర్తిగా తప్పుకున్న వర్మ కేంద్రం అనుసరించిన విధానాలను బయటపెడతారా? కేంద్రమే ఆయనపై కేసులు మోపి బెదిరిస్తుందా? అన్న దానిపై ఏదో ఒకటి తేలడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

వర్మను సీబీఐ డైరెక్టర్ పదవి నుంచి తొలగిస్తూ అత్యున్నత స్థాయి కమిటీలోని మోడీ, జస్టిస్ సిక్రీలు నిర్ణయం తీసుకోగా మల్లిఖార్జున ఖర్గే వ్యతిరేకించినట్టు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అవినీతి ఆరోపణలు ఉన్నందున, వాటిపై అత్యున్నత స్థాయి కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకునే వరకు బాధ్యతలు చేపట్టిన అలోక్‌వర్మ విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్‌గొగొయ్ సూచించిన విషయం తెలిసిందే. కోర్టు ఆదేశాలతో కమిటీ సమావేశమైనప్పుడు, అందులో తీసుకున్న విషయాలను న్యాయస్థానానికి అందించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉంటుందని పలువురు న్యాయమూర్తులు సూచిస్తున్నారు. ఆ కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కూడా మెంబర్. తన బదులు జస్టిస్ సిక్రిని నియమించారు. అలోక్‌వర్మ బదిలీ వెనుక కేంద్రప్రభుత్వ ఒత్తిడి పనిచేసిందా? కమిటీ నిర్ణయమా? అన్నది తేలాల్సి ఉంది. సీవీసీ నివేదికలో అస్తానాపై నిజాలు బయటపడలేదా? ఆయన సచ్ఛీలుడని కేంద్రం చెప్పదలుచుకుందా? ఇలా వర్మ బదిలీపై అనేక ప్రశ్నలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీబీఐ డైరెక్టర్ స్థాయిలో ఉన్న వ్యక్తిపై అవినీతి ఆరోపణలు వస్తే వాటిపై ఉన్నత స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు తేల్చాల్సిన మోడీ ప్రభుత్వం అలా చేయకుండా బదిలీ ఎందుకు చేసినట్టు? ఆయన అవినీతికి పాల్పడితే శిక్షించడం ద్వారా సంస్థ ప్రతిష్టను మరింత పెంచవచ్చు కదా అని పలువురు సూచిస్తున్నారు. తనకు సంబంధం లేని విషయాల్లో ఇరికించి కావాలని తనను సెలవులపై పంపారని సుప్రీంకోర్టుకు ఇచ్చిన పిటిషన్‌లో పేర్కొన్న వర్మను, మళ్లీ అదే సీవీసీ నివేదిక ఆధారంగా ఎలా బదిలీ చేస్తారన్నది ప్రశ్న. దీనిపై వివరణ ఇచ్చుకునేందుకు అలోక్‌వర్మకు అవకాశం ఇవ్వాలని కమిటీలో ప్రతిపక్ష పార్టీ నేత సూచనకు విలువ ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని కాంగ్రెస్‌నేతలు మండిపడుతున్నారు. ఏరికోరి తెచ్చిపెట్టుకున్న వ్యక్తి ఎదురుతిరగడంతో అతనికి అవినీతి మరకలు అంటించడమెనుక కుట్రకోణం దాగి ఉన్నదని తెలుస్తోంది. తమ ప్రభుత్వంపై రాఫెల్ స్కామ్ బయటపడకుండా ఉండేందుకు మోడీ కొత్త డ్రామా ఆడారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోడీ వచ్చాక ప్రభుత్వ వ్యవస్థలను నాశనం చేయడంతో పాటు న్యాయస్థానాలను తప్పుదారి పట్టించడం, తీర్పులను నీరు గార్చడం, రాజ్యాంగాన్ని అవహేళన చేయడం పరిపాటైందని ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.